RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



23 జనవరి 2025 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:199

# దావోస్‌లో తెలంగాణ ప్రభుత్వం కీలక ఒప్పందాలు



హైదరాబాద్‌దావోస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ బృందం పర్యటిస్తోంది ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. మేఘా ఇంజినీరింగ్, ప్రభుత్వం మధ్య మూడు ఒప్పందాలు జరిగాయి. 2,160 మెగావాట్ల పంప్ స్టోరేజ్ ప్రాజెక్ట్ కోసం 11వేల కోట్లతో ఒప్పందం జరిగింది. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ కోసం మరో 3వేల కోట్లు, అనంతగిరిలో ప్రపంచ స్థాయి లగ్జరీ వెల్నెస్ రిసార్ట్ ఏర్పాటు కోసం రూ.1000 కోట్లతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది.

# ఇండస్ట్రీ మొత్తం మీద దాడులు



హైదరాబాద్, జనవరి 22 హైదరాబాద్ నగరంలోని టాలీవుడ్ సినీ ప్రముఖుల ఇళ్లపై ఐటీ శాఖ అధికారుల దాడులు రెండో రోజు బుధవారం కూడా కొనసాగుతున్నాయి. దిల్ రాజు నివాసాలు, కార్యాలయంలో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. నిర్మాత దిల్‌రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, మైత్రీ మూవీస్, మ్యాంగో మీడియా నిర్మాతలు, వారి కుటుంబీకులు, కార్యాలయాల్లో సోదాలు జరుగుతున్నాయి. పుష్ప 2 దర్శకుడు సుకుమార్ ఇంట్లోనూ ఐటీ సోదాలు జరుగుతున్నాయి. సోదాల్లో భాగంగా బ్యాంకు లాకర్లను కూడా ఓపన్ చేసి తనిఖీలు చేస్తున్నారు.

కృష్ణానగర్‌లోని దిల్‌రాజు ఆఫీస్‌లో ఐటీ రెయిడ్స్ కంటిన్యూ అవుతున్నాయి. దిల్‌రాజు ఇటీవల నిర్మించిన సినిమాల బడ్జెట్‌పై అధికారులు ఆరా తీశారు. చెల్లించిన ఆదాయపు పన్నుకు.. వస్తున్న రాబడులకు పొంతన లేకపోవడంపై ప్రశ్నించినట్టు తెలుస్తోంది. నిన్న దిల్‌రాజు భార్యతో బ్యాంక్ లాకర్లు తెరిపించిన అధికారులు.. ఇవాళ మరికొన్ని డాక్యుమెంట్లను పరిశీలించారు. రేపు కూడా ఐటీ సోదాలు కొనసాగే అవకాశం ఉంది.ఐటీ సోదాలపై సినీ నిర్మాత, తెలంగాణ ఈఆఅ ఛైర్మన్ దిల్ రాజు స్పందించారు. ఐటీ సోదాలు కొనసాగుతున్న నేపథ్యంలో బుధవారం ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆయన.. మీడియా ప్రతినిధులకు అభివాదం చేశారు. ఐటీ సోదాలు తన ఒక్కడిపైనే జరగడం లేదని.. ఇండస్ట్రీ మొత్తం మీద దాడులు కొనసాగుతున్నాయని చెప్పారు. బుధవారంనాడు ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.సంక్రాంతికి విడుదలైన భారీ బడ్జెట్ సినిమాలు గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం రెండింటినీ దిల్ రాజు తెరకెక్కించారు. ఈ నేపథ్యంలో ఆయన నివాసం, కార్యాలయాల్లో ఐటీ అధికారులు సోదాలు జరగడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. అలాగే పుష్ప 2 మూవీకి వచ్చిన కలెక్షన్స్‌పై ఐటీ శాఖ అధికారులు ఫోకస్ చేశారు. ప్రధానంగా ఈ మూడు చిత్రాల ప్రొడక్షన్ బడ్జెట్, ఆ సినిమాలకు వచ్చిన కలెక్షన్స్, వారు ఐటీ శాఖకు కట్టిన పన్నులపై ఆ శాఖ అధికారులు ప్రధానంగా ఆరా తీస్తున్నారు.సంక్రాంతి మూవీస్ కలెక్షన్ల పేరిట జరిగిన ప్రచారంతో వీటిపై ఐటీ శాఖ అధికారులు దృష్టిపడినట్లు తెలుస్తోంది. దీంతో ఆ సినిమాలకు సంబంధించిన వారిపై ఇన్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ సోదాలు చేయడం టాలీవుడ్ ఇండస్ట్రీలో కాకరేపుతోంది.



**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ 18వ రాజీవ్ గాంధీ అండర్ 19 - డే/నైట్ మ్యాచ్ ఎల్.బీ.స్టేడియంలో మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమత్ రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొన్న మాజీ గన్‌ఫౌండ్రీ కార్పోరేటర్ కాంగ్రెస్ నాయకురాలు మమతా సంతోష్ గుప్తా ఈ కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మణ్ యాదవ్ , శ్రీకాంత్ గౌడ్ , నాగభూషణం , అఫర్ యూనిస్ జీ, శ్రీనివాస్ గౌడ్ మరియు క్రీడాకారులు తదితరులు

# ప్రపంచ స్థాయి అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్ ను అభివృద్ధి చేస్తాం

## ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి



ప్రపంచ స్థాయి అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్ ను అభివృద్ధి చేయాలనే తెలంగాణ ప్రభుత్వ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, హీరో మోటార్ కార్ప్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ ను ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన, పర్యావరణ అనుకూల నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలని అన్నారు.

"తెలంగాణలో నాలుగు కోట్ల మంది ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు సహకరించాలని అందరినీ ఆహ్వానిస్తున్నాం. తక్కువ ఖర్చుతో ప్రజలు వేగంగా ప్రయాణించాలన్నది మా ప్రభుత్వ ఆకాంక్ష. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చుతుంది.

తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలో భాగంగా హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. పర్యావరణహితంగా హైదరాబాద్ ను నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దాలనేది మా అభిమతం.



ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ అవకాశాలు హైదరాబాద్లో ఉండాలని కోరుకుంటున్నాం. ఎలక్ట్రిక్ వెహికిల్స్ పై మేము ప్రత్యేక దృష్టిని సారించాం. ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దు చేశాం. భారత దేశంలోనే ఈవీ వాహనాలు అత్యధికంగా అమ్ముడుపోయే రాష్ట్రం తెలంగాణ.

మొబిలిటీ ఒక్కటే అన్నింటికీ పరిష్కారం కాదు. ఇప్పుడున్న పరిస్థితులను పర్యావరణ అనుకూలంగా మార్చాల్సిన అవసరం ఉంది. అందుకే గ్రేటర్ హైదరాబాద్ సిటీలో ప్రజా రవాణా వ్యవస్థలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడుతున్నాం.

తెలంగాణ డ్రైపోర్టును నిర్మించి వేర్ హౌజ్ హబ్ గా తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్రానికి తీరప్రాంతం లేని లోటును పూడ్చడానికి ఈ డ్రై పోర్టును మచిలీపట్నం పోర్టుకు రోడ్డు, రైల్వే మార్గాలతో అనుసంధానం చేస్తాం. నగరాల అభివృద్ధికి, వాటి భవిష్యత్తుకు అర్బన్ మొబిలిటీ భవిష్యత్తుకు పునాది. తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో చేరుకునే రవాణా సదుపాయాలున్న నగరాలే ఎక్కువ కాలం మనగలుగుతాయి.

హైదరాబాద్ నగరంలో 1.2 కోట్లకు పైగా జనాభా ఉంది. దాదాపు 100 కిలోమీటర్లకు పైగా కొత్తగా మెట్రో లైన్లను నిర్మిస్తున్నాం. ఇప్పుడున్న దానికంటే ఇది రెండింతలు ఎక్కువ. నేను నా బృందంతో కలిసి జ్యూరిచ్ నుంచి దావోస్ కు రైలులో ప్రయాణించాం. అదొక అందమైన అనుభూతిని కలిగించే ప్రయాణం.

ప్రస్తుతం హైదరాబాద్ చుట్టూ 160 కి.మీ మేరకు ఔటర్ రింగ్ రోడ్డు ఉంది. ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల 360 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నాం. ఆ రెండు రింగ్ రోడ్లను కలుపుతూ రేడియల్ రోడ్లు కూడా నిర్మిస్తాం. రింగ్ రోడ్లకు అనుబంధంగా రింగ్ రైల్వే లైను నిర్మించాలనే ఆలోచనలున్నాయి.

ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో అర్బన్ మొబిలిటీపై నా అభిప్రాయాలను పంచుకునే అవకాశం ఇచ్చినందుకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, హీరో మోటార్ కార్ప్ కు కృతజ్ఞతలు." అని సీఎం తెలిపారు.

# గ్యారెంటీలపై ప్రజలే నిలదీస్తున్నారు - కేటీఆర్



ఖమ్మం, జనవరి 22 రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామసభలో గ్యారంటీలు ఏవని ప్రజలు గర్జిస్తున్నారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదని విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన సత్తుపల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ నేతల సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు."గ్యారెంటీ స్కీమ్ ల కోసం ప్రజలు గల్లీ గల్లీలో కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారు. రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదని గ్రామసభల సాక్షిగా తేలిపోయింది. గత సంవత్సర కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును చూసి ప్రజలు విసిగిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యంపై జనాగ్రహం ఏ స్థాయిలో ఉందో గ్రామ/వార్డు సభలను చూస్తే తెలుస్తోంది.ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామసభల్లో ప్రభుత్వాన్ని గ్యారంటీలపై నిలదీస్తున్నారు" అని కేటీఆర్ చెప్పారు.గ్రామసభలకు వేసిన టెంట్లను కూడా ప్రజలు కోపంతో పీకేస్తున్నారని కేటీఆర్ చెప్పుకొచ్చారు. "సత్తుపల్లిలో సండ్ర వెంకటవీరయ్య, ఖమ్మంలో పువ్వాడ అజయ్ ఓడిపోవడంతో ఆ నియోజకవర్గ ప్రజలు ఎంతో కోల్పోయారు. గ్రామాలు, పట్టణాల్లో కేసీఆర్ హయాంలో జరిగినన్ని పనులు గతంలో ఎప్పుడూ జరగలేదు. కేసీఆర్ హయాంలో ఆ పరిస్థితి మారింది. పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి జరిగింది" అని కేటీఆర్ గుర్తు చేశారు.

### భవిష్యత్ బీఆర్ఎస్ పార్టీదే?

ఏడాది కాలంలోనే ప్రజా వ్యతిరేకతను కాంగ్రెస్ మూటగట్టుకుందని కేటీఆర్ దుయ్యబట్టారు. ఇక భవిష్యత్ బీఆర్ఎస్ పార్టీదేనని? సత్తుపల్లిలో మళ్లీ ఎగిరేది గులాబీ జెండానే అని స్పష్టం చేశారు.మళ్లీ కేసీఆర్‌ను సీఎం చేసుకునే దాకా విశ్రమించకుండా పోరాడుదామని పిలుపునిచ్చారు."ఉమ్మడి ఖమ్మంలో మళ్లీ బీఆర్ఎస్ జయకేతనం ఎగురవేస్తుంది. సత్తుపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు 23 మంది బీఆర్ఎస్ నుంచి గెలిస్తే 17 మంది ఇంకా పార్టీలోనే కొనసాగుతుండటం పార్టీ పట్ల వారికున్న విధేయతకు నిదర్శనం. రైతుల సమస్యలపై అధ్యయన కమిటీ వేశాం. రానున్న రోజుల్లో ప్రజా వ్యతిరేక ప్రభుత్వంపై మరింత గట్టిగా సమిష్టిగా పోరాడదాం. త్వరలోనే సత్తుపల్లి నేతలతో కేసీఆర్ సమావేశమవుతారు" అని కేటీఆర్ వివరించారు.

# ప్రజాబలం

23 జనవరి 2025 గురువారం


## కాల్పుల విమరణ ఇజ్రాయెల్ జిమ్మిక్కు!

గాజాపై ఇజ్రాయిల్ జరిపిన పదిహేను నెలల మారణకాండ తర్వాత జరిగిన ఒప్పందంతో ప్రస్తుతానికి అది ఆగిపోయింది. దీంతో అటు పాలస్తీనియన్లు, ఇటు ఇజ్రాయిలీలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఉపశమనం ఎంతకాలం ఉంటుందో ఎవరూ చెప్పలేరు. కాపురం చేసే కళ కాళ్ల గోళ్ల దగ్గరే తెలుస్తుందంటారు.ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత గాజాలో రాఫా ప్రాంతంలో ఒక బాలుడితో సహా ముగ్గుర్ని ఇజ్రాయిలీ దళాలు కాల్చిచంపాయి. పాలస్తీనాలోని మరో ప్రాంతమైన పశ్చిమ గట్టు జెరూసలెం నగర పరిసరాల్లోని గ్రామాల్లో దురాక్రమణదారులుగా ఉన్న ఇజ్రాయిలీలు తమ మిలిటరీ కనుసన్నల్లో పాలస్తీనియన్ల మీద దాడులకు తెగబడ్డారు. మారణకాండతో పోలిస్తే చూసేవారికి ఇవి చిన్న ఉదంతాలుగానే కనిపించవచ్చు గానీ చిత్తశుద్ధి లేదనేందుకు నిదర్శనం. అందుకే కాల్పుల విరమణ ఒప్పందంతో ఎవరూ పండుగ చేసుకోవటం లేదు. పాలస్తీనియన్లకు రెండు అవకాశాలు మాత్రమే ఉన్నాయి. ఒకటి యూదు మూకల దాడుల్లో ప్రాణాలు అర్పించటం లేదా మాతృభూమి కోసం తెగబడి ప్రతిఘటించటం. ఏడు దశాబ్దాలుగా జరుగుతున్నదిదే. అదే ఇజ్రాయిలీలను చూస్తే వారికి ప్రాణభయం లేకున్నా, ఎటువైపు ఎవరు దాడి చేస్తారో అన్నభయంతో బతుకులీడుస్తున్నారు. సైరన్ల మోతలు వినిపిస్తే చాలు సొరంగాల్లోకి వెళ్లాల్సి వస్తోంది. గాజాలో 47వేల మందిని చంపివేశారు. వీరిలో 80శాతం మంది మహిళలు, పిల్లలే ఉన్నారు. ఒప్పందం మూడు దశల్లో అమలు జరుగుతుంది.హమాస్ వద్ద ఉన్న బందీలు, ఇజ్రాయిల్ వద్ద ఉన్న నిర్బంధితుల విడుదల తరువాత గాజా పరిస్థితి అజెండాలోకి రానుంది.రెండవ దశలో ఇజ్రాయిల్ సైన్యం పూర్తిగా గాజా నుంచి వైదొలగటం, నిరాశ్రయులైన వారిని స్వస్థలాలకు రప్పించటం, బందీలు–ఖైదీలను పూర్తిగా విడుదల చేయటం, మూడవ దశలో హమాస్ చేతుల్లో బందీలుగా ఉండి మరణించిన వారి మృతదేహాల అప్పగింత ఇతర అంశాలు ఉంటాయి. ఈ ఒప్పందం గురించి ఎవరికి ఉండే అనుమానాలు వారికి ఉన్నప్పటికీ అంగీకారం మేరకు ఆదివారం నుంచి అమలు ప్రారంభమైంది.నిర్ణీత గడువులోగా హమాస్ విడుదల చేసే ముగ్గురు బందీల పేర్లు చెప్పలేదంటూ కాల్పుల విరమణ ప్రారంభమైనప్పటికీ రెండు గంటల వ్యవధిలో ఇజ్రాయిల్ మిలిటరీ దాడులు జరిపి 19 మంది ప్రాణాలు తీసి 36 మందిని గాయపరిచిందంట్టే ఏ చిన్నసాకు దొరికినా మాట తప్పేందుకు పూనుకుంటుందన్న అనుమానం తలెత్తింది. ఆదివారం నాడు బందీలలోని ముగ్గురు మహిళలను హమాస్ రెడ్‌క్రాస్ ప్రతినిధులకు అప్పగించింది. దానికి ప్రతిగా ఇజ్రాయిల్ తొంభైమంది పాలస్తీనియన్లను వదలిపెట్టింది. తదుపరి 25వ తేదీ(శుక్రవారం నాడు) మరో నలుగురు మహిళలను అప్పగించనుంది. ఒక్కో బందీకి 30 లేదా 50 మంది పాలస్తీనియన్లను విడుదల చేయవచ్చని వార్తలు వచ్చాయి. మొత్తం 33 మంది బందీలు, వెయ్యికిపైగా నిర్బంధితుల విడుదల ఆరువారాల ప్రక్రియ సాఫీగా ముగిసిన తరువాత రెండవ దశ అమల్లోకి వస్తుంది. ఎవరెన్ని భాష్యాలు చెప్పినప్పటికీ కొన్ని వాస్తవాలను ఎవరూ మూసిపెట్టలేరు. ఇజ్రాయిల్ డేగకన్ను కప్పి హమాస్ సాయుధులు గాజా సరిహద్దులో ఉన్న ఇజ్రాయిల్ భూభాగంలో ప్రవేశించి 2023 అక్టోబరు ఏడు రాత్రి జరిపిన దాడుల్లో 1,139 మరణించారు, 200 మందిని బందీలుగా పట్టుకున్నారు. దానికి ప్రతీకారం పేరుతో ఇజ్రాయిల్ మిలిటరీ మరుక్షణం నుంచి 2025 జనవరి 19వ తేదీ వరకు మారణకాండ జరుపుతూనే ఉంది. హమాస్ దాడులను ఎవరూ సమర్ధించలేదు, కానీ ఇజ్రాయిల్ దుర్మార్గాన్ని మానవహక్కులు, మానవత్వం గురించి నిత్యం పారాయణం చేసే పశ్చిమ దేశాలు నిస్సిగ్గుగా సమర్ధించాయి, అమెరికా అయితే గాజాను ధ్వంసం చేసేందుకు సామూహికంగా జనాన్ని చంపేందుకు రెండువేల పౌండ్ల బరువుండే భారీ బాంబులను కూడా సరఫరా చేస్తామని చెప్పింది.ప్రపంచంలో అత్యంత ఆధునిక నిఘా, ప్రత్యర్థులను మట్టుబెట్టే పరిజ్ఞానం ఇజ్రాయిల్ సొంతమని ఎంతోమంది చెబుతారు. అయితే గాజా, హమాస్ విషయంలో అది వాస్తవం కాదని పదిహేను నెలల పరిణామాలు రుజువు చేశాయి. హమాస్ వద్ద ఆధునిక ఆయుధాలు లేవన్నది బహిరంగ రహస్యం. వారికి ఉన్నది జనబలం, ఆదరణ మాత్రమే.ఎక్కడ ఉంటారో,ఎవరు సాయుధుడో, ఎవరు సాధారణ పౌరుడో గుర్తించలేనంతగా మమేకమయ్యారు. ప్రతి ఒక్కరూ పౌరుడే, అవసరమైపుడు సాయుధుడే. వ్యూహం ఎప్పటికప్పుడు మార్చుకోగలిగిన నేర్పరితనాన్ని బతుకుపోరు నేర్పింది. అందుకే ఇజ్రాయిల్ మిలిటరీ సామూహిక మారణకాండ, విధ్వంసకాండకు పాల్పడింది. ఆసుపత్రులు, స్కూళ్ల భవనాలను నేలమట్టం గావించింది. సొరంగాల్లో ఉన్నారంటూ వాటిని ఉప్పునీటితో నింపింది. అమెరికా,బ్రిటన్, జర్మనీ వంటి దేశాలిచ్చిన ఆధునిక ఆయుధాలు హమాస్ ముందు పనికిరాకుండా పోయాయి. అణుబాంబు వేస్తే పీడాపోతుందని ఇజ్రాయిల్ మంత్రి ఎలియాహు అనేవాడు పదే పదే డిమాండ్ చేశాడంటే ప్రతిఘటన వారిని ఎంతగా కలవరపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. అదిగో హమాస్‌ను మట్టుపెడతాం ఇదిగో అంటూ కబుర్లు చెప్పారు. బేషరతుగా లొంగిపోతేనే దాడులను విరమిస్తామన్నారు, ఏదీ జరగలేదు. 'బలవంతుడైన సర్పము చలిచీమల చేత చిక్కి చచ్చిన' పరిస్థితి వచ్చింది. వివరాలు రాకుండా మూసిపెట్టారు గానీ ఇజ్రాయిల్ ఉనికిలోకి వచ్చిన 1948 తరువాత అరబ్బులతో జరిపిన యుద్ధాల్లో దేనిలోనూ చవిచూడని నష్టాలను పదిహేను నెలల గాజా ఊచకోతలో సంభవించినట్లు చెబుతున్నారు. ఒక వైపు హమాస్, దానికి మద్దతుగా లెబనాన్‌లో హిజబుల్లా, ఎమెన్‌లో అన్సర్ అల్లా సాయుధులు జరిపిన దాడులు ఇజ్రాయిల్ మిలిటరీని ఉక్కిరిబిక్కిరి చేశాయి, ఆర్థికంగా ఎంతో నష్టపరిచాయి. అందుకే చివరకు కతార్ మధ్యవర్తిత్వంలో కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించక తప్పలేదు. అనేక ఎదురు దెబ్బలు తగిలినప్పటికీ హమాస్ రానున్నరోజుల్లో మరింతగా బలపడుతుందని విశ్లేషిస్తున్నారు. నిజానికి ఇప్పుడు కుదిరిన ఒప్పందంలోని అంశాలను గతేడాది మే నెలలోనే ప్రతి పాదించినపుడు హమాస్ అంగీకరించినా ఇజ్రాయిల్ ముందుకు రాలేదు. అమెరికా కూడా ఒత్తిడి చేసినట్లు నాటకమాడింది తప్ప చేసిందేమీ లేదు. మొత్తంగా చూసినపుడు ఇజ్రాయిల్ లొంగుబాటునే ప్రపంచం ఎక్కువగా చూస్తున్నది. తమ మిలిటరీ నాయకత్వం గురించి ఎన్నో భ్రమలు పెట్టుకున్న సాధారణ ఇజ్రాయిలీ పౌరుల్లో తాజా పరిణామాలను చూసిన తరువాత కలచెదిరిందని వేరే చెప్పనవసరం లేదు.ఒప్పందం గురించి జోబైడెన్ మాట్లాడుతూ తాను గతేడాది ప్రతిపాదించిన అంశాలను ఆనాడు భద్రతా మండలి కూడా ఆమోదించిందని, తాజా ఒప్పందం కూడా అదే మాదిరి ఉందని పేర్కొన్నాడు. కానీ ఇదే పెద్ద మనిషి ఐదుసార్లు అదే భద్రతా మండలిలో కాల్పుల విరణమణ ప్రతిపాదనలపై ఒకటి కాదు ఐదుసార్లు వీటో ప్రయోగించిన అంశం దాస్తే దాగేది కాదు. తన కారణంగానే ఒప్పందం జరిగిందని చెప్పుకుంటున్నాడు. అయితే డోనాల్డ్ ట్రంప్ ఆ ఖ్యాతి పూర్తిగా తనదే అన్నాడు. తాను విజయం సాధించిన తరువాతే ఈ పరిణామాలు జరిగినందున తన ప్రభావమే పని చేసిందని చెప్పుకుంటున్నాడు. ఏడాది పాటు బైడెన్ చేయలేని దాన్ని ఒక్క భేటీతో తమ ప్రతినిధి సాధించినట్లు అతగాడి శిబిరం వర్ణించింది. దీన్లో ఎవరి వాటా ఎంత అన్నది పక్కన పెడితే గుణపాఠాలు ఏం తీసుకుంటారన్నది ప్రశ్న.గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదరటాన్ని ఇజ్రాయిల్ కమ్యూనిస్టుపార్టీ స్వాగతించింది. ప్రారంభం నుంచి ఖైదీలు, అపహరణకు గురైనవారు, నిర్బంధితులు, బందీలు ప్రతి ఒక్కరినీ వదలిపెట్టే విధంగా ఒప్పందం కుదరాలని తాము కోరుకున్నట్లు తెలిపింది. అలాంటి ఒప్పందంతో వేలాది మంది పాలస్తీనియన్ల, వందలాది మంది ఇజ్రాయిలీల ప్రాణాలు నిలుస్తాయని పేర్కొన్నది.ఈ ఒప్పందంతోనే తాము సంతృప్తి చెందటం లేదని, ఆక్రమణ, దిగ్బంధనాలకు స్వస్తి పలుకుతూ పాలస్తీనియన్ల స్వయం పాలిత హక్కు, ఇజ్రాయిల్‌తో పాటు స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు దిశగా సంప్రదింపులు కొనసాగాలని కోరింది. తక్షణ లక్ష్యంగా గాజా ప్రాంత పునర్‌నిర్మాణం ఉండాలని, యావత్ ప్రపంచం ఆ బాధ్యత తీసుకోవాలని కమ్యూనిస్టు పార్టీ విజ్ఞప్తి చేసింది.

## నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి:ప్రభుత్వ పథకాల అమలుకు గ్రామసభల నిర్వహణలో భాగంగా గంగాధర మండలం నారాయణపూర్ లో ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి హాజరయ్యారు.

నారాయణపూర్ రిజర్వాయర్ ను సందర్శించారు. అనంతరం గ్రామసభలో మాట్లాడుతూ గత ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి తక్కువ ఆయకట్టుకు నీరిచ్చిందని అన్నారు. ఈ ప్రభుత్వం తక్కువ ఖర్చులో ఎక్కువ ఆయకట్టుకు నీరు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నదని తెలిపారు. అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రాజెక్టుల జాబితాలో నారాయణపూర్ రిజర్వాయర్ ను చేరుస్తామని తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి అవసరమైన సుమారు 70 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని ప్రకటించారు. ఏడాదిలోగా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీళ్లు అందిస్తుందని అన్నారు. రిజర్వాయర్ ముంపు విషయంలో నారాయణపూర్ ప్రజలకు న్యాయం చేస్తామని తెలిపారు.

నారాయణపూర్ లో నాలుగు ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి పథకం వర్తించేలా చూస్తామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగును నింపేందుకు తమ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని వివరించారు.

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న వారందరికీ కార్డు అందుతుందని తెలిపారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా తెలంగాణలో ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని, ఈనెల 26న మరో నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టామని వివరించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు.

జనవరిలోనే ఎల్లంపల్లి జలాలు విడుదల.

గతంలో ఎప్పుడూ లేనివిధంగా జనవరి మాసంలోనే నారాయణపూర్ జలాశయానికి ఎల్లంపల్లి నీరును విడుదల చేశామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు.

మెట్ట ప్రాంతంగా ఉన్న చొప్పదండి నియోజకవర్గంలో జల యజ్ఞంలో భాగంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణపూర్ జలాశయానికి శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. 90 శాతం పనులు కూడా పూర్తి చేసిందని అన్నారు.

మిగిలిన 10 శాతం పనులను గత సర్కారు పట్టించుకోలేదని అన్నారు. నారాయణపూర్ జలాశయం పనులన్నీ పూర్తి చేస్తామని, మిగిలిన ఆయకట్టుకు కూడా నిరందిస్తామని వివరించారు.

ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు గతంలో సమర్పించిన దరఖాస్తులన్నీ పరిగణలోకి తీసుకున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. అర్హులుగా ఉన్న వారి పేరు గ్రామసభలో లేకపోతే అక్కడే దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. చాలా ఏళ్లుగా పెండింగ్లో ఉన్న రేషన్ కార్డుల ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మి కిరణ్, ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ పాల్గొన్నారు.

## ప్రత్యేక ఆకర్షణగా తెలంగాణ పెవిలియన్

హైదరాబాద్,ప్రజాబలం ప్రతినిధి: జనవరి 22 ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో ఈసారి తెలంగాణ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గతానికి భిన్నంగా ఈసారి ఇండియన్ గ్యాలరీలోనే అన్ని రాష్ట్రాలకు ప్రత్యేక పెవిలియన్ కేటాయించారు. "తెలంగాణ మీన్స్ బిజినెస్" అనే థీమ్‌తో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్ దేశ విదేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలను, నిపుణులను ఆకట్టుకుంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో పాటు అందుబాటులో ఉన్న నైపుణ్య వనరులు, తెలంగాణకు ఉన్న అనుకూలతలను చాటిచెప్పేలా ఈ పెవిలియన్ ను అందంగా తీర్చిదిద్దారు. అభివృద్ధి నినాదాలతో తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలను ప్రదర్శించారు. దేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన సిటీగా హైదరాబాద్ నగరానికి ఉన్న ప్రత్యేకతలు, ఆకర్షణలను కళ్లకు కట్టించేలా బ్యాక్ గ్రౌండ్ వాల్ పోస్టర్లను అమర్చారు.తెలంగాణలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల సమాచారాన్ని ఈ పెవిలియన్ లో పొందుపరిచారు. దేశంలోనే మూడో అతి పెద్ద మెట్రో నెట్ వర్క్, ఎయిర్ పోర్ట్ వరకు మెట్రో విస్తరణ, దేశ విదేశీ ప్రయాణీకులకు అనువైన అంతర్జాతీయ విమానాశ్రయం, హైదరాబాద్ చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు కొత్తగా తలపెట్టిన రీజనల్ రింగ్ రోడ్డుతో మెరుగైన రవాణా సదుపాయాలను ఇందులో ప్రస్తావించారు.తెలంగాణలో నైపుణ్యాలకు కొదవలేదంటూ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవెలప్‌మెంట్‌కు ఇచ్చిన ప్రాధాన్యాన్ని చాటుకుంది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో దేశంలోనే మొట్ట మొదటగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాదాపు18 రంగాలకు చెందిన వివిధ పరిశ్రమలకు అవసరమైన ప్రపంచ స్థాయి నైపుణ్యాలపై యువతకు శిక్షణను అందిస్తోంది. వీటితో పాటు ఐఎస్ బీ, ఐఐటీ, నల్సార్ లాంటి ప్రముఖ విద్యా సంస్థలను ఈ జాబితాలో ప్రస్తావించారు.తెలంగాణలో పెట్టుబడులకు ప్రజా ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల విధానాలను ఇందులో ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన చిన్న, మధ్యతరహా పరిశ్రమల విధానంతో పాటు, ఎలక్ట్రిక్ వెహికల్స్, లైఫ్ సైన్స్‌సెస్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, ఇంధన రంగాల అభివృద్ధికి ప్రోత్సహకాలతో పాటు పరిశ్రమలకు అవసరమైన అనుమతులకు సులభమైన సింగిల్ విండో క్లియరెన్స్ విధానాన్ని ఇందులో ప్రస్తావించారు.దేశంలోనే ఉన్నత జీవన ప్రమాణాలు అందుబాటులో ఉన్న అత్యంత నివాసయోగ్యమైన నగరం హైదరాబాద్. చారిత్రకంగా సాంస్కృతికంగా వారసత్వంగా హైదరాబాద్ సిటీకి ప్రాధాన్యతలు, ఇక్కడి కళా సంపదను ప్రచారం చేయటంతోపాటు గ్రేటర్ సిటీ అభివృద్ధికి ఉన్న భవిష్యత్తు లక్ష్యాలను ఇందులో విశ్లేషించారు. భద్రతతో పాటు తక్కువ జీవన వ్యయం ఉన్న నగరాల్లో ఒకటిగా హైదరాబాద్ పెట్టుబడులకు గమ్య స్థానంగా నిలిచింది.హైదరాబాద్ నగరం ఏర్పడినప్పటి నుంచి ఎదిగిన తీరును చార్మినార్ తో పాటు సికింద్రాబాద్ క్లాక్ టవర్, హైటెక్ సిటీ.. అధునాతన ఫ్యూచర్ సిటీ నమూనాను తలపించే వాల్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. తెలంగాణ రైజింగ్ 2050 లక్ష్యానికి అనుగుణంగా ఫ్యూచర్ సిటీ 14 వేల ఎకరాల్లో విస్తరిస్తుందని, అందులో 6000 ఎకరాల్లో అటవీ పరిరక్షణ ఎకో జోన్ ఉంటుందని.. ఇది దేశంలోనే మొట్టమొదటి నెట్ జీరో సిటీగా అభివృద్ధి చెందుతుందని భవిష్యత్తు విజన్ను ఇందులో పొందుపరిచారు. ఇన్నోవేషన్, ఎలక్ట్రానిక్స్, మెడికల్ టూరిజం, మరియు ఎకో–టూరిజం వంటి ప్రత్యేక జోన్లతో "వర్క్, లైవ్, లెర్న్, ప్లే" కాన్సెప్ట్ పై ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది.

## పెరిగిన మావోయిస్టుల మృతుల సంఖ్య

భువనేశ్వర్, జనవరి 22 మావోయిస్టుల అత్యున్నత స్థాయి నిర్ణయాధికార విభాగమైన 'కేంద్ర కమిటీ' సభ్యుడు, 2003 అక్టోబరు 1న నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు టార్గెట్‌గా మావోయిస్టులు జరిపిన క్లెమోర్ మైన్స్ దాడిలో కీలక సూత్రధారి అయిన చలపతి అలియాస్ రామచంద్రా రెడ్డిని భద్రతా దళాలు మట్టుబెట్టాయి. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్‌లో సోమవారం రాత్రి జరిగిన ఎన్‌కౌంటర్‌లో చలపతి చనిపోయాడని భద్రతా దళాలు వెల్లడించాయి.

చలపతి స్వస్థలం రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా.బస్తర్‌లోని అబుజ్‌మద్ దండకారుణ్యంలో అతడు చాలాకాలం పాటు చురుకుగా కార్యకలాపాలు కొనసాగించాడు. మావోయిస్టులకు వ్యూహరచన చేయడంలో, కార్యకలాపాలను నడిపించడంలోనూ చలపతి కీలక పాత్ర పోషించాడు. అతడికి ఎల్లప్పుడూ 8 నుంచి 10 మంది వ్యక్తిగత గార్డులు భద్రత కల్పించేవారు.

చలపతి తలపై ఏకంగా రూ.1 కోటి రివార్డు కూడా ఉంది. అబుజ్‌మద్ అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్‌ల సంఖ్య పెరిగిపోవడంతో భద్రత కోసం కొన్ని నెలల క్రితమే చలపతి తన స్థావరాన్ని ఒడిశా సరిహద్దుకు మార్చాడని ఇంటలిజెన్స్ సంస్థలు పసిగట్టాయి. ఈ విషయాన్ని భద్రతా దళాలకు చేరవేశాయి. దాంతో.. పక్కా వ్యూహంతో, సమాచారంతో రంగంలోకి దిగిన భద్రతా దళాలు.. చలపతిని మట్టుబెట్టాయి.గరియాబంద్ ఎన్‌కౌంటర్‌లో చలపతితో పాటు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డు కూడా చనిపోయినట్టు భద్రతా దళాలు వెల్లడించాయి. ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతుండడంతో ఈ సంఖ్య పెరగవచ్చని భద్రతా దళాల అధికారులు చెబుతున్నాయి. జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), సీఆర్‌పీఎఫ్‌తో పాటు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కోబ్రా, ఒడిశాకు చెందిన స్పెషల్ ఆపరేషన్ గ్రూప్‌నకు చెందిన దాదాపు 1,000 మంది భద్రతా దళాలు సంయుక్తంగా ఈ భారీ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. మావోయిస్టుల్ని అన్ని వైపుల నుంచి చుట్టుముట్టి కాల్పులు జరుపుతుండడంతో.. ఈ స్థాయిలో మావోలు మృత్యువాత పడ్డుతున్నారని అధికారులు తెలుపుతున్నారు.ఒడిశాలోని నుపద జిల్లా సరిహద్దుకు కేవలం 5 కిలోమీటర్ల లోపల ఛత్తీస్‌గఢ్‌లోని కులారిఘాట్ రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో ఎన్‌కౌంటర్ జరుగుతోందని చెప్పారు. ఇంటలిజెన్స్ సమాచారం ఆధారంగా ఎన్‌కౌంటర్ మొదలుపెట్టామని వివరించారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్‌తో పాటు పెద్ద సంఖ్యలో తుపాకులు, మందుగుండు సామగ్రి, ఐఈడీలను స్వాధీనం చేసుకున్నామని ఒక అధికారి ప్రకటించారు. ఎదురుకాల్పులు జరిగిన ప్రదేశంలో భారీ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని వివరించారు.నక్సల్స్ రహిత భారతదేశాన్ని ఆవిష్కరించాలనే లక్ష్యంలో భద్రతా బలగాలు భారీ విజయాన్ని సాధించాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. గరియాబంద్ ఎన్‌కౌంటర్‌పై ఆయన ఈ విధంగా స్పందించారు.

"నక్సలిజానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నక్సల్స్ రహిత భారత్ దిశగా మన భద్రత బలగాలు మరో భారీ విజయాన్ని సాధించాయి. సీఆర్‌పీఎఫ్, ఒడిశా స్పెషల్ గ్రూప్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఉమ్మడిగా చేపట్టిన ఆపరేషన్‌లో పెద్ద సంఖ్యలో నక్సల్స్ మృత్యువాతపడ్డారు. భద్రతా బలగాల ఉమ్మడి కృషితో నక్సలిజం కొనఊపిరితో ఉంది" అని అమిత్ షా పేర్కొన్నారు.ఒడిశా ముఖ్యమంత్రి విష్ణు డియో సాయి కూడా భద్రతా బలగాలను మెచ్చుకున్నారు. భద్రతా దళాలు వరుస విజయాలు సాధిస్తున్నాయని, లక్ష్యం దిశగా ముందుకు దూసుకెళుతున్నారని ప్రశంసించారు. "మన సైనికులు సాధించిన అద్భుత విజయం ఇది. వారి ధైర్యానికి నేను సలాం చేస్తున్నాను" అని సీఎం పేర్కొన్నారు.దేశాన్ని 2026 మార్చి నాటికి 'నక్సల్స్ రహిత భారత్'గా రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ క్రమంలోనే 2024లో దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఎన్‌కౌంటర్లు చోటుచేసుకున్నాయి. ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే భద్రతా బలగాల చేతిలో 200 మందికి పైగా నక్సల్స్ హతమయ్యారు. గతేడాది దేశవ్యాప్తంగా 219 మంది మావోయిస్టులు చనిపోగా, అందులో 217 మంది బస్తర్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. బస్తర్ ప్రాంతంలోని బస్తర్, దంతేవాడ, కాంకేర్, బీజాపూర్, నారాయణ పూర్, కొండగావ్, సుక్మా జిల్లాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల నుంచి 800 మంది నక్సల్స్ అరెస్టవ్వగా, 802 మంది జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. 2024లో మావోయిస్టులపై వ్యతిరేక పోరులో 18 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టుల హింసలో 65 మంది సాధారణ పౌరులు చనిపోయారు. ఇక 2025లో ఇప్పటి వరకు దాదాపు 40 మందికిపైగా నకల్స్ ఎన్‌కౌంటర్ అయ్యారని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది

## రాహుల్ వర్సెస్ ఖర్గే కాంగ్రెస్‌లో కలకలం

న్యూఢిల్లీ, జాతీయ పురాతన పార్టీ కాంగ్రెస్‌లో అంతర్గతంగా భారీ కలకలం రేగినట్టు తెలుస్తోంది. ఇద్దరు కీలక నాయకుల మధ్య వివాదాలు తారస్థాయికి చేరుకున్నట్టు జాతీయ మీడియాలోనూ కథనాలు వస్తున్నాయి. వారే ఒకరు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అయితే. మరొకరు పార్టీ అగ్రనేత, పార్లమెంటు లో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ. ఇద్దరి మధ్య గత రెండు మాసాలుగా పొరపొచ్చాలు చోటు చేసుకున్నాయని వార్తలు వస్తున్న మాట వాస్తవమే.అయితే. ఇప్పుడు ఈ వివాదాలు తీవ్రస్థాయికి చేరుకున్నట్టు సమాచారం. దీనికి ప్రధానంగా నాలుగు కారణాలు కనిపిస్తున్నాయని జాతీయ మీడియా చెబుతోంది. ఇండియా కూటమి, పటాపంచలు అయ్యే పరిస్థితి రావడం. తనకు చెప్పకుండానే కీలక విషయాల్లో రాహుల్ వేలు పెట్టడంపై ఖర్గే అసహనంతో ఉండడం. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మిత్ర పక్షం ఆప్‌ను రాహుల్ కార్నర్ చేయడం. ఖర్గే పార్టీని ముందుకు నడిపించలేక పోతున్నారన్న వాదన రాహుల్ కూటమిలో ఉండడం.ఈ నాలుగు కారణాల్లో రెండు రెండు మాసాల నుంచి చర్చల్లోనే ఉన్నాయి. అయితే, తాజాగా డిల్లీ ఎన్నికల విషయంలో రాహుల్ తనకు చెప్పకుండానే ఒంటరి పోరుకు ప్రకటన చేయడంపై ఖర్గే ఆవేదనతో రగిలి పోతున్నారన్నది పార్టీ వర్గాలు సైతం చెబుతున్నాయి. ఢిల్లీ ఎన్నికల్లో కొద్దో గొప్పో సీట్లు తీసుకుని ఆప్‌తో చెలిమి చేయడం ద్వారా. బీజేపీకి అవకాశం లేకుండా చేయాలని ఖర్గే వాదన. అయితే ఈ విషయంలో పంతానికి పోయిన రాహుల్. సొంతగానే పోటీకి రెడీ అయ్యారు. కానీ, ప్రస్తుతం ఓటు చీలితే. అది బీజేపీకి లాభించి కుదిరితే అధికారంలోకి వచ్చినా రావొచ్చన్న చర్చ సాగుతోంది.ఈ వ్యవహారాన్నే ఖర్గే తప్పు బడుతున్నారు. ఇక, మరో కీలక విషయం. కూటమి పార్టీలను సరైన దారిలో నడిపించక పోవడం. ఈ విషయంలో రాహులదే తప్పన్నట్టుగా ఖర్గే, కాదు అంతా ఖర్గేనే చేస్తున్నారని రాహుల్ బృందం చెబుతున్నాయి.

# స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ

భారతదేశ స్వాతంత్ర్య సమరంలో అహింసా మార్గంలోనే మాత్రమే కాదు పోరాట (సాయుధ) మార్గంనూ బ్రిటర్లపై పోరాడుదామని పిలుపిచ్చిన సమర సేనాని నేతాజీ సుభాష్. వలస వాదాన్ని ప్రతిఘటించడంలో ధైర్యంగా పోరాడటం చేయడంలో సుభాష్ చంద్రబోస్‌కు చేసిన కృషి అపూర్వం, అనన్య సామాన్యం, అజరామరం. ఇండియన్ సివిల్ సర్వీసెస్ కు ఎంపికైనప్పటికీ తృణప్రాయంగా ఉద్యోగాన్ని వదులుకొని దేశానికి స్వాతంత్ర్యం తేవడమే ప్రధమ కర్తవ్యం అని ఉద్యమంలోకి అడుగుపెట్టిన స్వాతంత్ర్య పిపాసి. భారతీయుడు గౌరవప్రద జీవితాన్ని గడపేలా చేసేందుకు తనను తాను కట్టుబడి ఉన్న ఒక అద్భుతమైన వ్యక్తి. "ఆజాద్ హిందూ ఫైజ్" ను స్థాపించి భారత్ కు స్వాతంత్ర్యం తీసుకు రావడంలో కీలకపాత్ర వహించాడు. స్వాతంత్ర్యం రావాలంటే సొంత సైన్యంతో పాటు ఇతర దేశాల సహకారం కూడా అవసరమని భావించాడు. సుభాష్ బాబు మేథో పరాక్రమం, సంస్థాగత నైపుణ్యాలకు కూడా ప్రసిద్ది చెందారు. ప్రతి భారతీయుడు గౌరవప్రదమైన జీవితాన్ని గడపేలా చేసేందుకు గాను తనను తాను కట్టుబడి ఉన్న ఒక అద్భుతమైన వ్యక్తి. సుభాష్ బాబు మేథో పరాక్రమం, సంస్థాగత నైపుణ్యాలకు కూడా ప్రసిద్ది చెందారు.2021నుండి నేతాజీ జన్మదినమైన జనవరి 23న ప్రతి సంవత్సరం

అంతర్జాతీయ స్థాయిలో 'పరాక్రమ దివస్'గా జరపాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించింది. భారత దేశానికి స్వాతంత్ర్యం రావడానికి అహింస మార్గంలో గాంధీ మార్గంలో కొందరు నాయకుల పోరాటం ఎంత ముఖ్యమో, సుభాస్ బోస్ పోరాట పటిమ అంతే ప్రధానం. తన జీవితంలో స్వార్థం లేకుండా దేశ స్వాతంత్ర్య సాధనే పరమార్థం గా, 12 దేశాలు తిరిగి అతి పెద్ద సైనిక బలగాన్ని ఏర్పాటు చేసి బ్రిటీష్ సామ్రాజ్యానికి వణుకు పుట్టించిన ఒక గొప్ప యుద్ధ వీరుడు సుభాష్ చంద్రబోస్. నివృత్తి కాని సందేహంగా ఆయన అదృశ్యం జరగక పోయి ఉంటే 1947 కంటే రెండు సంవత్సరాల ముందే స్వాతంత్ర్యం వచ్చి ఉండేదని చాలా మంది నమ్ముతారు. సుభాష్ చంద్రబోస్ జనవరి 23, 1897 లో ప్రభావతి దేవి, జానకి నాద్ బోస్ దంపతులకు కటక్ లో జన్మించాడు. బాల్యం నుండే ఎక్కడ అన్యాయం జరిగిన ఎదురు నిలిచి అడిగేవాడు. ఇంటర్ చదివే రోజుల్లో "స్వేచ్ఛా సేవ సంఘ్" అనే సంస్థ ఏర్పాటు చేసి యువకులకు సమాజ సేవ, ధ్యానం, మానసిక ఆరోగ్యం కోసం వ్యాయామం వంటి అనేక అంశాల పైన ఉపన్యాసాలు ఇచ్చేవాడు. బోస్ కు స్వామి వివేకానంద అంటే ఎంతో ఇష్టం. ఇక 1919లో ఇండియన్ సివిల్ సర్వీసెస్ ఉత్తమ ర్యాంక్ సాధించి శిక్షణ కోసం ఇంగ్లాండ్ వెళ్ళాడు. 1920 లో ఇంగ్లాండ్ లో జరిగిన పరీక్షలో మెరిట్ లో ఉత్తీర్ణుడైనాడు. అయితే జలియన్ వాలా భాగ్ వార్త తెలిసిన అతడికి మనసులో ఆవేదన కలిగి దానిని మధ్యలోనే వదిలేసి 1921 లో ఇండియా తిరిగి వచ్చాడు. తరువాత గాంధీజీ కలిసి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లో చేరాడు. చిత్తరంజన్ దాస్ వద్ద పనిచేసే వాడు. ప్రిన్స్ ఆఫ్ వేల్స్ భారత దేశానికి వచ్చినప్పుడు నిరసన తెలిపినందుకు ఆర్నెల్లు జైలు శిక్ష విధించారు. ఇక అయన జైలు నుండే కలకత్తా శాసన సభకు ఎన్నికయ్యాడు. జైలులో నిరాహార దీక్ష వల్ల ఆరోగ్యం క్షీణించడం చూసి బ్రిటీష్ ప్రభుత్వం కొన్ని ఆంక్షలు విధిస్తు ఆయనను విడుదల చేసింది. ఆ తర్వాత బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, అఖిల భారత కాంగ్రెస్స్ సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. అలా దేశమంతా పర్యటిస్తూ ఆయన చేసే ప్రసంగాలకు లక్షలాది మంది ప్రేరితులయ్యారు. ఉప్పు సత్యాగ్రహ సమయంలో బోస్ ను నిర్బంధించడం కాకుండా దేశ బహిష్కరణ కూడా చేసారు.ఆ సందర్భంలో అయన యూరప్ లో పర్యటించి హిట్లర్, ముస్సోలిని వంటి మహానీయులను కలిసాడు. అయితే బోస్ హిట్లర్ ని కలసిన సందర్భంలో ఒక సంఘటన జరిగింది. హిట్లర్ కోసం వేచి చూస్తుండగా ఒక వ్యక్తి వచ్చి విషయం ఏమిటి అని అడుగగా నేను మీ బాస్ హిట్లర్ తో మాట్లాడాలని జవాబిచ్చాడు. అయితే కొద్దిసేపటికి వచ్చిన హిట్లర్ బోస్ తో చర్చలు చేసి వెళుతుండగా నీ వద్దకు "ముందుగా వచ్చిన వ్యక్తి హిట్లర్ కాదని నీకెలా తెలిసింది అని ప్రశ్నించిగా, నా భుజాన్ని తట్టే ధైర్యం హిట్లర్ కు తప్ప మరెవ్వరికీ లేదని" ఆయన జవాబిచ్చాడు. అయితే 1934 వ సంవత్సరంలో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని జైలు పాలై, ఆరోగ్యం దెబ్బతినడంతో చికిత్స నిమిత్తం ఆయనని ఆస్ట్రియాకు తరలించారు. ఇలా ఆస్ట్రియలో చికిత్స పొందుతున్న ఆయన యూరప్‌లో ఉన్న భారతీయ విద్యార్థులను ఏకం చేసి, వారు స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనేలా చేయాలని బోస్ భావించాడు. "ద ఇండియన్ స్ట్రగుల్" అనే పుస్తకం రాసే సందర్భంలో ఇంగ్లీష్ వచ్చి టైప్ చేయగలిగే ఒక వ్యక్తిగా పరిచయమైన 23 ఏళ్ల ఎమిలీ షెంకెల్ అనే ఆస్ట్రియా యువతిని తన సహాయకురాలిగా నియమించు కోగా, ఎమిలీ 1934 జూన్ నుంచి బోస్‌తో కలిసి పని చేయగా, వారి మధ్య ప్రేమ చిగురించిందని చెపుతారు. స్వాతంత్ర్యం తప్ప వేరే ఆలోచన లేని బోస్ 1934-36 లో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు అయినాక దేశమంతా తిరుగుతూ తన ఉపన్యాసాలతో దేశంలోనే అత్యంత ప్రజాధారణ కలిగిన నాయకుడయ్యాడు. ఇలా గొప్ప నాయకుడిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ లో అంతర్గతగా జరిగిన కుట్రల కారణంగా 1939 లో ఆయనను కాంగ్రెస్ నుండి బహిష్కరించారు. ఆ తరువాత వెంటనే ఫార్వర్డ్ బ్లాక్ అనే పార్టీ ని స్థాపించి దేశం అంతటా పర్యటించగా ఆయనకి మద్దతుగా కొన్ని లక్షల్లో జనాలు అయన వెంట నడిచారు. ఇలా ఉద్యమ కారుడిగా ప్రజల్లో చైతన్యం నింపుతుండగా 1941 అరెస్ట్ చేసి తప్పనిసరి పరిస్థితుల్లో విడుదల చేసి గృహ నిర్బంధంలో ఉంచారు. కానీ అయన పథకం ప్రకారం హమ్మద్ జియా ఉల్ హక్ అనే మారు పేరుతో పాస్ పోర్ట్ సంపాదించి తప్పించుకుని తన వ్యక్తి గత సేవకుడు భగత్ రామ్ కు రహమత్ ఖాన్ అని పేరు పెట్టి కాబుల్ కి వెళ్ళాడు. అక్కడ ఉత్తం చంద్ మల్హోత్రా అనే వ్యాపారి ఆయనకి ఆశ్రయం కల్పించగా అక్కడ ఉంటూనే రష్యా, జర్మని, ఇటాలి దేశ రాయబారులతో మంతనాలు చేసాడు. 1941 మార్చ్ 18 న అక్కడి నుండి ఒర్లాండ్ అనే మారు పేరుతొ సమర?ండ్, మాస్కో ల మీదుగా బెర్లిన్ చేరుకొని జపాన్, ఇటలి, జెర్మని లకు చెందిన సైన్యాధికారులను కలుసు కున్నాడు. ఇలా చేరుకున్న బోస్ ను వారు స్వతంత్ర భారత రాయబారిగా గుర్తించారు. ఆ తరువాత బోస్ అక్కడే ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించాడు. 1941 ఫిబ్రవరి 27 న బోస్ రేడియోలో ఇచ్చిన ప్రసంగం యావత్ దేశాన్ని కదిలించింది. ప్రపంచ యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో జపాన్ లోని ఆజాద్ హింద్ ఫౌజ్ సభ్యులు బోస్ ను అక్కడికి ఆహ్వానించగా 45 రోజుల పాటు జలాంతర్గామిలో ప్రయాణించి అక్కడ మత్సుడ అని పేరు మార్చు కున్నాడు. అక్కడ బోస్ ఇచ్చిన స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసాలతో హింద్ ఫౌజ్ లో తండోప తండాలుగా సైనికులు చేరారు. ఇక్కడ మహిళలకు ప్రత్యేకంగా ఝాన్సీ లక్ష్మీ బాయి రెజిమెంట్ ను ఏర్పాటు చేసి మహిళలకు యుద్ధ శిక్షణ నివ్వడం మొదలు పెట్టారు. ఇలా ఎంతో శక్తివంతమైన సైన్యాన్ని తయారుచేసి చలో ఢిల్లీ అనే నినాదంతో ప్రత్యక్ష యుద్దానికి దిగి జపాన్ సహకారంతో ఇంఫాల్, అండమాన్, నికోబార్ లను జయించి అక్కడ స్వతంత్ర భారత పతాకాన్ని ఎగురవేసి ముందుకు సాగుతుండగా ఆయనకి కష్టాలు మొదలయ్యాయి. తనకు అండగా నిలిచినా జపాన్ దేశం యుద్ధంలో ఓటమికి చేరువైంది. ఇక బర్మాలో వరదల కారణంగా ఆరోగ్యం క్షీణిస్తూ అనేక మంది సైనికులు మరణించారు. ఆ సమయంలో రష్యా దాడికి దిగి, అణుబాంబు వేయడంతో జపాన్ అతలాకుతలం అయింది. అప్పటివరకు తనకు అండగా ఉన్న జపాన్ అలా అవ్వడంతో బోస్ నిస్సహాయు డైనాడు. ఆ తరువాత సింగపూర్, రంగూన్ సైనిక దళాలకు బ్రిటీష్ దళాలు దగ్గరయ్యాయి. 1945వ సంవత్సరం ఆగస్టు భారత జాతీయ సైన్యానికి సహకరించిన జపాన్ సైనిక దళాలు బ్రిటిష్ సైనిక దళాలకు శరణుజొచ్చాయి. దీనితో నేతాజీ సింగపూర్‌ను వీడి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 1945 ఆగస్టు 18 వ తేదీన తైపీలో జరిగిన విమాన ప్రమాదంలో అయన మరణించి నట్లుగా రేడియో లో ప్రకటించారు.ఇక తైవాన్ కి సంబంధించిన ఎయిర్ క్రాష్ లో చంపేశారని కొందరు, ఆగస్ట్ 1945 తర్వాత నేతాజీ రష్యాలో ఉన్నాడని చెప్పడం వల్ల అతను చనిపోలేదని మరికొందరు, సుభాష్ చంద్రబోస్ మారువేశంలో మన దేశం లోనే ఉన్నాడని ఇలా ఎన్నో రకాలుగా చెప్పుకునేవారు. సైన్యానికి శిక్షణ ఇచ్చేప్పుడు... "నేను మీకు కేవలం ఆకలి, దాహం, కష్టం, మృత్యువును మాత్రమే ఇవ్వగలను. నాకు మీ రక్తాన్ని ఇవ్వండి. మీకు స్వతంత్రాన్ని ఇస్తాను"... అని సైన్యంలో విశ్వాసాన్ని చిగురించేలా చేసేవాడు. దేశం కోసం ఎవరు చేయని విధంగా అహింస వలన కాదు, పోరాడితేనే స్వాతంత్ర్యం వస్తుందని కట్టు బట్టల్తో జపాన్ వెళ్లి ఇండియన్ ఆర్మీని సిద్ధం చేసి బ్రిటిష్ సైన్యానికి గుండెల్లో రైళ్లు పరిగెత్తించి చివరికి స్వాతంత్ర్య చూడ కుండానే కనుమరుగైన యోధుడు బోస్. నేతాజీ సుభాస్ చంద్రబోస్ యొక్క విలువైన వారసత్వాన్ని, చరిత్రను పరిరక్షించడానికి భారత ప్రభుత్వం అనేక రకాల చర్యలను చేపట్టింది. న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద నేతాజీపై మ్యూజియం ఏర్పాటు చేశారు. దీనిని 23.01.2019న ప్రధాని ప్రారంభించారు. దేశంలో చారిత్రాత్మక విక్టోరియా మెమోరియల్ భవనంలో కోల్‌కతాలో నేతాజీపై లైట్ అండ్ సౌండ్ షో శాశ్వత ప్రదర్శన ఏర్పాటు చేయడానికి ప్రణాళిక చేయ బడింది. అండమాన్, నికోబార్‌లోని 3 ద్వీపాలకు పేరు మార్చి ప్రధాని మోదీ రాస్ ద్వీపానికి నేతాజీ సుభాష్ "చంద్రబోస్ ద్వీపంగా" పేరు మార్చారు.

## బిజెపి పరిణామక్రమం...

47 ఏళ్ళ క్రితం ఇదే రోజున అంటే 1977 జనవరి 23న 'జనసంఘ్', 'భారతీయ లోక్‌దళ్', కాంగ్రెస్ (ఓ), 'స్వతంత్ర పార్టీ', 'సోషలిస్టు పార్టీ'లు కలిసి నేటి భారతీయ జనతా పార్టీ పూర్వపు భాగస్వామియైన 'జనతాపార్టీ'గా ఏర్పడ్డాయి. ఈ నేపథ్యాన్ని పరిశీలిస్తే.. 1951 అక్టోబర్ 21న ఢిల్లీలో శ్యాంప్రసాద్ ముఖర్జీ భారతీయ జనసంఘ్ పార్టీని ఏర్పాటు చేశాడు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావనలపై ఏర్పాటు చేసిన ఈ పార్టీకి ఎన్నికల చిహ్నంగా దీపం గుర్తు లభించింది. 1952లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో ఈ పార్టీకి 3 లోక్‌సభ స్థానాలు లభించాయి. అందులో ఒక స్థానం పార్టీ స్థాపకుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ విజయం సాధించింది. 1967 తరువాత ఈ పార్టీ బలపడింది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావనలపై ఆధారపడిన పార్టీ కావడంతో ఈ పార్టీ హిందూ జాతీయవాద లక్షణాలను కలిగిఉంది. ఈ పార్టీలో ప్రముఖ స్థానాలను కలిగిన నాయకులు కూడా ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తలే. 1964లో ఏర్పడిన విశ్వ హిందూ పరిషత్తు ఈ పార్టీకి సన్నిహితంగా ఉంది. జవహర్ లాల్ నెహ్రూ కాలంలో ఆయన సోషలిస్టు భావనలకు విసుగు చెందిన పలు భారతీయ జాతీయ కాంగ్రెస్ నేతలు ఈ పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో ఈ పార్టీ ఉనికి నిలుపుకుంది. 1975లో దేశంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం అత్యవసర పరిస్థితి విధించడంతో విపక్షాలకు చెందిన పలు నేతలను ఎలాంటి కారణం లేకుండానే జైళ్ళకు తరలించారు. అదే కాలంలో భారతీయ జనసంఘ్ ప్రముఖ నేతలు కూడా జైలుజీవితం గడిపారు. 1977లో అత్యవసర పరిస్థితిని తొలిగించి ఎన్నికలు జరుపడంతో దేశంలో మారిన రాజకీయ సమీకరణాల వలన భారతీయ జనసంఘ్‌తో పాటు భారతీయ లోక్‌దళ్, కాంగ్రెస్ (ఓ), సోషలిస్ట్ పార్టీలు కలిసి ఉమ్మడిగా జనతా పార్టీని ఏర్పాటు చేసుకున్నాయి. 1951లో శ్యాంప్రసాద్ ముఖర్జీ చే స్థాపించబడిన జనసంఘ్ 1977లో జనతా పార్టీలో విలీనం చేయబడింది. ఎన్నికలలో ఈ పార్టీ విజయం సాధించడంతో భారతదేశంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి కాంగ్రెసేతర ప్రభుత్వంగా జనతా ప్రభుత్వం పేరు సంపాదించింది. మురార్జీ దేశాయ్ నేతృత్వం వహించిన జనతా ప్రభుత్వంలో పూర్వపు జనసంఘ్ నేతలైన అటల్ బిహారీ వాజపేయికి విదేశాంగ మంత్రిత్వ శాఖ లభించగా, లాల్ కృష్ణ అద్వానీకి సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ లభించింది. జనతా ప్రభుత్వం విచ్ఛిన్నం కావడంతో 1980 లోక్‌సభ ఎన్నికల ముందు జనసంఘ నేతలు జనతా పార్టీ నుండి బయటకు వచ్చి భారతీయ జనతా పార్టీ పేరుతో ఎప్రిల్ 6న కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ భారతదేశంలో ప్రముఖ జాతీయ రాజకీయ పార్టీలలో ఒకటి. రాజకీయ కురు పితామహుడు అటల్ బిహారీ వాజపేయి భారతీయ జనతా పార్టీకి తొలి అధ్యక్షుడిగా పనిచేశారు. 1980లో ప్రారంభించిన ఈ పార్టీ దేశములోని హిందూ అధికసంఖ్యాక వర్గం యొక్క మత సాంఘిక, సాంస్కృతిక విలువల పరిరక్షణను ధ్యేయంగా చెప్పుకుంటుంది. సాంప్రదాయ సాంఘిక నియమాలు, దృఢమైన జాతీయ రక్షణ దీని భావ జాలాలు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రధానపాత్ర పోషిస్తున్న సంఘ్ పరివార్ కుటుంబానికి చెందిన వివిధ రకాల హిందూ జాతీయవాద సంస్థలు భారతీయ జనతా పార్టీకి కార్యకర్తల స్థాయిలో గట్టి మద్దతు ఇస్తున్నాయి. 1989 తరువాత ఈ పార్టీ బలపడింది. అటల్ బిహారీ వాజపేయి 3 సార్లు ప్రధానమంత్రి పదవిని కూడా చేపట్టినారు. భాజపా, అనేక ఇతర పార్టీల మద్దతుతో 1999 నుండి 2004 వరకు భారతదేశ ప్రభుత్వము భారత కేంద్ర ప్రభుత్వాన్ని పాలించింది. దాని సీనియర్ నాయకులైన అటల్ బిహారీ వాజపేయి ప్రధాని గాను, లాల్ కృష్ణ అద్వానీ ఉప ప్రధాన మంత్రి గానూ పనిచేశారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో ప్రధాన పార్టీ అయిన భాజపా, భారత పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షముగా 2014 మే వరకు కొనసాగింది. సార్వత్రిక ఎన్నికలలో లోక్ సభ లోని 543 స్థానాలకు మునుపెన్నడూ లేనన్ని 281 స్థానాలు గెలుచుకున్న భాజపా (మిత్ర పక్షాలతో కలిసి జాతీయ ప్రజాస్వామ్య కూటమికి 337 స్థానాలు) నరేంద్ర మోడీ నాయకత్వంలో అధికారం చేబట్టింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో లోక్ సభ ఎన్నికల్లో 303 స్థానాల్లో విజయం సాధించింది. 2024 ఎన్నికల్లో 543 స్థానాలలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ కూటమి 293 స్థానాలతో మెజారిటీ సాధించింది. ఇందులో బీజేపీ పార్టీ స్వంతంగా గెలుచుకున్న 240 సీట్లు ఉన్నాయి, ప్రతిపక్ష ఇండియా కూటమికి 234 సీట్లు వచ్చాయి, ఇందులో కాంగ్రెస్ పార్టీకి స్వంతంగా గెలుచుకున్న 99 స్థానాలు ఉన్నాయి. 2024 జూన్ 9న, భారతీయ జనతా పార్టీ మెజారిటీని కోల్పోయినప్పటికీ, జాతీయ ప్రజాస్వామ్య కూటమికి నాయకుడిగా ఎన్నికై, ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం చేశారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో మళ్లీ అధికారం చేపట్టింది. ప్రస్తుతం మూడవ సారి నరేంద్ర మోడీ ప్రధానిగా ప్రభుత్వంగా కొనసాగుతున్నది.

## భాషా సౌందర్యానికి నిలువటద్దం

వావిలికొలను సుబ్బారావు తెలుగు సాహిత్యంలో అమూల్యమైన కీర్తిని పొందిన మహాకవి, అనువాదకుడు, మరియు భక్తిమార్గానికే అంకితమైన మహనీయుడు. ఆయనను తెలుగులో "ఆంధ్ర వాల్మీకి" అని గౌరవంగా పిలుస్తారు. వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి అనువదించి, భక్తి శ్రద్ధతో అక్షరరూపం ఇచ్చిన ఆయనకు ఈ ఘనత దక్కింది. ఆయన రచనలు తెలుగు భాషా సౌందర్యానికి నిలువుటద్దంగా, భక్తి చైతన్యానికి పునాది రాళ్లుగా నిలిచాయి. వావిలికొలను సుబ్బారావు 1863 జనవరి 23న ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతంలోని ప్రొద్దుటూరు పట్టణంలో జన్మించారు. ఆయన కుటుంబం సాంప్రదాయ సంస్కృతికి ప్రతిబింబంగా ప్రసిద్ధి. ఆయన విద్యాభ్యాసం సంస్కృత పాఠశాలలలో సాగింది. సంస్కృత భాష, శాస్త్ర గ్రంథాలు, ధార్మిక సాహిత్యంపై ఆయనకు చిన్న వయస్సు నుంచే గొప్ప ఆసక్తి ఉండేది. ఆయన మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఆంధ్ర పండితుడిగా సేవలు అందించారు. విద్యారంగంలో పనిచేయడంతో పాటు, సాహిత్య రంగానికి ఆయన అనేక గ్రంథాలను అందించారు. జీవితాంతం ఆయన భక్తి మార్గానికే కట్టుబడారు. సంసారంలోనుండి విముక్తిని కోరుతూ, చివరికి ఆయన వైరాగ్య జీవితం స్వీకరించారు. గోచీ ధరించి, రామనామ స్మరణతో తపస్సు చేశారు. వావిలికొలను సుబ్బారావు అనేక పుస్తకాలు రచించి, తెలుగు సాహిత్యాన్ని భగవద్భక్తి, తాత్వికత, సామాజికతలతో పటిష్టం చేశారు. ముఖ్యంగా వాల్మీకి రామాయణాన్ని తెలుగు ద్విపద రూపంలో అనువదించి "మందరం" అనే పేరుతో ప్రజలకు అందించారు. ఈ అనువాదం సాంప్రదాయ భక్తి తాత్వికతలకు బలమైన అద్దుకట్టయింది. భాషా సామర్థ్యం, కవిత్వ శక్తి, మరియు భావప్రాప్తి కారణంగా ఈ గ్రంథం తెలుగు సాహిత్యంలో అపూర్వ మైంది. శ్రీకృష్ణలీలా మృతము గ్రంథంలో శ్రీకృష్ణుని జీవితంలోని లీలలను భక్తిభావంతో తెలుగులో వర్ణించారు. ఇది భగవద్గీతను మరింత సరళంగా, అందమైన వచనంలోకి తీసుకురావడంలో ఆయన ప్రతిభను చాటింది. భగవద్గీతను ద్విపదలలో రచించి, సామాన్యులకు కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ రచనలో తాత్విక చింతన, భక్తి భావం చక్కగా మిళితమై ఉన్నాయి. ఆర్య సమాజం సిద్ధాంతాలపై ప్రత్యేకమైన రచనలు చేశారు. ధార్మికత మరియు ఆధ్యాత్మికతపై వీటి ప్రభావం ఎంతగానో ఉంది. ఒంటిమిట్ట రామాలయాన్ని పునరుద్ధరించడానికి విరాళాలు సేకరించే ఉద్దేశ్యంతో టెంకాయ చిప్ప శతకం శతకాన్ని రచించారు. భక్తి, వినోదం, మరియు దాతృత్వ స్ఫూర్తిని కలిపి రచించిన ఒక అద్భుత శతకంగా ఇది నిలిచింది. మహాభారతంలోని సుభద్రా అర్జునుల కథ ఆధారంగా రాసిన నాటకం సుభద్రా విజయం నాటకం. ఈ నాటకం భక్తి, ప్రేమ, మరియు ధర్మాల సమ్మేళనంతో ఆకట్టుకుంటుంది. వావిలికొలను సుబ్బారావు రచనల్లో భక్తి ప్రధాన పాత్ర పోషించింది. రామాయణం, భగవద్గీత వంటి శ్రేష్ఠ గ్రంథాలను భక్తి భావంతో తెలుగు ప్రజలకు పరిచయం చేశారు. ఆయన రచనలు సాంప్రదాయ భాషలో ఉండి కూడా ఎంతో సరళమైన రూపంలో ప్రజల హృదయాలను తాకాయి. ఒంటిమిట్ట రామాలయ పునరుద్ధరణ వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భగవద్గీత వంటి గ్రంథాలను సులభంగా అర్థం అయ్యే విధంగా అనువదించడం ద్వారా ఆయన తాత్విక ఆలోచనలను సామాన్య ప్రజలకు అందించారు.వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సాంప్రదాయానికి ఎలా మూర్తిరూపమో, వావిలికొలను సుబ్బారావు రాసిన "మందరం" తెలుగు భాషా సంపదకు అలాగే మూర్తిరూపం. ఆయన కృషికి గానూ ప్రజలు ఆయనను "ఆంధ్ర వాల్మీకి" అని గౌరవించారు. 1936 ఆగష్టు 1న ఆయన మరణించినప్పటికీ, ఆయన రచనలు తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఈ గ్రంథాలు నేటికీ భక్తి సాహిత్యంలో ఓ మైలురాయిగా నిలుస్తున్నాయి. వావిలికొలను సుబ్బారావు రచనలు, వ్యక్తిత్వం, మరియు ఆధ్యాత్మిక జీవితం మనకు స్ఫూర్తిదాయకం. ఆంధ్ర వాల్మీకిగా ఆయన తెలుగుకు చేసిన సేవలు భవిష్యత్ తరాల కోసం ప్రేరణగా నిలుస్తాయి.

## వైకాపా హయాంలోనే దాడులు, దౌర్జన్యాలు

రాయచోటి , జనవరి 22: గత వైకాపా ప్రభుత్వ హయాంలోనే దాడులు, దౌర్జన్యాలు జరిగాయని రాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి ఆరోపించారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో రాయచోటిలో బాలికపై అఘాయిత్యం ఘటనపై మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్పందించి కూటమి నాయకులుపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. కూటమిప్రభుత్వ పాలనలో చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ లో పాలన సజావుగా, రాజ్యాంగబద్ధంగా నడుస్తుందన్నారు . ఒక సంఘటననుభూతద్దంలో చూపించి రాష్ట్రంలో ఏదో జరిగిపోతుందని విమర్శించడం తగదన్నారు. ఇలాంటి దురుద్దేశపురిత విమర్శలు చేయడం బాధాకరమన్నారు. బాలికపై లైంగిక దాడి చేసిన వారిపై చట్టపరంగా కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా చూస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రతి చోట దౌర్జన్యాలు ,అఘాత్యాలు అనేకం జరిగాయన్నారు..ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఎటువంటి అలజడి లేకుండా రాష్ట్ర ప్రజలందరికీ పెద్దన్నలాగా సంరక్షిస్తున్నారన్నారు కూటమి ప్రభుత్వ హయాంలో దాడులు దౌర్జన్యాలు అనే మాటలు కూడా వినపడకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గట్టిగా నాయకులందరినీ ఇప్పటికే ఒకటికి రెండుసార్లు మందలించడం జరిగిందని వివరించారు..అలాంటి ప్రభుత్వంపై జగన్ మోహన్ రెడ్డి విమర్శలు చేయడం తగదు అన్నారు.రాజకీయ విమర్శలు చేయడం బాధాకరమన్నారు.

## మళ్లీ రాజ్యసభకు అన్నయ్య...

విజయవాడ, జనవరి 22, రాజకీయ వ్యూహాలు రచించడంలో నరేంద్ర మోదీ, అమిత్ షా ద్వయం దిట్ట. ఏ నిర్ణయం తీసుకున్నా దానివల్ల బీజేపీకి ఎంత లబ్ధి జరుగుతుందనే ఈ ఇద్దరు నేతలు ఆలోచిస్తారు. ప్రస్తుత రాజకీయాల్లో ఇది చాలా అవసరం. గతంలో వీరిద్దరు తీసుకున్న నిర్ణయాలు బీజేపీకి ఎంతో లాభం చేశాయి. అయితే.. అవి నార్త్ ఇండియా వరకే పరిమితం అయ్యాయి. సౌత్‌పై పట్టు కోసం వీరు ఎంత ప్రయత్నించినా.. అనుకున్న స్థాయిలో ఫలితాలు రావడం లేదు. దీంతో ప్రాంతీయ పార్టీలపై ఆధారపడాల్సి వస్తోంది.ఈ నేపథ్యంలో బీజేపీ మరో గట్టి ప్లాన్ వేసినట్టు పొలిటికల్ సర్కిల్‌లో టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలపై బీజేపీ ఫోకస్ పెట్టిందని తెలుస్తోంది. ఇప్పటికే ఏపీలో పవన్‌కు రూట్ మ్యాప్ ఇచ్చిన బీజేపీ.. ఇప్పుడు తెలంగాణపైనా నజర్ పెట్టింది. ఈ క్రమంలోనే మెగాస్టార్ చిరంజీవిని తమవైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. చిరంజీవిని మళ్లీ రాజ్యసభకు పంపాలని బీజేపీ ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.ఇటీవల ఢిల్లీలోని కిషన్ రెడ్డి ఇంట్లో సంక్రాంతి వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ప్రధాని మోదీ వచ్చారు. మెగాస్టార్ చిరంజీవి కూడా ఈ వేడుకలకు హాజరయ్యారు. మోదీ, చిరంజీవికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. ఈ పరిణామాలే చిరంజీవిని రాజ్యసభకు పంపిస్తారనే ఊహాగానాలకు బలం చేకూరుస్తున్నాయి. అయితే.. మళ్లీ పొలిటికల్ ఎంట్రీ ఇవ్వడం చిరుకు ఇష్టం లేదనే టాక్ వినిపిస్తోంది.దీనికి బీజేపీ మరో ప్లాన్ వేసినట్టు తెలుస్తోంది. బీజేపీలో చేరకున్నా.. రాష్ట్రపతి కోటాలో అన్నయ్యను పెద్దల సభకు పంపాలని ప్లాన్ చేస్తున్నట్టు కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇప్పటికే సుధామూర్తి లాంటివారిని అలాగే రాజ్యసభకు పంపారు. చిరంజీవిని కూడా ఇదే తరహాలో పంపాలని బీజేపీ ఆలోచిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే పవన్ మరో సోదరుడు నాగబాబును రాజ్యసభకు పంపకుండా ఆపారనే చర్చ జరుగుతోంది.దక్షిణాది రాష్ట్రాల్లో ఒక్క కర్ణాటకలో మినహా.. వేరే ఎక్కడా బీజేపీకి చెప్పుకోదగ్గ స్థాయిలో బలం లేదు. సొంతంగా పోటీ చేసే దమ్మున్నా.. ఫలితాలు ఆశించిన స్థాయిలో వస్తాయనే నమ్మకం లేదు. అయితే.. మెగా ఫ్యామిలీకి ఏపీ, తెలంగాణలో భారీ స్థాయిలో ఫ్యాన్ బేస్ ఉంది. దీన్ని ఉపయోగించుకోవాలని బీజేపీ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. 2029 అసెంబ్లీ ఎన్నికల వరకైనా.. పవన్, చిరు ద్వారా బలపడాలని బీజేపీ ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది.బీజేపీ ఇప్పటికే పవన్‌కు బాగా సపోర్ట్ ఇస్తోంది. అటు ఏపీలో పవన్ డిప్యూటీ సీఎంగా ఉన్నారు. పవన్ ద్వారా ఏపీలో బలమైన సామాజికవర్గాన్ని తమవైపునకు తిప్పుకోవాలని బీజేపీ ప్లాన్ చేస్తున్నట్టు ఆ మధ్య చర్చ జరిగింది. అటు పవన్ కళ్యాణ్ కూడా సనాతన హిందూధర్మం పేరుతో సంచలన వ్యాఖ్యలు చేశారు. వాటికి బీజేపీ సహా.. సంఘ్ పరివార్ నుంచి మద్దతు లభించింది. ఏపీలో ప్రస్తుతం పవన్‌తో రాజకీయం నడుస్తోంది. కానీ తెలంగాణలో ఆ పరిస్థితి లేదు.అందుకే.. చిరంజీవిని రాజ్యసభకు పంపి, తెలంగాణలో బలపడాలని బీజేపీ ప్లాన్ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. పవన్‌ను ఏపీలో.. అన్నయ్యను తెలంగాణలో ఉపయోగించుకోవాలని కమలం లీడర్లు భావిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే.. బీజేపీ ప్రతిపాదనలకు చిరంజీవి ఒప్పుకుంటారా అన్నది అసలు సమస్య. అందుకే ఇటు పవన్ ద్వారా, అటు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ద్వారా అన్నయ్యను ఒప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం జరుగుతోంది.

## అంతా క్లియర్...

# పోర్టు వివాదానికి ఫుల్ స్టాప్

కాకినాడ, జనవరి 22, కాకినాడ సీ పోర్టుకు సంబంధించి గత కొన్ని నెలలుగా జరుగుతున్న వివాదం ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చింది. కేవీరావుకు కాకినాడ పోర్టుకు సంబంధించిన వాటాలను అరబిందో తిరిగి ఇచ్చేసింది. దీంతో కాకినాడ సెజ్ అరబిందో వశమైంది. కేవీరావుకు కాకినాడ సీ పోర్టు, అరబిందోకు కాకినాడ సెజ్ కేటాయింపుపై రాజీ కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో గత ఎనిమిది నెలలుగా సాగుతోన్న వివాదానికి ఫుల్‌స్టాప్ పడినట్లు అయింది.అప్పట్లో రూ.2,500 కోట్ల విలువైన 2.15 కోట్ల షేర్లను తన వద్ద రూ. 494 కోట్లకే లాగేసుకున్నారని కేవీరావు ఆరోపించారు. అదే సమయంలో కాకినాడ సెజ్‌లో కేవీరావుకు చెందిన 8 వేల ఎకరాలు అరబిందో సొంతమైంది. వైసీపీ హయంలో బలవంతంగా వాటాలను బదిలీ చేసుకున్నారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఐడీకి కేవీరావు ఫిర్యాదు చేశారు. సీఐడీ ఫిర్యాదు ఆధారంగా రూ.494 కోట్ల చెల్లింపులపై ఈడీ కూడా రంగంలోకి దిగి, మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఇప్పటికే వైసీపీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి, వైవీ విక్రాంత్ రెడ్డిలను ఈడీ అధికారులు విచారించారు. దీంతో ఈ వివాదం కీలకమలుపు తిరిగింది. కేవీరావు నుంచి అప్పట్లో తీసుకున్న వాటాలను అరబిందో సంస్థ తిరిగి ఆయనకే అప్పగించింది. దీంతో కాకినాడ సీపోర్టు డీల్ రివర్స్ అయింది. కాకినాడ సీపోర్టు మళ్లీ పాత యజమాని కేవీరావు చేతికే దక్కిందికాకినాడ సీపోర్టుకు సంబంధించిన 41.12 శాతం వాటాలను కేవీరావుకు మూడు రోజుల క్రితమే అరబిందో బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఈ వివాదంపై పై స్థాయిలోని వ్యక్తులు రంగంలోకి దిగి, ఇరు పక్షాలను కూర్చోబెట్టి మధ్యవర్తిత్వం చేశారని సమాచారం. పెద్ద స్థాయిలోనే డీల్ కుదిరినట్లు సమాచారం. పోర్టులోని వాటాలను బదిలీ చేసేందుకు సిద్ధపడిన అరబిందో ఒక షరతు పెట్టింది. సెజ్‌ను వదిలేయాలంటూ షరతు విధించింది. దీనికి సమ్మతించిన తరువాతే అరబిందో పేరుతో ఉన్న 2.15 కోట్ల షేర్లు కేవీరావుకు బదిలీ చేసినట్లు తెలిసింది. దీనికి సంబంధించి అప్పట్లో కేవీరావుకు అరబిందోకు ఇచ్చిన మొత్తాన్ని, షేర్లు బదిలీ చేయడంతో తిరిగి అరబిందోకి కేవీరావు ఇచ్చేశారని తెలిసింది. దీంతో కాకినాడ పోర్టు కేవీరావు వశమైంది. మరోవైపు కాకినాడ సెజ్‌లో ఉన్న కేవీరావుకు చెందిన 8 వేల ఎకరాలను అరబిందో వశమైంది. ఇప్పుడు ఎవరి వ్యాపారాలు వారు చేసుకోవాలని పెద్దలు రాజీ కుదిర్చిన సమయంలో పేర్కొన్నట్లు తెలిసింది.1990లో కాకినాడ సీపోర్టును ఏడీబీ రుణంతో నిర్మించారు. ప్రభుత్వం నిర్మించిన ఈ పోర్టును 1998లో చంద్రబాబు, దాని నిర్వహణ బాధ్యతను ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చారు. అలా ఆ పోర్టు కేవీరావుకు వచ్చింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అండతో కేవీరావుకు చెందిన కాకినాడ సీపోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌లోని 41 శాతం వాటాలను అరబిందో రియాల్టీ బదిలీ అయ్యాయి. అప్పుడు అరబిందో యాజమాన్యం తాము 41 శాతం వాటాలను కొనుగోలు చేసుకున్నామని చెప్పింది. అయితే కేవీరావు మాత్రం తనను బెదిరించి వాటాలను లాక్కొన్నారని ఆరోపించారు. అంతేతప్ప వాటిని తిరిగి పొందడానికి పెద్దగా న్యాయపోరాటం చేసిన దాఖలాలు లేవు. ఏం చేసిన ఫలితముండదని కేవీరావు భావించి ఉండొచ్చని పలువురు అంటున్నారుఅయితే 2024 ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి వరకు మిన్నకున్న కేవీరావు ఒక్కసారిగా అరబిందో తనను బెదిరించి సీపోర్టులోని వాటాలను లాక్కొందని విమర్శిస్తూ సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీంతో సీఐడీ కేసు నమోదు చేసి విచారణ మొదలెట్టింది. అరబిందోకు చెందిన విక్రాంత్ రెడ్డికు సీఐడీ నోటీసులు ఇచ్చింది. సీఐడీ విచారణ ప్రారంభించింది. మరోవైపు ఈడీ కూడా మనీలాండరింగ్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించింది.

దీంతో విక్రాంత్ రెడ్డి బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లో కేవీరావు ఇన్‌ప్లీడ్ అయ్యారు. ఇలా కాకినాడ పోర్టు వివాదం సాగుతున్న నేపథ్యంలో వాటాలను వెనక్కి ఇచ్చేందుకు అరబిందో అంగీకరించి, బదిలీ చేసినట్లు తెలిసింది. దీంతో ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టినట్టు అయింది.

# సీనియర్లకు చెక్ పెట్టినట్టేనా

ఒంగోలు, జనవరి 22,వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత దాదాపు ఏడు నెలల నుంచి నిస్తేజంగా కనిపిస్తుంది. ఇంత దారుణమైన ఓటమిని చవి చూడటంతో నేతల నుంచి కార్యకర్తల వరకూ ఎవరూ జీర్ణించుకోలేకపోయారు. ఓటమి సంభవించినా కేవలం పదకొండు సీట్లకే తాము పరిమితమవుతామని వారు ఊహించలేదు. దీంతో పార్టీలో ఉండటం వేస్ట్ అన్న అభిప్రాయానికి వచ్చి నేతలు వెళ్లిపోతున్నారు. కీలకమైన నేతలు, జగన్ వారిపై నమ్మకం ఉంచి టిక్కెట్లు ఇచ్చిన వారు, మంత్రిపదవులు కట్టబెట్టిన వారు కూడా రాజీనామా చేశారు. ఒక్కొక్కరుగా వెళ్లిపోతున్నా ఉన్నవారితో పార్టీని మరింత బలోపేతం చేయాలని జగన్ భావించి త్వరలోనే తాను రాష్ట్ర వ్యాప్త పర్యటనకు వస్తానని ప్రకటించారు అంతే కాదు కొత్త నాయకత్వానికి పగ్గాలు అప్పగించాలని కూడా జగన్ భావిస్తున్నారు సీనియర్ నాయకులైతే రాజకీయాల్లో విలువలు లేకుండా వ్యవహరిస్తారన్న నమ్మకంతో జగన్ ఉన్నారని తెలిసింది. వారు అధికారం ఉంటేనే పక్కన ఉంటారని, దాదాపు 80 శాతం మంది సీనియర్ నేతలు అధికారం కోల్పోయిన వెంటనే పార్టీకి దూరమవుతారని కూడా భావించి కొత్త నాయకత్వానికి నియోజకవర్గ పగ్గాలు అప్పగించాలని చూస్తున్నారు. ఇందుకోసం నియోజకవర్గాల వారీగా కొత్త నాయకత్వం కోసం వెదుకులాటను జగన్ అండ్ టీం ప్రారంభించినట్లు వార్తలు అందుతున్నాయి. తన రాష్ట్ర పర్యటనలో కాకపోయినా తర్వాత అయినా వారిని నియోజకవర్గ ఇన్ ఛార్జిగా నియమించి ఇప్పటి నుంచే వారిని జనంలోకి పంపి అందరికీ పరిచయం చేయాలన్న యోచనలో వైసీపీ అధినేత ఉన్నట్లు తెలిసింది. నూతన నాయకత్వం, యువకులు అయితే తనను నమ్ముకుని ఉంటారని జగన్ భావించడమే ఇందుకు కారణం. అందుకే ఏడు నెలల్లోనే అధికార పార్టీ అయిన కూటమి ప్రభుత్వంపై పోరుకు సిద్ధమయ్యారు. తాను లేకపోయినా నాయకత్వం ఎలా ఉందో పరిశీలినకు తనకు ఉపయోగపడుతుందని భావించి ఈ రకమైన కార్యక్రమాలకు తెరదీశారంటున్నారు. నియోజకవర్గాల నుంచి నివేదికలు తెప్పించుకుని అందుకు అనుగుణంగా యాక్టివ్ గా ఉన్న ఐదుగురు యువకులైన నేతల పేర్లను తెప్పించుకుంటున్నారు. అందులో ఒకరికి నియోజకవర్గాల పగ్గాలను అప్పగిస్తే ఎన్నికలు ఎప్పుడు జరిగినా వారిని అభ్యర్థులుగా ప్రకటించవచ్చన్న ఆలోచనతో జగన్ ఉన్నారని చెబుతున్నారు.. అయితే జగన్ ఆలోచించిన కొందరు సీనియర్ నేతలు మాత్రం ఈ కార్యక్రమాలకు యాక్టివ్ అయినట్లు కనిపిస్తుంది. మొన్నటి వరకూ మౌనంగా ఉన్న నేతలందరూ రైతు సమస్యలు, విద్యుత్తు ఛార్జీల పెంపుదల వంటి కార్యక్రమాల్లో సీనియర్ నేతలు పాల్గొంటున్నారు. ముఖ్యమైననేతలు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒకింత ఆందోళనకు దిగుతున్నారు. ఇదే సమయంలో కేసులు ఎదుర్కొంటున్న నేతలు మాత్రం ఇటువంటి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తమపై ఏదో ఒక కేసు పెడతారని భావించి వారు ఈ ఆందోళన కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. వారికి మాత్రం వచ్చే ఎన్నికల్లో మినహాయింపు ఇస్తారని చెబుతున్నారు. నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుండటం కూడా ఈ కార్యక్రమాల ద్వారా కొత్త నాయకత్వాన్ని ఎంపిక చేసుకునేందుకు సులువు అవుతుందని జగన్ అంచనా వేస్తున్నారు. మొత్తం మీద జగన్ స్ట్రాటజీ పనిస్తుందా? లేదా? అన్నది చూడాలంటే వెయిట్

## పిఠాపురం నుంచే మొదలవుతోందా...

కాకినాడ, జనవరి 22, మొన్నటి సాధారణ ఎన్నికల నాటినుంచి స్పెషల్ ఫోకస్ ఉన్న నియోజకవర్గం కాకినాడ జిల్లాలోని పిఠాపురం. ఎందుకంటే ఇక్కడ నుంచే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేగా పోటీ చేశారు. భారీ మెజార్టీతో గెలిచి కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు.. పిఠాపురం నియోజకవర్గం ఫేమస్ కావడానికి కలగడానికి ఇది ఒక కారణమైతే.. నియోజకవర్గంలో మంచి పట్టున్న ఎస్వీఎస్ఎన్ వర్మ తన సీటును త్యాగం చేసి మరీ పవన్ కల్యాణ్‌ను ఆహ్వానించి, అన్నీ తానై గెలుపులో కీలకంగా వ్యవహరించారు.ఇప్పుడు ఏపీ డిప్యూటీ సీఎంగా లోకేష్ అర్హుడు, ఆయనకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని గత కొన్ని రోజులుగా వస్తోన్న డిమాండ్‌తోపాటు సోషల్ మీడియాలో కూడా ఈ డిమాండ్ ఎక్కువ అయింది. ఉభయగోదావరి జిల్లాల నుంచి మొట్టమొదటిగా వర్మ స్పందించారు. మంత్రి లోకేష్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వడం తప్పేంటని ప్రశ్నిస్తూనే ఆయా పార్టీల కార్యకర్తల మనోభావాలు వారికి ఉంటాయని, వాటిని గౌరవించుకోవాల్సిన బాధ్యత ఆ పార్టీలకు ఉంటుందన్నారు.. మంత్రి లోకేష్‌కు డిప్యూటీ పదవి ఇవ్వాలన్న డిమాండ్ ఎందుకు సరైనదేనో వివరిస్తూ కొన్ని ఉదాహరణలు కూడా చెప్పారు. దీంతో వర్మ వ్యాఖ్యలకు ఒక్కసారిగా ప్రాధాన్యత లభించింది..పిఠాపురం టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఉన్న వర్మ తన సీటును త్యాగం చేసి ఇచ్చారన్న సానుభూతి నియోజకవర్గంలోనే కాదు జిల్లాలో కూడా ఉంది.. ఆయన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కూడా అంతే సహకారం అందిస్తున్నారు.. అయితే ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఉన్న డిప్యూటీ సీఎం హోదా సరిసమానంగా టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేష్‌కు డిప్యూటీ సీఎం ఇవ్వాలన్న డిమాండ్‌ను ప్రెస్‌మీట్ ద్వారా వర్మ చెప్పడం రాష్ట్ర వ్యాప్తంగా ఇది హాట్ టాపిక్‌గా మారింది. ప్రతీ పార్టీకు వారి లెక్కలు వారికుంటాయి.. జగన్ ఓడిపోయినా ఆయన్ను ఆ పార్టీ కార్యకర్తలు సీఎం సీఎం అంటున్నారు.. జనసేన కార్యకర్తలు పవన్ కల్యాణ్‌ను సీఎం సీఎం అంటున్నారు.. అంటే ఇక్కడ ఎవరి పార్టీ వారికి అభిమానం వారికి ఉన్నట్లు గుర్తించాలి..సరిగ్గా ఇలాగే లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలన్న కోరిక టీడీపీ శ్రేణులకు ఉంటుంది.. లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయడమంటే మరొకరిని తక్కువ చేయడం అని ఎందుకు అనుకోవాలని వర్మ ప్రశ్నించారు. పార్టీ మనుగడ, ధైర్యం కోసం లోకేష్‌ను మంచి హోదాలో చూడాలనుకోవడంలో తప్పులేదన్నారు. ఏ ప్రాంతీయ పార్టీకు లేని కోటి సభ్యత్వాలు కలిగిన పార్టీ టీడీపీ అన్నారు వర్మ. దీనికి ముఖ్య కారకుడు లోకేష్ అని, చాలా ప్రాంతాలనుంచి లోకేష్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని కోరుతున్నారు. వాళ్లే కాదు తాను కూడా మద్దతు ఇస్తున్నానని, ఎందుకంటే టీడీపీ శకం ముగిసిందనే ప్రచారం నుంచి యువగళం పేరుతో మూడు వేల కిలోమీటర్లు నడిచి ప్రతీ కార్యకర్తలో జోష్ నింపిన ఘనత లోకేష్‌కే చెల్లుతుందన్నారు. దీనిపై ఎలాంటి వక్రభాష్యాలు, అపోహలకు పోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు వర్మ.. ఏదిఏమైనా పిఠాపురం నుంచే ఏపీ డిప్యూటీ సీఎం పదవివైపుగా లోకేష్ అడుగులు పడుతోందని ఉమ్మడి జిల్లాలోని టీడీపీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు..

## గోకులం షెడ్లను ప్రారంభించిన టిడిపి మండల అధ్యక్షుడు ఐవి ఉగ్రసేనారెడ్డి...

కొలిమిగుండ్ల, నంద్యాల జిల్లా అవుకు మండలంలోని సంఘ పట్నం గ్రామంలో జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గోకులం షెడ్లను నిర్మించింది. టిడిపి మండల అధ్యక్షులు ఐవి. ఉగ్రసేనారెడ్డి అధికారులు గ్రామ ప్రజలతో కలిసి గోకులం షెడ్లను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉగ్రసేనారెడ్డి మాట్లాడుతూ ఐదు ఎకరాల లోపు ఉన్న ప్రతి రైతు గోకులం షెడ్లను నిర్మించుకోవడానికి అర్హులని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎందుకీ డిప్యూటీ సీఎం అంశం

విజయవాడ, జనవరి 22, మంత్రి నారా లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలంటూ ఇటీవల వరుసగా టీడీపీ నేతలు గొంతు విప్పుతున్నారు. ఏపీలో టీడీపీ-బీజేపీ- జనసేనల కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆర్నెల్లు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎంగా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఉన్నారు. మంత్రి వర్గంలో మూడు పార్టీల నేతలు ఉన్నారు. ఈ క్రమంలో గత నాలుగైదు రోజులుగా మంత్రి నారా లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలనే డిమాండ్ అనూహ్యంగా తెరపైకి వచ్చింది.నారా లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలనే డిమాండ్ ఇప్పటికిప్పుడు అనూహ్యంగా పుట్టుకొచ్చిందా, దీనికి వేరే కారణాలు ఉన్నాయా అనే చర్చ రాజకీయ పార్టీల్లో జోరుగా సాగుతోంది. సమయం, సందర్భం లేకుండా ఎందుకు లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలనే డిమాండ్‌ను టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు భుజానికి ఎత్తుకున్నారనే సందేహాలు అందరిలోను ఉన్నాయి.టీడీపీ నేతల డిమాండ్లు వ్యూహాత్మకంగా చేసినవేననే అనుమానాలు కూడా ఇతర పార్టీల్లో ఉన్నాయి. ఈ క్రమంలో ఈ డిమాండ్ల వెనుక ఇతర కారణాలపై కూడా రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.ఈ వివాదానికి అసలు కారణం తిరుమలలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనగా తెలుస్తోంది. వైకుంఠ ఏకాదశి దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలోని బైరాగిపట్టెడలో ఉన్న రామానాయుడు స్కూల్ సమీపంలోని పద్మావతి పార్క్‌లో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు జనవరి 8వ తేదీన ప్రాణాలు కోల్పోయారు.ఈ ఘటన జరిగిన మర్నాడు సీఎం చంద్రబాబు ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ముఖ్యమంత్రి బాధితుల్ని పరామర్శించిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా ఘటనా స్థలాన్ని సందర్శించి బాధితుల్ని పరామర్శించారు. సాధారణంగా ముఖ?యమంత్రి పర్యటన తర్వాత ఇతర మంత్రులు విడిగా పర్యటించాల్సిన అవసరం ఉండదు. సీఎం పర్యటనలో వైద్య శాఖ మంత్రి సత్యకుమార్, బీజేపీ నేతలు కూడా పాల్గొన్నారు. ఘటన జరిగిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వచ్చే వరకు జనసేన ముఖ్య నేతలు ప్రమాదం జరిగిన ప్రాంతానికి రాలేదు.దర్శనం టోకెన్లు 9వ తేదీ గురువారం తెల్లవారుజామున జారీ చేయాల్సి ఉండగా బుధవారం ఉదయం నుంచి కౌంటర్ల వద్దకు భారీగా జనం చేరుకున్నారు. రామానాయుడు హైస్కూల్ జాతీయ రహదారికి దగ్గర్లో ఉండటంతో ఎక్కువ మంది టోకెన్ల కోసం అక్కడికే వచ్చారు. వారందర్నీ స్కూల్ దగ్గర్లో ఉన్న పార్కులోకి పంపి తాళాలు వేశారు. రాత్రి 8.40 గంటల సమయంలో ఓ మహిళ అస్వస్థతకు గురి కావడంతో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆమెను బయటకు తీసుకు రావడానికి గేటు తీశారు. అప్పటికే పార్కులో సామర్థ్యానికి మించి జనం ఉన్నారు.సరిగ్గా అదే సమయంలో పార్కులోకి మరో 50మందిని అనుమతించారు. ఓ రాజకీయ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుడు ఒత్తిడి చేయడంతో వారిని లోపలకు పంపారు. గేట్లు తీయడంతో క్యూ లైన్లలోకి వదులుతున్నారని వెనుక ఉన్నవారు భావించారు. దీంతో ఒక్కసారిగా అలజడి చెలరేగింది. అప్పటికే ఉదయం నుంచి తిండితిప్పలు లేకుండా ఉన్న జనం బయటకు వెళ్లేందుకు ముందుకు పరుగులు తీశారు. ఇదంతా కూటమి పార్టీల్లోని ఓ చోటా నాయకుడి నిర్వాకం వల్ల జరిగిందని ఘటన జరిగిన రోజే పోలీసులు ప్రభుత్వానికి స్పష్టం చేశారు.తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడంతో ప్రభుత్వం ఆత్మరక్షణలో పడింది. పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సి వచ్చింది. అదే సమయంలో కూటమి ప్రభుత్వంలో ఉన్న పవన్ కళ్యాణ్ బాధితుల పరామర్శ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టేశాయి. టీటీడీ ఛైర్మన్‌తో పాటు అందరూ క్షమాపణలు చెప్పాలని పవన్ ఏ ఉద్దేశంతో చేసినా అంతిమంగా ప్రభుత్వానికి మాత్రం విమర్శలు తప్పలేదు. పోలీసుల్ని, టీటీడీని బాధ్యుల్ని చేస్తూ పవన్ వ్యవహరించిన తీరు టీడీపీ నేతల్లో చాలామందికి రుచించలేదుతిరుపతిలో తొక్కిసలాట ఘటనకు కారణాలు స్పష్టంగా తెలిసినా పవన్ డిమాండ్‌తో తిరుపతి ఎస్పీని ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ నిర్ణయం వైసీపీకి బాగా ఊరటనిచ్చింది. తిరుపతి ఎస్పీ ముఖ్యమంత్రికి సన్నిహితుడని వైసీపీ పలుమార్లు విమర్శలు గుప్పించింది. పవన్ డిమాండ్ కారణంగా ఎస్పీ సుబ్బారాయుడును ప్రభుత్వం బదిలీ చేసింది. పొత్తు ధర్మం కోసం చంద్రబాబు సర్దుకుపోతున్నా జనసేన నుంచి తగిన సహకారం లేదనే భావన టీడీపీలో ఉంది. జనసేన తరపున తీసుకునే ఏ నిర్ణయానికైనా చంద్రబాబు సంపూర్ణంగా సహకరిస్తున్నారని ఈ క్రమంలో అనవసర రాద్ధాంతం దేనికనే వాదన టీడీపీ చేస్తోంది.

పవన్ కళ్యాణ్ ఇటీవల కర్నూలు జిల్లాలో గ్రీన్ కో సంస్థ నిర్మిస్తోన్న పవర్ ప్లాంటును సందర్శించారు. అటవీ పర్యావరణ మంత్రిగా ఉన్న పవన్ కర్నూలు జిల్లాలో నిర్మిస్తోన్న పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని సందర్శించారు. ఈ పర్యటన తర్వాతే టీడీపీ వైఖరిలో మార్పు వచ్చిందని జనసేన అనుమానిస్తోంది. డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కళ్యాణ్ పర్యటనలపై టీడీపీకి అభ్యంతరం ఉండాల్సిన అవసరం ఏముందనేది ఆ పార్టీ వాదనగా ఉంది.కూటమి పార్టీల తరపున నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో కూడా జనసేన కార్యకర్తలు పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి సీఎం సీఎం అంటూ చేస్తోన్న నినాదాలు కూడా టీడీపీలో అసంతృప్తికి కారణం అయ్యాయి. సమయం సందర్భం లేకుండా చేస్తోన్న ఈ నినాదాలపై పవన్ కూడా బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నినాదాలు కూడా ఉద్దేశ పూర్వకంగా జరుగుతున్నవనే అనుమానాలు టీడీపీలో ఉన్నాయి.మరోవైపు డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ కళ్యాణ్ కంటే నారా లోకేష్ ఎక్కువ అధికారాన్ని అనుభవిస్తున్నారనే భావన జనసేనలో ఉంది. కూటమి ప్రభుత్వంలో ఏ శాఖలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా అంతిమంగా నారా లోకేష్ అనుమతి పొందాలనే క్లారిటీ టీడీపీ మంత్రులకు స్పష్టత ఉంది. ఇది జనసేన వర్గాలకు రుచించడం లేదు. పేరుకు డిప్యూటీ సీఎం అయినా లోకేష్ వద్దే ఎక్కువ అధికారం ఉందని జనసేన భావిస్తోంది.పవన్ కళ్యాణ్ ఇటీవల సోదరుడు నాగబాబును మంత్రి వర్గంలో తీసుకోవాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు.నాగబాబు రాజ్యసభకు పంపాలని ప్రయత్నించినా మూడింటిలో ఒక స్థానం బీజేపీకి ఇవ్వడంతో జనసేనకు అవకాశం దక్కలేదు. 21 మంది ఎమ్మెల్యేలు ఉన్న జనసేన పార్టీలో పవన్‌కు సీఎం పదవి, నాగబాబుకు మంత్రి పదవి వంటి డిమాండ్లు చేస్తే 135మంది ఎమ్మెల్యేలు ఉన్న పార్టీలో లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలని అడిగితే తప్పేంటనే వాదన టీడీపీ వర్గాలు చేస్తున్నాయి.అదే సమయంలో జనసేనలో ఒక కులానికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం కూడా చర్చనీయాంశంగా మారింది. మంత్రి పదవులు, ఎంపీలు, ఎమ్మెల్సీ అవకాశం, పిఏసీ ఛైర్మన్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్ వంటి పదవులు పవన్ చెప్పిన వారికే ఇచ్చారని టీడీపీ గుర్తు చేస్తోంది. నాగబాబుకు మంత్రి పదవి విషయంలో కూడా ఎలాంటి పేచీ పెట్టలేదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.లోకేష్‌ను టీడీపీతో చంద్రబాబు రాజకీయ వారసత్వాన్ని అందించే క్రమంలో తాజా డిమాండ్లు పుట్టుకొచ్చాయి. చంద్రబాబు తర్వాత ఆ పగ్గాలు నారా లోకేష్‌కు దక్కాలని టీడీపీ భావిస్తోంది. అదే సమయంలో ఏపీలో శాశ్వత రాజకీయ భవిష్యత్తు కోసం జనసేన ప్రయత్నాలు చేస్తోంది. పవన్ కళ్యాణ్ ముఖ?యమంత్రి అయ్యేందుకు ఏ అవకాశాన్ని జారవిడుచుకోకూడదని జనసేన భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో రెండు కులాలకు పరిమితమైన అధికార పగ్గాలను ఎప్పటికైనా దక్కించుకోవాలనే అకాంక్ష జనసేనలో బలంగా ఉంది.ప్రస్తుతం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వానికి ఎలాంటి ఢోకా లేదు. రాజకీయ అవసరాల దృష్ట్యా అన్ని పార్టీలతో సర్దుకుపోయే ధోరణిలోనే చంద్రబాబు ఉన్నారు.

అదే సమయంలో కుమారుడి రాజకీయ భవిష్యత్తు విషయంలో కూడా బాబు స్పష్టమైన అవగాహన ఉంటారని టీడీపీ సీనియర్లు చెబుతున్నారు. లోకేష్‌కు డిప్యూటీ సీఎం పదవి డిమాండ్ కాకతాళీయంగా పుట్టుకొచ్చిందా, దీని వెనుక ముందస్తు వ్యూహాలు ఉన్నాయా అనేది కాలమే తేలుస్తుంది.

# హోమ్ కు పరిమితమైన మాజీ హోమ్ మంత్రులు

గుంటూరు, జనవరి 22 వైసీపీ అధికారాన్ని కోల్పోయిన వెంటనే చాలా మంది రాజకీయంగా కనుమరుగవుతున్నారు. గత ఎనిమిది నెలలుగా వారు కన్పించడం మానేశారు. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో పదవులు అనుభవించిన వారు పవర్ పోగానే పెదవులను మూసివేశారు. నాడు అధికార దర్పాన్ని ప్రదర్శించిన నేతలు నేడు చూద్దామన్నా కనిపించడం లేదు. అంటే అధికారంలో ఉంటేనే కనిపించే నేతలు పార్టీలో ఎక్కువ మంది ఉన్నారని దీన్ని బట్టి పార్టీ నాయకత్వానికి ఈపాటికే అర్థమయి ఉండాలి. కొందరు నేతలు పార్టీని వీడి వెళుతుండగా, వీరు పార్టీలో ఉన్నారా? లేరా? అన్న అనుమానం కూడా కలిగేలా వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యకర్తలకు కూడా అందుబాటులో లేకుండా పోయారు. నియోజకవర్గం మార్చడంతో. అటువంటి వారిలో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇద్దరు మహిళలు హోం మంత్రులుగా పనిచేశారు. వారు గత ఎనిమిది నెలలుగా కనిపించడం మానేశారు. ఒకరు తొలిసారి హోంమంత్రి అయిన మేకతోటి సుచరిత. ఈమె గుంటూరు జిల్లా పత్తిపాడు నియోజకవర్గం నుంచి గెలిచి జగన్ తొలి కేబినెట్ లో హోం మంత్రి అయ్యారు. హోం మంత్రిగా దాదాపు రెండున్నరేళ్లు యాక్టివ్ గానే ఉన్నారు. అయితే విస్తరణలో ఈమె పదవి కోల్పోయారు. అప్పటి నుంచి మేకతోటి సుచరిత కామ్ అయిపోయారు. పెద్దగా కనిపించడం లేదు. మొన్నటి ఎన్నికల్లో మేకతోటి సుచరితను తాడికొండ ఎమ్మెల్యేగా పోటీ చేయించారు. అయితే అక్కడ ఓటమి పాలయ్యారు. జిల్లా పార్టీలో కూడా ఆమె యాక్టివ్ గా లేరు. ఆమె ఎక్కడ ఉన్నారన్నది పార్టీ నేతలకు కూడా అర్థం కావడం లేదు. ఇక జగన్ కేబినెట్ లో ఐదేళ్ల పాటు మంత్రిగా పనిచేసిన మరో నేత తానేటి వనిత. ఆమె రెండో విడత మంత్రివర్గ విస్తరణలో హోం మంత్రిగా జగన్ బాధ్యతలను అప్పగించారు. ఐదేళ్ల పాటు మంత్రిగా పనిచేసిన తానేటి వనిత ఎన్నికల ఫలితాల తర్వాత మాత్రం అదృశ్యమయ్యారు. మొన్నటి ఎన్నికల్లో తానేటి వనితను గోపాలపురం నియోజకవర్గం నుంచి పోటీ చేయించారు. అయితే కూటమి ప్రభంజనంలో తానేటి వనిత కూడా ఓటమి పాలయ్యారు. నాటి నుంచి నేటి వరకూ ఆమె కనిపించడం లేదని క్యాడర్ అధినాయకత్వానికి ఫిర్యాదు చేస్తుంది. అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి ఓటమి పాలయ్యాక పార్టీని పట్టించుకోకపోవడం ఏంటన్న ప్రశ్న తలెత్తుతుంది. వాగ్దాటి ఉన్నా... ఇద్దరు మహిళ నేతలకు మంచి వాగ్దాటి ఉంది. ఇద్దరినీ తమ సొంత నియోజకవర్గాలను మార్చినందుకే అసంతృప్తిగా ఉన్నారా? అన్న అనుమానం వ్యక్తమవుతుంది. అయితే తిరిగి వారి పాత నియోజకవర్గాలకు ఇన్ ఛార్జులుగా నియమిస్తే యాక్టివ్ అయ్యే అవకాశాలు లేకపోలేదు అంటున్నారు. కానీ ఇద్దరు మహిళ నేతలు కనీసం అధికార పార్టీపై విమర్శలు చేయడానికి కూడా ముందుకు రావడం లేదంటే పార్టీపై అసంతృప్తి ఏ స్థాయిలో ఉందో అర్థంచేసుకోవచ్చు. ఇద్దరూ ఇక రాజకీయాలనుంచి తప్పుకున్నట్లా? లేక ఎన్నికల సమయానికి మళ్లీ ముందుకొచ్చి టిక్కెట్ తమకే కావాలని పట్టుబడతారా? అన్నది వేచి చూడాలి. కానీ వీరిద్దరి విషయం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది.

### త్వరలోనే లింగంగుంట్ల అగ్రహారం భూ సమస్యలకు పరిష్కారం

### నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు వెల్లడి

నరసరావుపేట, కూటమి ప్రభుత్వంలోనే లింగంగుంట్ల అగ్రహారం భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. బుధవారం లింగంగుంట్ల గ్రామ రైతులతో కలిసి కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ సూరజ్ ను కలిశారు. అనంతరం విలేకరులతో అరవిందబాబు మాట్లాడుతూ, నరసరావుపేట నియోజకవర్గం నరసరావుపేట మండలం లింగంగుంట్ల అగ్రహారం భూ సమస్యలకు త్వరలోనే ఓ పరిష్కారం లభిస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న 1700 ఎకరాల లింగంగుంట్ల భూములకు ప్రస్తుతం రాష్ట్రంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల లో పీఠాధిపతులతో చర్చించి రిజిస్ట్రేషన్ కార్యక్రమం త్వరలో జరగబోతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రెవెన్యూ మినిస్టర్, రెవెన్యూ కార్యదర్శి సిసోడియా లింగంగుంట్ల అగ్రహారం భూములకు సంబంధించి పీఠాధిపతులతో చర్చించి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉగాది నాటికి అగ్రహారం భూములను రైతులకు రిజిస్ట్రేషన్ చేసేందుకు పీఠాధిపతులు అంగీకరించినట్లు వారి తాలూకు సీఈఓ చంద్రమౌళి చెప్పారని తెలియజేశారు. కలెక్టరు,జేసీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు

# ప్రారంభమైందా... ముగిసిందా...

విజయవాడ, జనవరి 22, ఏపీలో ఇటీవల మంత్రి నారా లోకేష్ పేరు మార్మోగింది. లోకేష్ కు డిప్యూటీ సీఎం పోస్టు ఇవ్వాల్సిందేనని పలువురు టీడీపీ అగ్ర నేతల నుండి నాయకుల వరకు తమ వాణి వినిపించారు. ముందు మహాసేన రాజేష్, ఆ తర్వాత కడప టీడీపీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ భరత్, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఇలా ఒకరి తర్వాత ఒకరు లోకేష్ కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని గళమెత్తారు. అంతేకాదు సోషల్ మీడియాలో టీడీపీ వర్సెస్ జనసేన కామెంట్స్ మార్మోగిందిలోకేష్ కు డిప్యూటీ సీఎం, పవన్ కు సీఎం పోస్టు ఖరారైందని పలువురు జనసేన నాయకులు పోస్టులు కూడ పెట్టారు. ఈ దశలోనే తిరుపతికి చెందిన జనసేన లీడర్ కిరణ్ రాయల్ నేరుగా సీఎం పదవి పవన్ కు ఇవ్వాలని కరాఖండిగా చెప్పారు. పలు డిబేట్ లలో కూడ ఇదే వాణి వినిపించారు కిరణ్. ఇలా టీడీపీలో కొందరు, జనసేనలో కొందరు అదేపనిగా విమర్శల జోరు సాగించారు. ఇలాంటి పరిస్థితిని ఇప్పుడే సద్దుమణిగించకుంటే, భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని భావించారో ఏమో కానీ, టీడీపీ అధినాయకత్వం దీనిపై స్పందించింది. లోకేష్ కు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చే ఊహాగానాలు అబద్దమని, ఎవరైనా ఈ విషయంపై మాట్లాడితే చర్యలు తప్పవంటూ క్యాడర్ కు హెచ్చరించింది.టీడీపీ ఇలా ప్రకటన ఇచ్చిన మరుసటి రోజు జనసేన కూడ ఇదే తరహా హెచ్చరికలు జారీ చేసింది. డిప్యూటీ సీఎం అంశంపై ఎవరూ స్పందించవద్దని, ఈ అంశంపై మీడియా ముందు గానీ, సోషల్ మీడియాలో గానీ స్పందించవద్దంటూ జనసేన కేంద్ర కార్యాలయం ప్రకటన ఇచ్చింది. మొత్తం మీద అటు టీడీపీ, ఇటు జనసేన పార్టీలు చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ఉందని పొలిటికల్ టాక్. మొదట ఈ టాక్ వినిపించినప్పుడే సద్దుమనిగించి ఉంటే నేడు ఇలాంటి పరిస్థితి ఉండదని రాజకీయ విశ్లేషకులు తెలుపుతున్నారు. ఇక టీడీపీకి కౌంటర్ గా జనసేన సీఎం నినాదం తెరపైకి తెస్తో?ంది. లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలని తెలుగు తమ్ముళ్లు డిమాండ్ చేస్తుంటే.. పవన్‌కళ్యాణ్‌ను సీఎంగా చూడాలనే కోరిక ఉన్నట్లు జనసేనికులు ప్రకటనలు చేస్తున్నారు.. సమయం సందర్భంగా లేకుండా మొదలైన ఈ రచ్చ ఏపీ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. టీడీపీలో కీలక పదవుల్లో ఉన్న నేతలు, ఎమ్మెల్యే, మాజీలు లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలని డిమాండ్ చేస్తూ కూటమిలో కొత్త చర్చకు తెరలేపుతున్నారు. మాజీ మంత్రి, నాలుగు సార్లు ఎమ్మెల్యే అయిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లాంటి నేతలు కూడా అదే డిమండ్ చేస్తుండటం విచిత్రంగా తయారైంది.మంత్రి పదవిపై సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చాలా ఆశలు పెట్టుకున్నారు. ఇవే తన చివరి ఎన్నికలంటున్న ఆయన మంత్రిగానే పొలిటికల్ రిటైర్‌మెంట్ తీసుకుంటాననని భావించారంట. అయితే పార్టీ భవిష్యత్తు అవసరాల కోసం చంద్రబాబు కొత్తవారికి, యువతకు మంత్రివర్గంలో పెద్దపీట వేసి పార్టీలోని సీనియర్లను పక్కన పెట్టేశారు. ఆ ఫ్రస్టేషన్‌లోఉన్న ఎలాగైనా పార్టీ అధిష్టానం దగ్గర మంచి మార్కులు కొట్టేసి.. ఏదో ఒక పదవి దక్కించుకోవడానికే ఇలాంటి పోస్టులు పెడుతున్నారంట. కడప జిల్లాలో ఎన్టీఆర్ వర్ధంతి సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సమక్షంలోనే టీడీపీ పొలిట్ బ్యూరో మెంబర్ రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలోనే ఆ డిమాండ్ వినిపించి చర్చకు తెరలేపారు.కడపలో వైసీపీ కంచుకోటను బద్దలు గొట్టి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధవీరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆమెకు మంత్రి పదవి వస్తుందని వారి వర్గం చాలా ఆశలు పెట్టుకుంది. అయితే ఆమెకు ఆ ఛాన్స్ దక్కలేదు. రాష్ట్రంలో ఒక మంత్రి పదవి ఖాళీగా ఉండటం, దాని భర్తీ సందర్భంగా కొందరు మంత్రులను మారుస్తారన్న ప్రచరం జరుగుతుంది. ఎలాగూ కొత్త వారికే టీడీపీ పెద్దపీట వేస్తుంది కాబట్టి, మొదటి సారి గెలిచిన మాధవిరెడ్డికి కేబినెట్ బెర్త్ దక్కుతుందన్న ఆశతో శ్రీనివాసరెడ్డి సరికొత్త డిమాండ్‌తో లోకేష్ దృష్టిలో పడే ప్రయత్నం చేశారన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. శ్రీనివాసరెడ్డి వాయిస్ వినిపించిన మరుసటి రోజే పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలని ప్రతిపాదించారు. లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలని టీడీపీ శ్రేణులు?డిమాండ్ చేయడంలో తప్పేముందని వర్మ ప్రశ్నించారు.ఎవరి లెక్కలు ఎలా ఉన్నా పిఠాపురంలో పవన్‌కళ్యాణ్ కోసం సీటు త్యాగం చేసిన వర్మ ఎమ్మెల్సీ పదవిపై చాలా ఆశలు పెట్టుకున్నారు. అయితే మొదటి టర్మ్‌లో ఆయనకు అవకాశం దక్కలేదు. వైసీపీ నుంచి వచ్చిన సీ. రామచంద్రయ్య వంటి వారికి ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టిన చంద్రబాబు.. ఎందుకనో వర్మకు మాత్రం అవకాశం ఇవ్వలేదు. ఆ క్రమంలో చట్ట సభలో అడుగుపెట్టాలని తహతహలాడుతున్న వర్మ .. తాను లైన్‌లో ఉన్నానని లోకేష్‌కు గుర్తు చేయడానికే డిప్యూటీ సీఎం మంత్రం పఠిస్తున్నారన్న సెటైర్లు వినిపిస్తున్నాయి.ఆ డిమాండ్‌పై రాజమండ్రి ఎమ్మెల్చే ఆదిరెడ్డి వాసు తనదైన స్టైల్లో స్పందించారు. నారా లోకేష్ కు డిప్యూటీ సీఎం మాత్రమే కాదు.. సీఎం అవ్వాలని వ్యక్తిగతంగా కోరుకుంటున్నాని టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వ్యాఖ్యానించారు. అలానే పవన్ కళ్యాణ్ కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చినా స్వాగతిస్తానని స్పష్టం చేశారు. ఎన్డీఏ కూటమిలో ఎవరికి ఏ స్థానం ఇవ్వాలో పెద్దలు నిర్ణయిస్తారని .. వర్మ లేదా తమ పార్టీలో ఇంకెవరైనా చెప్పినా వారి వ్యక్తిగత అభిప్రాయమే అని తేల్చి చెప్పారు. ఎన్డీఏ కూటమిలో అందరూ బాగానే ఉన్నారని.. వైసీపీ పిల్ల సైకోలు చిచ్చు పెట్టాలని చూస్తున్నారని చురకలు అంటించారు.మంత్రి నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలంటున్న టీడీపీ నేతల డిమాండ్‌పై జనసేన అధికార ప్రతినిధి కిరణ్ రాయల్ స్పందించారు. నారా లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేసుకోవాలని టీడీపీ వాళ్లకు ఉంటే.. పవన్ కల్యాణ్‌ను సీఎం చేసుకోవాలనే కోరిక మాకూ ఉంటుందన్నారు. ఎన్నికలకు ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం ముందుకు వెళ్లాలి? అలా వెళ్తేనే అందరికీ మంచిది అంటూ .. వైసీపీ చేతికి అనవసరంగా అస్త్రాలు అందించవద్దని సూచించారు.ఆదిరెడ్డి వాసు, కిరణ్ రాయల్ పొత్తు ధర్మాన్ని గౌరవిస్తూ ఇచ్చిన స్టేట్‌మెంట్లపై తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క పవన్‌కళ్యాణని లోకేష్ తన అన్నలాంటి వాడని గౌరవిస్తూ, ఆయనకు పాదాభివందనం చేసి పెద్దరికాన్ని గౌరవిస్తున్నారు. మరోవైపు చంద్రబాబు సైతం ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం చెప్పింది జరగాల్సిందే అన్నట్లు ఆయనకు వాల్యూ ఇస్తున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్, ఏపీలో వైసీపీలు పాలించినప్పుడు ఒకరికి నలుగురు డిప్యూటీ సీఎంలు ఉండేవారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. రెండో డిప్యూటీ సీఎం అన్న ప్రస్తావనే కనిపించదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరి మాయలోనో పడో.. లేకపోతే ఎవరి మెహర్బానీ కోసమో నేతలు ఇలాంటి

# ముప్పేట దాడిలో మావోయిస్టులు

రాయ్ పూర్, జనవరి 22, మావోయిస్టులను పూర్తిగా ఏరివేయాలనే లక్ష్యంతో కేంద్రం అందుగులు వేస్తోంది. ముఖ్యంగా అమిత్ షా ఈ విషయంలో పట్టుదలగా ఉన్నారు. దీంతో భద్రతా బలగాలు మావోయిస్టుల కోటల్లోకి దూసుకెళు ్తన్నాయి. అన్ని దారుల్లో దగ్గరకు చేరుతున్నాయి. దీంతో వారు తమను ఎలా రక్షించుకుంటారనే చర్చ జరుగుతోంది.గతంతో పోలిస్తే ప్రస్తుతం మావోయిస్టుల బలంగా భారీగా తగ్గింది. ఎదురుకాల్పుల్లో చాలామంది ప్రాణాలు కోల్పోయారు. ఇంకా కొందరు ఉన్నా.. వారు వయోభారంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో.. లొంగిపోవాలని ప్రభుత్వాలు పిలుపునిస్తున్నాయి. అదే సమయంలో ఏరివేతకు ఏర్పాట్లు చేస్తున్నాయి. దీంతో మావోయిస్టులు తమ ప్రాణాలను ఎలా కాపాడుకుంటారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అబూజ్‌మడ్ అడవులు మావోయిస్టులకు పెట్టని కోట అనే ప్రచారం ఉంది. చాలామంది కీలక నాయకులు అక్కడే ఉండి ఉద్యమాన్ని నడిపిస్తున్నారని నిఘావర్గాలు గతంలో చాలాసార్లు అనుమానించాయి. ఈ నేపథ్యంలో.. అబూజ్‌మడ్ అడవులను భద్రతా బలగాలు జల్లెడ పడుతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే చుట్టుముట్టాయి. ఈ క్రమంలో వరుస ఎదురుకాల్పుల ఘటనలు జరుగుతున్నాయి. పదుల సంఖ్యలో మావోయిస్టులు చనిపోతున్నారుఅబూజ్‌మడ్ అడవుల్లో భద్రతా బలగాలు పకడ్బందీగా ముందుకెళ్తున్నాయి. పైన డ్రోన్లను ఎగరేస్తూ.. సమాచారం తెలుసుకుంటున్నాయి. అదే సమయంలో కింద అత్యాధునిక ఆయుధాలతో ముందుకెళ్తున్నాయి. అన్ని మార్గాలను తమ అధీనంలోకి తెచ్చుకుంటున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల బీజాపుర్ జిల్లాలో ఎదురుకాల్పులు జరగ్గా.. 16 మంది మావోయిస్టులు మరణించారు.అబూజ్‌మడ్ అడవులు దట్టంగా ఉంటాయి. ఎత్తైన కొండలు ఉంటాయి.

ఇవి శత్రుదుర్భేద్యంగా ఉంటాయని భావించి మావోయిస్టులు దీన్ని కేంద్రంగా చేసుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. దంతెవాడ, నారాయణ్‌పుర్, బీజాపుర్ జిల్లాల్లో దాదాపు 4 వేల ఎకరాల్లో అబూజ్‌మడ్ అడవులు విస్తరించి ఉన్నాయి. ఇక్కడికి రావడం భద్రతా బలగాలకు సాధ్యం కాదని.. మావోయిస్టు అగ్రనేతలు తలదాచుకుంటారనే ప్రచారం ఉంది.ఈ అడవుల్లోనే మావోయిస్టులు ఆయుధాలను దాచిపెడతారని, కొత్తవారికి శిక్షణ ఇస్తారని భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి. అందుకే కొన్ని రోజులుగా అబూజ్‌మడ్‌లోకి చొచ్చుకెళుతున్నాయి. అడవి లోపల ఉన్న మావోయిస్టులు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఇందుకోసం తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, ఒడిశా పోలీసులతో కలిసి ఆపరేషన్లు చేస్తున్నాయి. డ్రోన్లతో నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తున్నాయిదీంతో దట్టమైన అడవుల్లో ఉన్న తాజా సమాచారం ఎప్పటికప్పుడు భద్రతా బలగాలకు చేరుతోంది.

రాత్రి వేళ కూడా డ్రోన్ల నిఘా ఉండటంతో మావోయిస్టులు అడుగు కదపలేని పరిస్థితి నెలకొందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గాలింపు వేగవంతం అయ్యింది. మావోయిస్టు పార్టీ అగ్రనేతలంతా అబూజ్‌మడ్‌లోనే ఉన్నారని భావిస్తున్న బలగాలు. చొచ్చుకెళ్తున్నాయి. దీంతో వారి బారి నుంచి మావోయిస్టులు తమను ఎలా రక్షించుకుంటారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 16న ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన బడె చొక్కారావు అలియాస్ దామెదర్ చనిపోయారని వార్తలు వచ్చాయి. కానీ.. తాను క్షేమంగా ఉన్నానని చొక్కారావు తన సన్నిహితులకు చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. ఆయన అబూజ్‌మడ్ అడవుల్లోనే ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

# డిప్యూటీ సీఎం డిమాండ్ కు సీఎంతో చెక్

తిరుపతి, జనవరి 22, టీడీపీ లోకేష్ డిప్యూటీ సీఎం చేయాలన్న స్లోగన్ బలంగా వినిపించింది. భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అయితే.. డిప్యూటీ సీఎం కాదు.. ఏకంగా ముఖ్యమంత్రి పదవికి లోకేష్ అర్హుడు అంటూ సంచలన ఆరోపణలు చేశారు. అది కూడా సీఎం చంద్రబాబు ఎదుట అలా అనడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు ఈరోజు తెలుగుదేశం పార్టీ ప్రత్యేక ప్రకటన ఇవ్వాల్సి వచ్చింది. ఇకముందు ఇలాంటి ప్రకటనలు వద్దు అంటూ పార్టీ శ్రేణులకు ఆదేశాలు ఇచ్చే దాకా పరిస్థితి వచ్చింది. తొలుత మహాసేన రాజేష్ ఈ తేనె తుట్టను కదిపారు. డిప్యూటీ సీఎం పోస్టుకు లోకేష్ అర్హుడు అంటూ వ్యాఖ్యానించారు. అవి క్రమేపీ విస్తరించాయి. రెడ్డప్ప గారి శ్రీనివాసులు రెడ్డి, బుద్దా వెంకన్న, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పిఠాపురం వర్మ తదితరులు లోకేష్ ను డిప్యూటీ సీఎం పదవికి ఎంపిక చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. చివరకు అనంతపురంలో సీఎం చంద్రబాబు ఎదుటే సీనియర్ నేత కాల్వ శ్రీనివాసులు సైతం డిమాండ్ చేయడం విశేషం. అయితే ఉన్నట్టుండి టిడిపి హై కమాండ్ దీనిపై స్పందించి ప్రచారానికి బ్రేక్ చేసింది. అయితే తెలుగుదేశం పార్టీ ఈ విషయంలో ఎందుకు వెనక్కి తగ్గింది అన్నది ఇప్పుడు చర్చ.రాష్ట్రంలో మూడు పార్టీలు ఉమ్మడిగా ముందుకు వెళుతున్నాయి. కూటమి దశాబ్ద కాలం పాటు కొనసాగాలని భావిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో కూటమి కట్టక ముందే ఒక ఒప్పందానికి వచ్చాయి. కూటమి అధికారంలోకి వస్తే చంద్రబాబు సీఎం కావాలని, పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎం ఇవ్వాలని, మిగతా నేతలకు ఇతర పదవులు పంపకాలు చేసుకోవాలని అప్పట్లో నిర్ణయించారు. పవన్ కళ్యాణ్ కు ఏకైక డిప్యూటీ సీఎం హోదా ఇస్తేనే గౌరవం అని అంతా ఏకాభిప్రాయానికి వచ్చారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కాకమునుపే లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న డిమాండ్ తెరపైకి రావడం విశేషం. కేవలం లోకేష్ టీం గా భావించే నేతలే ఈ తరహా వ్యాఖ్యానాలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.వాస్తవానికి తెలుగుదేశం పార్టీలో ఇప్పుడు సుప్రీం లోకేష్ ఎవరు అంగీకరించినా.. అంగీకరించక పోయినా ఇది వాస్తవం. అయితే తెలుగుదేశం పార్టీ పరంగా లోకేష్ ముందంజలో ఉండాలని కోరుకోవడం తప్పులేదు.

పైగా నామినేటెడ్ పదవుల పంపకాలు జరుగుతున్న ఇటువంటి సమయంలో.. లోకేష్ ప్రాపకం కోసం ఇలా మాట్లాడిన నేతలు ఉన్నారు. కానీ ఒకేసారి ఒక వ్యూహం ప్రకారం నేతలంతా లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలని కోరడం మాత్రం.. తెర వెనుక ఏదో జరుగుతోందన్న అనుమానాలు పెరిగాయి. సాధారణంగా టిడిపి అనుకూల మీడియా స్ట్రాటజీ ఒకలా ఉంటుంది. ఇప్పుడు డిప్యూటీ సీఎం చేయాలన్న ప్రతిపాదన కూడా అనుకూల మీడియా నుంచి వచ్చింది. సానుకూలత వస్తే ఒకలా.. లేకుంటే మరోలా వెళ్లడం టిడిపి స్ట్రాటజీ కూడా. లోకేష్ కు డిప్యూటీ సీఎం హోదా విషయంలో కూడా అదే జరిగి ఉంటుందన్న అనుమానాలు ఉన్నాయి.అయితే లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న ప్రచారంపై వ్యతిరేకత ఎక్కడి నుంచి వచ్చింది అన్నది ప్రశ్న. ప్రజలు పట్టించుకునే స్థితిలో లేరు. లోకేష్ తనను తాను ప్రూవ్ చేసుకున్నారు. మంగళగిరిలో భారీ మెజారిటీతో గెలిచారు. మంత్రిగా కూడా మంచి మార్కులు పడ్డాయి. ఆయన విషయంలో ఎవరికీ అభ్యంతరాలు ఉంటాయి. జనసేన తో పాటు పవన్ కళ్యాణ్ కు మాత్రమే ఉంటాయి అన్నది ఒక అనుమానం. వాస్తవానికి డిప్యూటీ సీఎం అనేది గౌరవం మాత్రమే. టిడిపి హయాంలో ఇద్దరు డిప్యూటీ సీఎంలు ఉండేవారు. వైసిపి హయాంలో అయితే ఏకంగా ఐదుగురిని నియమించారు. వాస్తవానికి పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయిన తర్వాతే ఆ పదవికి ఎంతో కొంత గౌరవం పెరిగింది.

చంద్రబాబు తర్వాత అంతటి ఇమేజ్ పొందగలుగుతున్నారు పవన్. అందుకే ఆ గౌరవం కోసం పరితపిస్తున్నారు తెలుగుదేశం నేతలు. అయితే ఇన్ని రోజులు సైలెంట్ గా ఉన్న పవన్.. తిరుపతి నేత కిరణ్ రాయల్ తో కౌంటర్ ఇప్పించినట్లు ప్రచారం నడుస్తోంది. లోకేష్ డిప్యూటీ సీఎం కావాలని టిడిపి నేతలు ఎలా కోరుకుంటున్నారో.. అలాగే జనసేన నాయకులు కూడా పవన్ కళ్యాణ్ సీఎం కావాలని కోరుకుంటున్నారని కిరణ్ రాయల్ చేసిన కామెంట్స్ సంచలనం రేపాయి. అయితే కిరణ్ రాయల్ ప్రకటన నేపథ్యంలోనే తెలుగుదేశం పార్టీ.. లోకేష్ కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలన్న ప్రకటనలను మానుకోవాలని సూచించడం విశేషం. ఈ విషయంలో టిడిపి ఎలా వెనక్కి తగ్గడం వెనుక పవన్ ప్లాన్ సక్సెస్ అయినట్లు ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# డాలర్ డ్రీమ్సేనా.....

అమెరికా 47వ అధ్యక్షుడిగా వైట్‌హౌస్‌లో అడుగుపెట్టిన డొనాల్డ్ ట్రంప్ తొలి రోజే పలు సంచలనాలకు తెరతీశారు. ఎన్నికల ప్ర చార సమయంలో హామీ ఇచ్చినట్లుగా అక్రమ వలసలను అరికట్టడంతో పాటుగా పదుల సంఖ్యలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వీటిలో అత్యం త ప్రధానమైనది 'జన్మతః పౌరసత్వం'పై వేటు. దాదాపు వందేళ్లుగా అనుసరిస్తూ వస్తున్న ఈ విధానానికి ట్రంప్ స్వస్తి పలికారు.అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతల చేపట్టిన వెంటనే అక్రమ వలసలపై డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన లక్షల మంది విదేశీయులను ఆందోళనకు గురిచేస్తోంది. అమెరికాకు అక్రమంగా వచ్చినవారిని వెనక్కి పంపడం ఖాయమని ట్రంప్ చేసిన ప్రకటన వణికిస్తోంది. తాత్కాలిక వీసాలపై వచ్చినవారిదీ ఇదే పరిస్థితి. సరైన పత్రాల్లేకుండా అమెరికాలో నివసిస్తున్న విదేశీ పౌరుల సంఖ్య దాదాపు 1.40 కోట్లు ఉంటుందని అంచనా. వీరిలో సుమారు 7.25 లక్షల మంది భారతీయులే. మెక్సికో, ఎల్ సాల్వెడార్ పౌరుల తర్వాతి స్థానం మనోళ్లదే.ఈ నిర్ణయం ప్ర భావం అమెరికాలో ఉంటున్న లక్షలాదిమంది భారతీయులపై తీవ్ర ప్రభా వం చూపించనుంది. అక్రమంగా అమెరికాలో ఉంటున్న వారితో పాటుగా విద్యార్థులు, టూరిస్టు, హెచ్1బీ లాంటి తాత్కాలిక వర్క్ వీసాలపై దే శంలో ఉంటున్న వారికి జన్మించే పిల్లలకు ఇకపై అమెరికా పౌరసత్వం ల భించదు. ఈ తరహా పౌరసత్వాన్ని ఏ దేశం కూడా ఇవ్వడం లేదని, తాముకూడా ఇచ్చేది లేదని ట్రంప్ స్పష్టం చేశారుతల్లిదండ్రుల్లో కనీసం ఒక్కరై నా అమెరికా పౌరసత్వం, శాశ్వత నివాసం, గ్రీన్‌కార్డు, అమెరికా మిలిటరీ సభ్యత్వం ఇలా ఏదైనా ఒక గుర్తింపు ఉంటేనే వారి పిల్లలకు పుట్టుకతో దే శ పౌరసత్వం ఇస్తామని తేల్చి చెప్పారు. అయితే అమెరికా మాత్రమే ఇలాంటి పౌరసత్వం ఇస్తున్నట్లు ట్రంప్ చెప్పిన దాంట్లో నిజం లేదు. ప్రపంచవ్యాప్తంగా 30కి పైగా దేశాలు ఇలా పౌరసత్వాన్ని ఇస్తున్నాయి. అమెరికాలో అంతర్యుద్ధం ముగిసిన మూడేళ్ల తర్వాత 1868లో ఆమోదించిన 14వ రాజ్యాంగ సవరణతో ఈ హక్కు లభించిందశరణార్థులుగా వచ్చిన నల్లజాతివారిని బానిసలుగా చూసే దుష్ట సంప్రదాయానికి ముగింపు పలకడానికి ఇది వీలు కల్పించింది. ఇప్పుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో ఇది రద్దు కానుంది. ఈ ఉత్తర్వు 30 రోజుల తర్వాతినుంచి అమలులోకి రానుంది.

అయితే చట్టబద్ధంగా ఇది అమలు కావడం అసాధ్యమని నిపుణులు అంటున్నారు. ట్రంప్ ఉత్తర్వులను న్యాయస్థానాలు రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించే అవకాశం ఉందిఅమెరికా సుప్రీంకోర్టు సైతం జన్మతః పౌరసత్వాన్ని సమర్థించింది. ఆ అవకాశాలు లేకపోలేదని ట్రంప్ కూడా చెప్పడం గమనార్హం. అంతేకాదు ఉత్తర్వు అమలుకు రాజ్యాంగ సవరణ అవసరం. అమెరికా పార్లమెంటులోని ఉభయ సభలు మూడింట రెండు వంతుల మెజారిటీతో సవరణను ఆమోదించాలి. ఇది సుదీర్ఘ ప్రక్రియ. మరోవైపు ట్రంప్ నిర్ణయాన్ని న్యాయస్థానాల్లో సవాలు చేసేందుకు హక్కుల సంఘాలు సిద్ధమవుతున్నాయి.ఇదంతా అటుంచితే దీని ప్రభావం భారతీయులపై తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. 2024 నాటికి అమెరికాలో దాదాపు 54లక్షల మంది భారతీయులు ఉన్నారు. దేశ జనాభాలో 1.47 శాతానికి ఇది సమానం. వీరిలో 34 శాతం మంది అమెరికాలో పుట్టిన వారు కాగా, మిగతా వా రంతా వలస వచ్చిన వారే. అందులో ఎక్కువమంది హెచ్1బీ వీసా కింద వచ్చిన వారే.వాస్తవానికి అమెరికా వెళ్లిన భారతీయుల్లో చాలామంది తమ పిల్లలకు అమెరికా పౌరసత్వం పొందేందుకు 'బర్త్ టూరిజం'ను అంటే పిల్లలకు జన్మనివ్వడం కోసమే అమెరికాకు వెళ్లడాన్ని ఒక మార్గంగా ఎంచుకొంటున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. మెక్సికో, చైనాలాంటి దేశాల వారూ ఇదే పద్ధతి అనుసరిస్తున్నారు. అందులో కొంత వాస్తవం లేకపోలేదు. ఎందుకంటే గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా అది దక్కా లంటే ఏళ్ల తరబడి వేచిచూడాలి.అందుకే తమ పిల్లలకు, తద్వారా తమ కూ అమెరికా పౌరసత్వం దక్కేందుకు ఈ మార్గాన్ని ఎంచుకొంటున్నారు. ఇప్పటికే ఇలా అమెరికాలో పుట్టిన పిల్లలు వేల సంఖ్యలో ఉ న్నారు. వీరు కూడా అమెరికాలోనే ఉండాలంటే చదువుతో పాటుగా అన్ని విషయాల్లో ను ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది.అలాగని కుటుంబాలు వేరుపడడం కూడా సాధ్యం కాదు. స్వదేశానికి తిరిగి వెళ్లడం ఒక్కటే మార్గం. ట్రంప్ కోరుకొంటున్నది కూడా అదే. అయితే దేశంలోని అన్ని వ్యవస్థలపైనా దీని ప్రభావం పడుతుందనేది నిపుణులు హెచ్చరిస్తున్నారు.అక్రమ వలసలను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో ఎమర్జెన్సీ విధించి.. మరిన్ని బలగాలను మోహరిస్తామని ట్రంప్ ప్రకటించారు. చట్టవిరుద్ధంగా నివసిస్తున్న విదేశీ పౌరులను అందర్నీ గుర్తించి.. వారిని తిరిగి వారి వారి దేశాలకు పంపించేందుకు ట్రంప్ యంత్రాంగం చర్యలు మొదలుపెట్టింది. ఈ విషయంలో భారత ప్రభుత్వం కూడా ట్రంప్ సర్కారుతో కలిసి పనిచేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ట్రంప్ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని మోదీ ప్రభుత్వం భావిస్తోందని.. ట్రంప్ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని మోదీ ప్రభుత్వం భావిస్తోందని.. తత్ఫలితంగా వాణిజ్య యుద్ధాన్ని నివారించేందుకు, ట్రంప్‌నకు సహకరించేందుకు ఇది ముందస్తు ఆలోచన అని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# మారనున్న పంచాయితీల రూపు రేఖలు

విజయవాడ, జనవరి 22, ఏపీ ప్రభుత్వం(మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేసింది. ముఖ్యంగా పంచాయితీ వ్యవస్థలో సమూల ప్రక్షాళన తీసుకురావాలని భావిస్తోంది. చాలా పంచాయితీల్లో సిబ్బంది లేక ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. మరోవైపు ఆదాయం కూడా అంతంతమాత్రంగానే ఉంది. ఈ తరుణంలో సిబ్బంది కొరత అధిగమించడంతో పాటు సమన్వయానికి క్లస్టర్ విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు అమలవుతున్న విధానంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్న దృష్ట్యా.. కొత్త క్లస్టర్ విధానాన్ని అమల్లోకి తేవాలని అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించి కార్యాచరణలో పడ్డారు పంచాయతీరాజ్ అధికారులు. ఈరోజు ఉన్నత స్థాయి సమీక్ష పవన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.పవన్ పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు తీసుకున్నాక చాలా రకాల మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా 4,500 కోట్ల రూపాయలకు సంబంధించి ఉపాధి హామీ నిధులను గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలని పవన్ డిసైడ్ అయ్యారు. గతంలో ఈ నిధులు పక్కదారి పట్టేవి. ఇతర సంక్షేమ పథకాలకు సర్దుబాటు చేసేవారు. కానీ ఈసారి మాత్రం అటువంటి పరిస్థితి లేకుండా చూడాలని పవన్ భావించారు. అందుకే రహదారులతో పాటు కాలువల నిర్మాణానికి ఆ నిధులు కేటాయించారు. పల్లె పండుగ పేరిట పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు.స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయడానికి పవన్ ఎంతగానో పరితపిస్తున్నారు. అందులో భాగంగానే గతంలో నిలిచిపోయిన ఆర్థిక సంఘం నిధులను.. నేరుగా పంచాయితీ ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీల ఖాతాల్లో జమ అయ్యాయి. వాటితో ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు పంచాయితీల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. ఇందుకుగాను ప్రత్యేక నిధులు కూడా కేటాయించారు. ఇలా పంచాయితీల విషయంలో సానుకూల నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నారు పవన్ కళ్యాణ్.సచివాలయ వ్యవస్థవచ్చిన తర్వాత పంచాయతీలు నిర్వీర్యం అయ్యాయి. నామమాత్రంగా మారాయి. ఈ తరుణంలోనే పూర్వవైభవం దిశగా అడుగులు వేయాలని పవన్ భావించారు. అందుకే పంచాయితీల ఆదాయ మార్గాలు పెంచడంతోపాటు సేవలను మరింత విస్తృతం చేయాలని భావించారు. ముఖ్యంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు.. క్లస్టర్ విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని భావిస్తున్నారు. పారిశుధ్య సిబ్బందితో పాటు తాగునీటి నిర్వహణ, వీధి దీపాల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని గట్టిగా నిర్ణయించారు. అందుకే వీలైనంత త్వరగా పంచాయితీల విషయంలో పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదికలు ఇవ్వాలని.. తద్వారా చేర్పులు, మార్పులు చేయాలని నిర్ణయించారు. మొత్తానికి అయితే పవన్ పుణ్యమా అని పంచాయతీ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుండడం గమనించదగ్గ విషయం.చాలా పంచాయితీలకు ఆదాయం తక్కువగా ఉంటుంది. కానీ జనాభా ఎక్కువగా ఉంటారు. జనాభా ప్రాతిపదికగా తీసుకుంటే అటువంటి పంచాయితీల మనుగడ కష్టం. ఇంకోవైపు చాలా పంచాయితీలకు ఆదాయం సమకూరుతుంది. కానీ అక్కడ జనాభా తక్కువగా ఉంటారు. మౌలిక వసతుల కల్పనకు ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే ఆదాయం, జనాభాను పరిగణలోకి తీసుకొని.. క్లస్టర్లుగా విభజిస్తారు. గ్రేడింగ్ చేస్తారు. అందుకు అనుగుణంగా నిధుల విడుదల, సిబ్బంది నియామకాలు చేస్తారు.

# అంబానీని మించి ఆదానీ

ముంబై, జనవరి 22, దేశంలోనే అతిపెద్ద పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వివాహం గతేడాది ఎంత చర్చనీయాంశంగా మారిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. చాలా రోజుల పాటు జరిగిన అనంత్ వివాహానికి ముందు కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా చాలా మంది ప్రముఖులు హాజరయ్యారు. ఇప్పుడు గౌతమ్ అదానీ కుమారుడు జీత్ అదానీ వివాహం గురించి చర్చలు ప్రారంభమయ్యాయి. వారి వివాహానికి ముందు వేడుక ఉదయపూర్‌లో జరిగింది. కానీ వివాహం ఇంకా జరగలేదు. నివేదిక ప్రకారం, జీత్ అదానీ వివాహానికి చాలా మంది ప్రముఖులు కూడా హాజరవుతారు.గౌతమ్ అదానీ కొడుకు వివాహానికి 50 కి పైగా దేశాల నుండి చెఫ్‌లు, 1,000 కి పైగా లగ్జరీ కార్లను ఏర్పాటు చేయనున్నారు. బాలీవుడ్ నుండి హాలీవుడ్ వరకు అనేక మంది ప్రముఖులు హాజరు కానున్నారు. అదానీ కుమారుడు జీత్ అదానీ గుజరాత్ వజ్రాల వ్యాపారి జైమిన్ షా కుమార్తె దివా జైమిన్ షాను వివాహం చేసుకున్నాడు. వారిద్దరూ మార్చి 12, 2023న నిశ్చితార్థం చేసుకున్నారు. వారి సంబంధాన్ని గోప్యంగా ఉంచారు. కానీ వారి వివాహానికి ముందు వేడుక తర్వాత, వారి వివాహం గురించి చర్చలు అనంత్ అంబానీ లాగానే ప్రారంభమయ్యాయి. ఇప్పుడు జీత్ అదానీ వివాహంలో ప్రముఖ హాలీవుడ్ గాయని టేలర్ స్విఫ్ట్ ప్రదర్శన ఇస్తారని నివేదికలు వస్తున్నాయి.జీత్, దివా షా వివాహ వేడుక అనంత్ అంబానీ వివాహం కంటే మరింత గ్రాండ్‌గా ఉండవచ్చని నివేదికలు ఉన్నాయి. భారతదేశం, విదేశాల నుండి చాలా మంది ప్రముఖ ప్రముఖులు వారి వివాహానికి హాజరు కావచ్చు. నివేదిక ప్రకారం, సంగీత దిగ్గజాలు ట్రావిస్ స్కాట్, హనీ సింగ్ ప్రదర్శన ఇస్తారని, ప్రపంచ దిగ్గజాలు కైలీ జెన్నర్, కెండల్ జెన్నర్, సెలీనా గోమెజ్, సిడ్నీ స్వీనీ కూడా ఈ కార్యక్రమానికి హాజరు కావచ్చు. అదే సమయంలో, టేలర్ స్విఫ్ట్ రాక గురించి కూడా వార్తలు వస్తున్నాయి. అయితే, ఆమె రాకకు సంబంధించి ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి. జీత్ , దివా వివాహ వేడుకకు ఆమె హాజరవుతుందని అనుకుంటున్నారు. ప్రస్తుతానికి, దీనిపై వారి నుండి ఎటువంటి అధికారిక ప్రకటన రాలేదు.గౌతమ్ అదానీ దేశంలోని అతిపెద్ద పారిశ్రామికవేత్తలలో ఒకరు. ఆయన కొడుకు పెళ్లి చేసుకుంటున్నాడు. కాబట్టి దేశంలోని ప్రఖ్యాత వ్యక్తులు ఖచ్చితంగా దీనికి హాజరవుతారు. ఇది కాకుండా, విదేశాల నుండి కూడా అతిథులు వస్తారు. 1000 కి పైగా లగ్జరీ, ఖరీదైన కార్లలో ప్రజలు వస్తారని.. వారి సేవ, ఆహార సౌకర్యాల కోసం, 58 దేశాల నుండి ప్రసిద్ధ, ఉత్తమ చెఫ్‌లను పిలుస్తారని చెబుతున్నారు.

# నీటి కష్టాలకు చెక్..

**హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 22, ఎండాకాలం వచ్చిందంటే చాలు.. హైదరాబాద్ నగరంలో నీటి కష్టాలు మె?దలవుతాయి. హైటెక్ సిటీ నుంచి బస్తీల వరకు ఎక్కడ చూసినా వాటల్ ప్రాబ్లమే. స్లమ్ ఏరియాల్లో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. అక్కడ వారం, పది రోజులకు ఒకసారి కూడా నీళ్లు రావు. గ్రౌండ్ వాటర్ అడుగంటిపోవటంతో ప్రతిసారీ ఇదే పరిస్థితి ఎదురవుతుంది. మరో రెండు నెలల్లో సమ్మర్ మె?దలు కానుంది. దీంతో ఈసారి ఎటువంటి నీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని నగరవాసులు ఇప్పట్నుంచే టెన్షన్ పడుతున్నారు. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. ఈసారి నీటి కష్టాలకు చెక్ పెట్టేందుకు కీలక నిర్ణయం తీసుకుంది.హైదరాబాద్ మహానగరం దాహార్తిని తీర్చేందుకు గోదావలి జలాలను వాడుకోవాలని డిసైడ్ అయింది. 20 టీఎంసీల గోదావరి జలాలను నగరానికి తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. గోదావరి రెండో దశ ప్రాజెక్టుకు వారంలో టెండర్లు పిలిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.7,360 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టనుండగా.. రానున్న 24 నెలల్లో పూర్తిచేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు మరో రెండ్రోజులు వెల్లడికానున్నాయి. గోదావరి నుంచి రెండో దశలో 15 టీఎంసీలు, మూడో దశలో 5 టీఎంసీలు నీటికి తీసుకురావాలని గతంలోనే నిర్ణయించారు. అయితే నగర తాగునీటి అవసరాలు భారీగా పెరిగిన నేపథ్యంలో రెండో దశలోనే 20 టీఎంసీలు తీసుకురావాలని తాజాగా డిసైడ్ అయ్యారు.హైదరాబాద్ నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చటంతో పాటుగా రేవంత్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టులో భాగంగా జంటజలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు గోదావరి జలాలు తీసుకురానున్నారు. మె?త్తం నగర ప్రజల తాగునీటి అవసరాలకు 30 టీఎంసీలు కేటాయించగా.. ప్రస్తుతం 10 టీఎంసీలు వినియోగించుకుంటున్నారు. మరో 20 టీఎంసీల నీటి తరలింపునకు తాజాగా ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుతం రోజుకు 550 ఎంజీడీల నీటిని నగరానికి సరఫరా చేస్తున్నారు. నగర ప్రజల అవసరాలకు ఇవి ఏమాత్రం సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రతిపాదించిన గోదావరి జలాలు తరలిస్తే.. నగరంలో తాగునీటి సమస్య పరిష్కారం

# మూకమ్మడి సెలవులు పెడతాం

## ఒత్తిళ్లు భరించలేమంటున్న గ్రామ కార్యదర్శులు

**వరంగల్‌ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 22 తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం 4 కీలక పథకాలకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందుకు సంబంధించి గ్రామ సభలు నిర్వహిస్తోంది. అర్హులను గుర్తించే పనిలో పడింది. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం లబ్ధిదారుల ఎంపిక జరుగుతోంది. లబ్ధిదారుల జాబితాను గ్రామ సభల్లో అధికారులు ప్రకటిస్తున్నారు.అయితే.. ఈ కీలక ప్రక్రియలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర ముఖ్యం. కానీ వారు ప్రస్తుతం గ్రామాలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ప్రజలు దాడులు చేస్తారని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పని ఒత్తిడి పెరుగుతోందని వాపోతున్నారు. ప్రస్తుతం ప్రతీ మండలంలో ఖాళీలు ఉన్నాయి. ఖాళీగా ఉన్న గ్రామ పంచాయతీలకు ఇన్‌ఛార్జిలను నియమించి పనులు చేస్తున్నారు. దీంతో ఒత్తిడి పెరుగుతోందని అంటున్నారు. నగరాలు పట్టణాలతో పోలిస్తే.. గ్రామాల్లో పరిస్థితి వేరేలా ఉంటుంది. ప్రభుత్వం ప్రకటించిన పథకాలు వారికి రాకపోతే ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటు అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు ఉన్నతాధికారుల దగ్గరకు వెళ్లలేక.. గ్రామాలకు వచ్చే పంచాయతీ కార్యదర్శులను నిలదిస్తున్నారు. ప్రస్తుతం ఉన్నవారిలో చాలామంది కొత్తవారు కావడంతో.. పరిస్థితులను ఎదుర్కోలేక భయపడుతున్నారు.

రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి తెలంగాణ వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. అయితే జాబితాల్లో తమ పేర్లు లేకపోవడంతో గ్రామస్థులు అధికారులను నిలదీస్తున్నారు. దీంతో పలుచోట్ల గ్రామసభలు రసాభాసగా మారాయి. అధికారులు, పోలీసులు కల్పించుకుని గ్రామస్థులకు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. పలుచోట్ల గ్రామసభలను గ్రామస్థులు బహిష్కరిస్తున్నారు. జాబితాల్లో పేర్లు ఉన్న వారు ఆనందం వ్యక్తం చేస్తుంటే...పేర్లు రాని వాళ్లు అధికారులపై ఫైర్ అవుతున్నారు. అర్హులను పక్కన పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. అర్హులందరికీ పథకాలు వస్తాయని, పేర్లు రానివాళ్లు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారుగ్రామసభల్లో ఉద్రిక్తతలపై బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఎక్స్ వేదికగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఇది ప్రజాపాలన కాదు, ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన అంటూ విమర్శించారు. సోకాల్డ్ ప్రజాపాలన పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థమైందా? అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆడంబరంగా నిర్వహిస్తున్న గ్రామ సభల సాక్షిగా ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తేటతెల్లమైందన్నారు. ఊరూరా తిరగబడుతున్న జనం, ఎక్కడిక్కడ నిలదీస్తున్న ప్రజానీకాన్ని చూస్తే కాంగ్రెస్ ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతుందన్నారు."ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశాల్లో, మంత్రులందరూ పక్క రాష్ట్రాల్లో బిజీగా ఉంటే ప్రజలను ఎవరు పట్టించుకోవాలె. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామ సభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణం. పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒకవైపు గ్రామ సభలు నిర్వహిస్తుంటే, మరోవైపు కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పడం సిగ్గుచేటు. అలాంటపుడు గ్రామ సభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నట్లేనా.? అర్హులైన వారికి పథకాలు ఎగ్గొడుతున్నట్లేనా? ఎన్నికల ముందు హామీలిస్తం, అధికారంలోకి వచ్చాక ఎగ్గొడతాం అన్నట్లుగా వ్యవహరిస్తే, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు. రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు.. అర్హులైన అందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు భారీ కోతలు విధిస్తే ప్రజలు తిరగబడకుండా ఏం చేస్తారు. కాంగ్రెస్ నాయకుల పాపం, అధికారులకు శాపంగా మారింది. సమాధానం చెప్పలేని పరిస్థితి" – మాజీ మంత్రి హరీశ్ రావు"మీరు నిర్వహిస్తున్న గ్రామ సభలు దగా.. ఏడాది కాలంలో మీరు చేసిన దగాను ప్రజలు అర్థం చేసుకున్నారు. మీరు చేసిన మోసాన్ని, నయవంచనను తెలుసుకున్నారు. ప్రశ్నించే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తారు. అరెస్టులు చేసి నోళ్లు మూయిస్తారు. నేడు యావత్ తెలంగాణ ఏకమై మీ పాలనను నిలదీస్తుంది. మరి ఇప్పుడు వారిపై ఎన్ని కేసులు పెడతారు. ఎంత మందిని అరెస్టులు చేస్తారు.మీ పాలనలో విసిగి, వేసారి పోయిన తెలంగాణ ప్రజలు ఉప్పెనగా ఉద్యమించక ముందే కళ్లు తెరవండి. ప్రతిపక్షాల మీద బురదజల్లడం మాని పరిపాలన మీద దృష్టి సారించండి. ఎన్నికల హామీలో చెప్పినట్లుగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం"–మాజీ మంత్రి హరీశ్ రావు

మరోవైపు పథకాలు అందని వారినుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇన్ని సమస్యల మధ్య ఉద్యోగం చేయడం కంటే.. మానేయడం ఉత్తమం అనే అభిప్రాయాలను పంచాయతీ కార్యదర్శులు వ్యక్తం చేస్తున్నారు.గ్రామసభల నేపథ్యంలో 'గ్రామ, వార్డు సభలు ప్రారంభం కాగానే గొడవలు స్టార్ట్ అయ్యాయి. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పరస్పరం తిట్టుకున్నారు. పలుచోట్ల ఘర్షణలు జరిగాయి. మరికొన్నిచోట్ల అధికారులను ప్రజలు నిలదీశారు. తమపేర్లు జాబితాలో ఎందుకు లేవని గట్టిగా ప్రశ్నించారు. దీంతో గ్రామసభలకు వచ్చిన అధికారులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. 'మేం చేసే పని చేస్తున్నాం. అందరి పేర్లు ఎందుకు రాలేదంటే మాకెలా తెలుస్తుంది. గ్రామాల్లో ప్రజల మెప్పుకోసం రాజకీయ పార్టీల నాయకులు మమ్మల్ని తిడుతున్నారు.

మరికొందరు తమపై దాడిచేయాలని ప్రజలను రెచ్చగొడుతున్నారు. మా గ్రామం కాకుండా ఇంకో గ్రామం బాధ్యతలు నాకే అప్పగించారు. పని ఒత్తిడి తీవ్రంగా ఉంది. పైగా బెదిరింపులు వస్తున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో పనిచేయడం కంటే ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉంటడం మేలు అనిపిస్తుంది' అని మహిళా పంచాయతీ కార్యదర్శి వాపోయారు.

# మళ్లీ పెరుగుతున్న గన్ కల్చర్

**నల్గొండప్రజాబలం ప్రతినిధి:** జనవరి 22, తెలంగాణలో గన్ కల్చర్ పెరుగుతోంది. ఇందుకు కారణాలు ఏమైనా.. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. దీంతో క్షేత్రస్థాయిలో పనిచేసే పోలీసులకు మళ్లీ ఆయుధాలు ఇవ్వాలనే అంశంపై ఉన్నతాధికారులు ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నారని పోలీస్ శాఖలో చర్చలు జరుగుతున్నాయి.దాదాపు పదేళ్ల కిందట సూర్యాపేట బస్టాండులో సిమీ ఉగ్రవాదులు ఇద్దరు పోలీసులను కాల్చి చంపేశారు. అప్పుడే పోలీసులకు ఆయుధాలు ఇవ్వాలని భావించారు. కానీ అమలు కాలేదు. ఇటీవల హైదరాబాద్ నగరం అఫ్జల్‌గంజ్ ఘటనతో మళ్లీ అంశం తెరపైకి వచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదం బలంగా ఉన్న సమయంలో.. ప్రభావిత ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు ఉండేవి. ఒకవేళ మావోయిస్టులు దాడి చేసినా.. సిబ్బంది ఆయుధాలతో ఎదుర్కొనేలా చర్యలు తీసుకున్నారు.గతంలో ఎస్సై, ఆపై స్థాయి అధికారుల వద్ద ఆయుధాలు ఉండేవి. స్టేషన్లలోనూ ఆయుధాలను అందుబాటులో ఉంచేవారు. అయితే.. వామపక్ష తీవ్రవాదం కాస్త తగ్గిన తర్వాత ఈ విధానానికి తెరదించారు. కేవలం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే స్టేషన్ హౌస్ ఆఫీసర్, ఆ పైస్థాయి అధికారులకు మాత్రమే పిస్తోలు వంటి ఆయుధాలను ఇచ్చారు. సాయుధ సెంట్రీ పోస్టులను కూడా తీసేశారు. కేవలం వాచ్ పేరుతో.. ఆయుధాలు లేని కానిస్టేబుళ్లే కాపలా విధులు నిర్వర్తిస్తున్నారు.తెలంగాణలో మావోయిస్టుల పెద్దగా లేని ప్రాంతాలు, పట్టణాలు, నగరాల్లోని పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది అందరికీ ఆయుధాలు తొలగించారు. దీంతో ఎన్నో ఘటనలు జరిగాయి. కొందరు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. 2009, 2010 సంవత్సరాల్లో ఉగ్రవాది వికారుద్దీన్ జరిపిన కాల్పుల్లో.. ఆయుధాలు లేని కారణంగా ఇద్దరు పోలీసులు చనిపోయారు. మరో ఐదుగురు గాయపడ్డారు.2014లో మరో ఘటన జరిగింది. నకిలీ నోట్ల కేసులో తనను పట్టుకోవడానికి వచ్చిన పోలీసులపై రౌడీషీటర్ ఎల్లం గౌడ్ కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఈశ్వరయ్య అనే కానిస్టేబుల్ చనిపోయారు. 2015 ఏప్రిల్ 2న సూర్యాపేట బస్టాండ్‌లో అస్లాం, ఎజాజుద్దీన్ అనే ఇద్దరు సిమీ ఉగ్రవాదులు.. కానిస్టేబుల్ మెట్టు లింగయ్య, హోంగార్డు కుమ్మరి మహేష్‌లను కాల్చి చంపారు. వారిని వెతుక్కుంటూ వెళ్లిన ఎస్సై సిద్దయ్య, కానిస్టేబుల్ నాగరాజులపై కాల్పులు జరిపి చంపేశారు.తాజాగా కర్ణాటకలోని బీదర్‌లో దోపిడీకి పాల్పడ్డ ఇద్దరు నిందితులు.. డబ్బు సంచులతో హైదరాబాద్ వచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్ వెళ్లేందుకు బస్సు ఎక్కడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో మరోసారి కాల్పులు జరిపారు. ఇటీవల నార్త్ ఇండియా నుంచి తెలంగాణలోకి విచ్చలవిడిగా గన్‌లు రవాణా అవుతున్నాయనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదం పొంచి ఉందనే హెచ్చరికలు ఉన్నాయి. ఈ పరిణామాలతో క్షేత్రస్థాయిలో పోలీసులకు కూడా ఆయుధాలు ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఈ అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని పోలీస్ శాఖ చర్చ జరుగుతోంది.

# హైదరాబాద్ పాడ్ ట్యాక్సీ?

**హైదరాబాద్,ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 22, హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. కొన్నిసార్లు ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద గంటల తరబడి వెయిట్ చేయాల్సిన పరిస్థితి. కి.మీ మేర వాహనాలు బారలు తీరుతాయి. అలా ట్రాఫిక్‌లో చిక్కుకుపోవటం నరకంలా అనిపిస్తుంటుంది. దీంతో చాలా మంది మెట్రోలను ఆశ్రయిస్తున్నారు. మెట్రో ట్రైన్లలో నగరం ఓ మూల నుంచి మరో మూలకు వెళ్లేవారు ఈజీగా ప్రయాణాలు సాగిస్తున్నారు. త్వరలో మరింత ఈజీగా ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జర్నీ చేయవచ్చు. నగర ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెడుతూ.. పాడ్ ట్యాక్సీలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. ప్రభుత్వం–మెట్రోరైల్ లిమిటెడ్(హెచ్ఎంఆర్ఎల్) భాగస్వామ్యంతో వీటిని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారుపాడ్ ట్యాక్సీలను పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్‌గా వ్యవహరిస్తుంటారు. ఇవి బ్యాటరీ లేదంటే కరెంట్‌తో పని చేస్తాయి. పర్యావరణహితంగా ఉండే కారు లాంటి క్యాబిన్‌లో 6–8 మంది ప్రయాణించొచ్చు. వీటిలో డ్రైవర్లు ఉండరు. ప్రయాణికులు ఇందులో కూర్చున్న తర్వాత.. తాము వెళ్లాలనుకునే గమ్యాన్ని ఎంచుకోవటానికి టచ్ ప్యాడ్లు ఉంటాయి. అక్కడ క్లిక్ చేస్తే చేరాల్సిన గమ్యాలకు తీసుకెళ్తాయి. బస్టాండ్లు, మెట్రో స్టేషన్ల నుంచి నేరుగా ఆఫీసులకు వెళ్లేలా వీటిని రూపొందిస్తారు. భారీ టవర్లు ఉండే భవనాలు, కార్యాలయాలకు కూడా వెళ్లేలా డిజైన్ చేస్తారు. అందుకోసం ప్రత్యేకంగా మార్గాలను ఏర్పాటు చేస్తారు.రానున్న మూడేళ్లలో ఈ పాడ్ ట్యాక్సీలను హైదరాబాద్ నగరంలో పట్టాలెక్కించాలని యోచిస్తున్నారు. ముందుగా నగరంలో అత్యంత రద్దీగా ఉండే రెండు మార్గాల్లో తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నారట. రాయదుర్గం – కొండాపూర్, రాయదుర్గం – నాలెడ్జ్ సిటీ మార్గం మధ్య ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ రెండింటి మధ్య దూరం 14.8 కి.మీ. కాగా.. మొత్తం 55 స్టాప్‌లు ఏర్పాటు చేయనున్నారు. వీటి గరిష్ఠ వేగం గంటకు 40 కి.మీ.హెచ్ఎంఆర్ఎల్ డీపీఆర్ ప్రకారం.. ట్రాఫిక్ రద్దీ వేళల్లో ఈ పాడ్‌కార్ల ద్వారా గంటకు 10 వేల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాన్ని చేరుకుంటారని అంచనా. రోజుకు లక్ష మందిని ఈజీగా గమ్యస్థానాలకు చేర్చవచ్చు. ఈ రకమైన వ్యవస్థతో హైదరాబాద్‌లో పట్టణ రవాణా మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ముంబైలోని బాంద్రా–కుర్ల కాంప్లెక్స్ మధ్య పాడ్ ట్యాక్సీ కారిడార్ వ్యవస్థ నిర్మితమవుతోంది. గ్రేటర్ నోయిడా నుంచి నోయిడా ఎయిర్‌పోర్ట్ వరకు మరో లైన్ నిర్మించేందుకు డీపీఆర్ సిద్ధమైంది. హైదరాబాద్ విషయానికొస్తే.. మెట్రోరైల్ లిమిటెడ్(హెచ్ఎంఆర్ఎల్) రూ.1,480 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్ సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ నెలాఖరులోగా లేదా ఫిబ్రవరి మొదటి వారంలో డీపీఆర్‌ను ప్రభుత్వానికి సమర్పించి ఆ తర్వాత అనుమతులు, నిధులు కోరనున్నట్లు తెలిసింది.

# రైతు బంధులో రాబందులు

**ఖమ్మంప్రజాబలం ప్రతినిధి:** జనవరి 22,రియల్ ఎస్టేట్ వెంచర్లు, కోళ్ల ఫారాలు, ఇటుక బట్టీలు, రాళ్ల గుట్టలు, మట్టిదిబ్బలు, మట్టి క్వారీలు, వడ్ల మిల్లులు, కోల్డ్ స్టోరేజీలు, బీడు భూములు.. కావేవి రైతుబంధుకు అనర్హం అని కొందరు ఘనాపాటీలు నిరూపించారు. చక్కగా ఏళ్లకు ఏళ్లు ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం పొందారు. 'రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేసి, వాటిని తీర్చలేక ఆగం కావొద్దు.. సాఫీగా సాగు చేసుకోవాలి..' అన్న సంకల్పంతో గత ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసిం ది.తద్వారా రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేసింది. కానీ.. రాజకీయ నేతల 'అండ దండలు', అధికారుల 'సహాయ సహకారాల'తో కొందరు సాగులో లేని భూములకు పట్టాలు చేయించుకున్నారు. వారి ఖాతాల్లో సుమారు రూ.10 కోట్లకు పైగా జమ అయింది. 'రైతుభరో సా' అమలు కోసం ఖమ్మం జిల్లాలో ప్రభుత్వం చేపడుతున్న సర్వేలో వెలుగులోకి వస్తున్న ఇలాంటి వాస్తవాలు ఎన్నో.. రాష్ట్రప్రభు త్వం ఈనెల 26 నుంచి 'రైతుభరోసా' అమలు చేయనున్న నేపథ్యంలో వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికా రులు ఈ నెల16 నుంచి ఖమ్మం జిల్లావ్యాప్తంగా యోగ్యత ఉన్న భూముల గుర్తింపునకు సర్వే చేపడుతున్నారు. ఈ సర్వేలో రైతుబంధు అక్రమాలు కుప్ప లు తెప్పలుగా బయటపడుతున్నాయిఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా సాగుకు పనికి రాని సుమారు 15 వేల ఎకరాలకు పైగానే రైతుబంధు పథకం వర్తించినట్లు సర్వేలో తేలింది. జిల్లాకేంద్రం సమీపంలోని రఘునాథపాలెం, బల్లేపల్లి, వి.వెంకటాయపాలెం, ధంసలాపు రం, అల్లీపురం, కొదుమూరు, ప్రకాశ్‌నగర్, ఇల్లెందు రోడ్, శ్రీనివాసనగర్, ఖమ్మం రూరల్ ప్రాంతాల్లోనే సాగులో లేని 500 ఎకరాలకు పైగా ఈ పథకం వర్తించినట్లు సర్వేలో వెల్లడైంది.ఖమ్మం నగరానికి కూతవేటు దూరంలోని ధంసలాపురం ప్రాంతంలో సాగులో లేని సుమారు 250 ఎకరాలకు పథకం వర్తించినట్లు అధికా రులు సర్వేలో గుర్తించారు. ఖమ్మం నగరం రోజురోజకూ తన పరిధులను విస్తరించుకుంటున్న క్రమంలో శివా రు గ్రామాల్లోని భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో కొందరు వ్యవసాయ యోగ్యమైన వేలాది ఎకరాల భూములను కొందరు రియల్టర్లకు విక్రయించారు. ఈ క్రమంలో ఆ భూములన్నీ సాగుకు పనికి రాని కన్వెర్టెడ్ భూములుగా మారాయి. ఆ వెంచర్లకు కూడా రైతుబంధు పథకం వర్తించడాన్ని తాజాగా అధికారులు గుర్తించారు. ఖమ్మం రెవెన్యూ డివిజన్‌లోనే ఎక్కువగా రైతుబంధు పథకం దుర్వినియోగం అయిందని అధికారులు సర్వేలు గుర్తించారు. ఖమ్మం నగర శివారులోని 20 ఎకరాల వెంచర్, ఇటుక బట్టీలు, మట్టిదిబ్బలు, క్వారీలకు పథకం వర్తించింది. ఈ లిస్ట్‌లో కల్యాణ మండపాలు, కోల్డ్ స్టోరేజీలు, వడ్ల మిల్లులు కూడా ఉండడంతో సర్వే అధికారులు ముక్కున వేలేసుకుంటున్నారు.ఇలా ఖమ్మం చుట్టుప క్కల ప్రాంతాల్లోనే సాగులో లేని సుమారు 500 ఎకరాల భూములకు పథకం వర్తించిందంటే.. ఇక జిల్లావ్యాప్తంగా ఎంత ప్రజాధనం అనర్హుల ఖాతాల్లో జమ అయిందో ఇట్టే అంచ నా వేయొచ్చు. ఈ నేపథ్యంలో ప్రభు త్వం పక్కాగా సర్వే చేపట్టి, సాగులో ఉన్న భూమలకే రైతుభరోసా వర్తింపజేయాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతున్నది


## సినీ నిర్మాతలపై రెండవ రోజు కొనసాగుతున్న ఐటీ సోదాలు

హైదరాబాద్ మంగళవారం ప్రారంభమయిన సినీ నిర్మాతల నివాసాల్లో ఐటి సోదాలు బుధవారం కుడా కొనసాగాయి. నిర్మాతలకు ఫైనాన్స్ చేసిన ఫైనాన్సర్లను సైతం ఐటీ అధికారులు విచారించాయి. భారీ బడ్జెట్ సినిమాలు రూపొందించిన నిర్మాతల ఇళ్ళు కార్యాలయాలలో సోదాలు కొనసాగాయి. 55 బృందాలుగా ఎనిమిది చోట్ల సోదాలు చేస్తున్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, కొండాపూర్ లో కొనసాగుతున్నాయి. దిల్ రాజు కు చెందిన ఎస్వీసీ బ్యానర్ తో పాటు తో పాటు ,మైత్రి మూవీ మేకర్స్, మ్యాంగో సంస్థల్లో సోదాలు కొనసాగుతున్నాయి. దిల్ రాజు నివాసం, కూతురు, సం, సోదరుడు శిరీష్ నివాసాల్లో సోదాలు జరిగాయి. మైత్రి మూవీ మేకర్స్ కార్యాలయం .. నవీన్ ఎర్నెని, రవి శంకర్ నివాసాలు.. మ్యాంగో సంస్థల యజమాని యరపతినేని రామ్ ఇళు ళ్ళ,కార్యాలయాల్లో కుడా సోదాలు జరిగాయి. సంక్రాంతి నేపథ్యంలో వచ్చిన భారీ సినిమాల పెట్టు బడులు, ఆదాయం పైన అధికారులు ఆరాతీస్తున్నారు

## జనవరి 23 నుండి తిరుపతిలో ఏరోజుకారోజు ఎస్ ఎస్ డి టోకెన్లు

తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు టీటీడీ గతంలో మాదిరిగానే జనవరి 23వ తారీకు నుండి ఏ రోజు కా రోజు ఎస్ ఎస్ డి టోకెన్లను అందించనుంది.ఈ టోకెన్లను భక్తులు అలిపిరి దగ్గర ఉన్న భూదేవి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ వద్దనున్న విష్ణు నివాసం, బస్టాండ్ వద్దనున్న శ్రీనివాసం కౌంటర్లలో గతంలో మాదిరిగానే ఎస్ ఎస్ డి టోకెన్లను పొందవచ్చని టీటీడీ తెలిపింది.

## ఆదిలాబాద్ జిల్లాలో పెద్దపులి సంచారం



అదిలాబాద్‌ప్రజాబలం ప్రతినిధి: జనవరి 22 కొన్ని రోజులుగా ప్రశాంతంగా ఉన్న ఆదిలాబాద్ జిల్లాలో పెద్దపులి సంచారం మరోసారి కలకలం రేపుతోంది. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని తాంసి, గొల్లఘాట్ శివారులో పులి సంచరిస్తోంది. పెన్ గంగానది ఒడ్డున ఉన్న మహారాష్ట్ర లోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చిన పెద్దపులి గొల్లఘాట్, తాంసి (కె), ప్రాంతాల్లో తిరుగుతోంది. తాంసి (కె) గ్రామ సమీపంలోనీ పిప్పల్ కోటి రిజర్వాయర్ పని ప్రదేశంలో సోమవారం రాత్రి సమయంలో లారీ డ్రైవర్లకు పెద్దపులి కనిపపించింది. దీంతో గమనించిన డ్రైవర్లు పెద్దపులి వీడియోను రికార్డ్ చేశారు. ఆపై వారి నుండి ఆ విడియో వైరల్ అవుతూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పులి సంచారం గురించి సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు తాంసి, ఆర్లి (టీ) సెక్షన్ అధికారి మోపత్ రావ్, బీట్ ఆఫీసర్లు సాయి, శ్రీనివాస్, రామేశ్వర్, అనిమల్ ట్రాకర్ లు సోనేరావు, కృష్ణలు మంగళవారం నాడు పులి సంచరించిన ప్రాంతంలో పులి పాద ముద్రలను గాలించగా.. ఎలాంటి పాదముద్రలు తమకు లభ్యం కాలేదని తెలిపారు. ఇద్దర్ సెక్షన్ల అధికారులు, రెండు టీంలు గా బేస్ క్యాంపు ఏర్పాటు చేసి పులి జాడ కోసం తిరుగుతున్నారు. పులి సంచరించే ప్రాంతాల్లో 8 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పులి సంచారం నేపథ్యంలో ఆ ప్రాంత వాసులు జగ్రత్తగా ఉండాలని స్థానికును అప్రమత్తం చేశారు. ఎవరికైనా పులి కనిపించినా, పులి గురించి ఏమైనా సమాచారం తెలిపిన అటవీ శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

# మళ్లీ పెరుగుతన్న చలి...

**హైదరాబాద్,ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 22 తెలంగాణలో చలిపులి పంజా విసురుతోంది. గత వారం క్రితం వరకు సాధారణంగానే ఉన్న ఉష్ణోగ్రతలు ఉన్నట్లుండి తగ్గిపోయాయి. రెండ్రోజులుగా చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. చాలా ప్రాంతాల్లో సింగిల్ డిజిట్‌కే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 దాటినా చలి తీవ్రత తగ్గటం లేదు. దానికి తోడు పొగమంచు కూడా ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో స్వెట్టర్లు, మఫ్లర్లు లేకుండా కాలు బయటపెట్టం లేదు.కాగా, నేడు, రేపు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో చల్లటి ఈదురుగాలులు వీస్తాయన్నారు. 10 డిగ్రీలలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఛాన్స్ ఉందన్నారు. ఈ మేరకు ఈ నాలుగు జిల్లాలకు అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసారు. ఇక హనుమకొండ, హైదరాబాద్, జగిత్యాల, కరీంనగర్, మెదక్, మేడ్చల్, ములుగు, నిజామాబాద్, జనగామ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో 15 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెప్పారు. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.ఇక రాత్రి తెలంగాణలోనే అతి తక్కువగా కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం గిన్నెధరిలో 6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైందనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. సిర్పూర్‌లో 6.3 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7 , రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 7.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు చెప్పారు. మరో ఏడు జిల్లాల్లోని చాలా మండలాల్లో 10 డిగ్రీలలోపే ఉష్ణోగ్రతలు నమోదనట్లు తెలిపారు.తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణీలు, చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలంటున్నారు. శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని.. చలి ఎక్కువగా సమయంలో ఇళ్లకే పరిమితం కావాలని, వెచ్చని దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు. ఇక పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు కూడా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

# జీవన్ రెడ్డి స్థానంలో...నరేందర్ రెడ్డి

**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 22, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ఖరారు అయినట్లేనా? గాంధీభవన్ పెద్దలు ఆ ఆశావహుడికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసారా? ఇంతకాలం ప్రచారానికే పరిమితం అయిన ఆ క్యాండెట్ నాలుగు జిల్లాల కాంగ్రెస్ ఎమ్మెల్యేలని కలుస్తూ.. మద్దతు కోరుతుండటంతో ఆయనకి లైన్ క్లియర్ అయినట్లే అంటున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికను ప్రెస్టేజియస్‌గా తీసుకున్న కాంగ్రెస్ ఈ సారి సిట్టింగ్ ఎమ్మెల్సీని కాదని.. ఎన్నో వడపోతల తర్వాత ఆయనని ఓకే చేసిందంట. ఇంతకీ కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేయబోయే అభ్యర్థి ఎవరు?కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి పదవీ కాలం మార్చితో ముగియ నుంది. దాంతో ఆ స్థానానికి ఎన్నికల కమిషన్ త్వరలో షెడ్యూల్ విడుదల చేయనుంది. ఆ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఇప్పటికే బీజేపీ తమ అభ్యర్థిని ప్రకటించింది. బీఆర్ఎస్ అసలు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తుందా? లేదా? అన్నది క్లారిటీ లేదు. దానికి సంబంధించి కారు పార్టీలో ఆశావహులు కూడా కనిపించడం లేదు. పార్టీ ముఖ్య నేతలు కూడా దానిపై సడీ సప్పుడూ చేయడం లేదు.ఈ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం పరిధిలోని నాలుగు పార్లమెంట్ సెగ్మెంట్లలో బీజేపీ ఎంపిలే ఉన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారు . అటు బీజేపీ ఎంపీలు, ఇటు కేంద్ర మంత్రికి ఈ ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారింది.. ఆ క్రమంలో అసలు పోటీ బీజేపీతోనే అని భావిస్తున్న కాంగ్రెస్ బలమైన సామాజిక వర్గం, అన్ని విధాలా బలమైన అభ్యర్థి కోసం పెద్ద కసరత్తే చేస్తుంది. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న జీవన్‌రెడ్డి బీజేపీని ఎదుర్కోవడానికి సరిపోరని భావిస్తున్న కాంగ్రెస్ పెద్దలు కొత్త అభ్యర్థి కోసం అన్వేషించి ఫైనల్ చేసినట్లు తెలిసింది.జీవన్ రెడ్డి సామాజిక వర్గానికే చెందిన నరేందర్ రెడ్డి పేరు కూడా పరిశీలించిన కాంగ్రెస్ ఆయన వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అర్థికంగా అండదండలు అభ్యర్థి కావాలి కాబట్టి జీవన్ రెడ్డి కాకుండా నరేందర్ రెడ్డినే బరిలోకి దింపాలని భావిస్తున్నారంట. మొదటినుండి కుడా నరేందర్‌రెడ్డికి కాంగ్రెస్‌తో సత్సంబంధాలు ఉన్నయి. గత పదిహేను సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కి సపోర్ట్ చేస్తూ వస్తున్నారు. గత ఎమ్మెల్యే , ఎంపి ఎన్నికలలో కూడా టికెట్ ఆశించారు. కాని సామజిక సమీకరణాలు అనుకూలించక పోవడంతో అవకాశం దక్కలేదు.నరేందర్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికలలో ఖచ్చితంగా పోటీ చేయాలన్న ఉద్దేశంతో ఆరునెలల ముందు నుంచే అస్త్రాలని సిద్ధం చేసుకుని ప్రచారంలో దూసుకుపోతున్నాడు. గత ముప్పై ఏళ్లకి పైగా విద్యారంగంలో ఉండడం ఆయనకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కలిసివచ్చే అంశంగా మారింది. ఇప్పటికే తన పూర్వ విద్యార్థులు, తన స్టాఫ్‌తో దాదాపుగా అరునెలలుగా గ్రాడ్యుయేట్ ఓటర్లలో ప్రచారం కొనసాగిస్తున్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేతగా వూట్కూరి నరేందర్ రెడ్డి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అందరికీ సుపరిచితులే.కరీంనగర్ లో అల్ఫోర్స్ కళాశాల ప్రారంభించిన నరేందర్‌రెడ్డి ఇప్పుడు ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి అదిలాబాద్, ఉమ్మడి నిజామాబాదు జిల్లాల వ్యాప్తంగా అల్ఫోర్స్ శాఖలు నిర్వహిస్తున్నారు. నాలుగు జిల్లాలలో పరిచయం అక్కరలేని పేరు నరేందర్ రెడ్డిది. అరునెలల నుండి నాలుగు జిల్లాల పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ పట్టభద్రుల ఓటర్లు నమోదు చేపించడంలో సక్సెస్ అయ్యారు. ఇప్పటికే పీసీసీ పెద్దలు, ఢిల్లీ కాంగ్రెస్ పెద్దల ఆశీర్వాదాలు తీసుకున్నారంట. ఇటీవల ముఖ్యమంత్రి వేములవాడ పర్యటనకి వచ్చిన సందర్భంగా పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతూ హోర్డింగ్‌లు, స్వాగత తోరణాలు ఏర్పాటు చేసి అందరి దృష్టిలో పడ్డారు పట్టభద్రుల ఓటర్లని కలుస్తూ మద్దతూ కోరిన అయన ఇప్పుడు ట్రెండ్ మార్చి నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే లని కలుస్తూ మద్దతు కూడ గట్టుకునే పనిలో పడ్డారు. ఇప్పుడు అదే నరేందర్ రెడ్డి అభ్యర్థిత్వం ఖరారు అయిందన్న ప్రచారానికి బలం చేకూరుస్తుంది. అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడం వల్లే ఆయన వరుసగా ప్రజాప్రతినిధులను కలుసున్నారన్న ప్రచారం జరుగుతుంది. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కూడా నాలుగు జిల్లాల నేతల అభిప్రాయ సేకరణ చేపట్టారంట. దాంతో చాలా మంది కాంగ్రెస్ సీనియర్లు, ఎమ్మెల్యే లు నరేందర్ రెడ్డి పేరు ప్రతిపాదించారంట.మొదటి నుంచి సీనియార్టీ దృష్ట్యా ఎమ్మెల్సీ టికెట్ తిరిగి జీవన్ రెడ్డికే ఇస్తారని ప్రచారం జరిగింది. టీ పీసీసీ నాయకత్వం కూడా జీవన్ రెడ్డి పేరొక్కటే ఢిల్లీ అధిష్టానానికి పంపిందంట. అయితే నెలరోజుల వ్యవధిలో సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఎమ్మెల్సీ సీటును ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలని కాంగ్రెస్ భావిస్తుంది. సామజికంగా, అర్థికంగా బలం గా ఉన్న వారు అయితే ఎమ్మెల్సీ ఎన్నికలలో విజయం సాధిస్తామని, ఎట్టి పరిస్థితిల్లో పట్టు సడల కూడదన్న పట్టుదలతో నరేందర్ రెడ్డి పేరుని ఒకే చేసినట్లు ప్రచారం జరుగుతుంది.కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకి కూడా నరేందర్ రెడ్డి పేరుని కన్‌ఫర్మ్ చేస్తూ ఆయనకు సహకరించాలని ఆదేశాలు వెళ్లాయంట. అందుకే ఎమ్మెల్యేలు కూడా నరేందర్ రెడ్డి కే కన్ఫర్మేషన్ అవుతుందని క్యాడర్‌కి చెప్తున్నారంట. మరి అఫిషియల్ ప్రకటన ఎప్పుడుంటుందో చూడాలి.

## దాడులు చేస్తే సహించం

## మూసిని ఏటీఎం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

**యాదాద్రి భువనగిరి ,ప్రజాబలం ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడారు. మా పార్టీ కార్యాలయాలపైకి, ఇళ్లపైకి వస్తామంటే భయపడే ప్రసక్తే లేదు. 60 లక్షల మంది సైనికులు ఉన్న కుటుంబం బిఆర్ఎస్ పార్టీ. 60 లక్షల మంది బిఆర్ఎస్ కార్యకర్తలు తలుచుకుంటే తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు తిరిగే పరిస్థితి ఉండదు. ఖబర్దార్ కాంగ్రెస్ నాయకులు... జాగ్రత్తగా ఉండండని హెచ్చరించారు. ఇంకోసారి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూసినా పార్టీ కార్యకర్తలు ఊరుకోరు. రౌడీ మూకలను వేసుకొని పార్టీ కార్యాలయాలపై దాడి చేసే దరిద్రపు సంస్కృతి కాదు మాది. మాటలతో, విజ్ఞతతో, నిబద్ధతతో ప్రజల కోసం పోరాటం చేసే సంస్కృతి మాది. మూసి మురికిమయం కావడానికి కారకులు ఎవరో ప్రజలు గుర్తించాలి. పారిశ్రామిక వ్యర్థాలు మూసిలో కలుస్తుంటే 60 ఏళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన కాంగ్రెస్ ఏం చేసింది ? మూసి నదిని ప్రక్షాళించడానికి కేసీఆర్ సంకల్పించారు. అందులో భాగంగానే ఎస్టీపీలను ఏర్పాటు చేయడమే కాకుండా గోదావరి నదితో అనుసంధానం చేయాలనుకున్నారు. మూసిలో మురుగునీటి శుద్ధి కోసం 31 ఎస్టీపీలను కెసిఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది . మూసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా కేసీఆర్ ప్రణాళికలు రూపొందించారు. మూసిని కాంగ్రెస్ నాయకులు ఏటీఎం గా తయారు చేసుకోవాలని చూస్తున్నారు. హైదరాబాదుకు దగ్గరలో ఉన్న కొండపోచమ్మ సాగర్ ను వదిలేసి దూరంగా ఉన్న మల్లన్న సాగర్ నుంచి మూసి – గోదావరి అనుసంధానం చేస్తామని ప్రభుత్వం అనడం సరికాదని అన్నారు.

కేవలం కాంట్రాక్టర్ల కోసమే ఈ ప్రాజెక్టు చేపడుతున్నారు. అందుకే అనుసంధాన ప్రాజెక్టు వేయండి రూ 7500 కోట్లకు పెంచారు. రూ. 7500 కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోంది . కొండపోచమ్మ నుంచి మూసి అన్నసంధానం చేసే ఆస్కారం ఉన్నప్పుడు ఈ కొత్త ప్రాజెక్టు ఎందుకు? నల్లగొండ జిల్లాకు చెందిన ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలి. మూసి ప్రక్షాళన పేరిట పేద ప్రజల ఇళ్లను కూల్చివేత కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుంది. పేద ప్రజల ఇళ్లపైకి బుల్డోజర్లను పంపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం. మూసి ప్రక్షాళనకు అయ్యే వ్యయం 50 వేల కోట్లు అని ఒకసారి, లక్ష కోట్లు అని మరొకసారి, లక్షన్నర కోట్లు అని ఇంకోసారి సీఎం చెబుతున్నారు. మూసిని ఏటీఎంగా మార్చుకొని... వచ్చే డబ్బును ఢిల్లీకి పంపించే ప్రణాళిక వేసుకున్న సీఎం రేవంత్ అని అన్నారు.యాదాద్రిలో కేసీఆర్ మొదలుపెట్టిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలి. యాదాద్రి వైభవాన్ని ప్రభుత్వం కాపాడాలి. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి కేసీఆర్ ఎంతగానో కృషి చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ భూతాన్ని పారద్రోల్లడానికి కేసీఆర్ సంకల్పించారు. అందులో భాగంగానే మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి తాగునీరు సరఫరా చేశారు. ఫ్లోరైడ్ ని నిర్మూలించిన ఘనత కేసీఆర్

### తులం బంగారం ఎప్పుడు ఇస్తారు... మాజీమంత్రి తలసాని

**హైదరాబాద్ ,ప్రజాబలం ప్రతినిధి:**సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో 108 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం పంపిణీ చేసారు. తలసాని మాట్లాడుతూ తులం బంగారం కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ముందు తులం బంగారం ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిప్రకటించారు. ఏడాది దాటినా తులం బంగారం ఇవ్వని ప్రభుత్వం ఇదని అన్నారు. ఎప్పుడు ఇస్తారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. లబ్ధిదారుల తరపున ప్రభుత్వానికి నివేదిక పంపాలని అధికారులను తలసాని ఆదేశించారు.

# హిందూ టైగర్, శివసేన పార్టీ వ్యవస్థాపకుడు, మరాఠీల ఆరాధ్యదైవం బాల్ థాకరే -నేడు ఆయన జయంతి



బాల్ థాకరే జనవరి 23, 1926లో పూనేలో జన్మించాడు. దాదాపు ఐదు దశాబ్దాల పాటు మహారాష్ట్ర రాజకీయాలలో కాకుండా దేశ రాజకీయాలను సైతం ప్రభావితం చేసిన విలక్షణ వ్యక్తి బాల్ థాకరే. 1950లలో రాజకీయ వ్యంగచిత్రకారుడిగా (కార్టూనిస్టుగా) జీవనం ప్రారంభించిన థాకరే 1960 నాటికి సొంత రాజకీయ వారపత్రికను ప్రారంభించాడు. ముంబాయిలో మహ్రాష్ట్రేతరుల ఆధిపత్యాన్ని సహించక వారికి వ్యతిరేకంగా కార్టూన్లు వేసేవాడు. ఆ తర్వాత మరాఠా ప్రజల హక్కుల సాధనకై పోరాటం చేయడానికి 1966లో శివసేన పార్టీకి ఏర్పాటుచేశాడు. "మహారాష్ట్ర మహారాష్ట్రీయులకే' అనే ఉద్యమంలో భాగంగా ముంబాయిని వదిలిపోవాలని ప్రవాసులను హెచ్చరించాడు. హిందూత్వను, హిందూ జాతీయవాదాన్ని కూడా బలపర్చాడు. జాతీయ రాజకీయాలలో భారతీయ జనతా పార్టీతో జతకట్టి కీలక పాత్ర వహించాడు. శివసేన పార్టీ స్థాపించిననూ 1995లో మహారాష్ట్రలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చిననూ బాల్ థాకరే మాత్రం ప్రత్యక్ష రాజకీయాలలోకి రాలేదు, ఎన్నికలలో పోటీచేయలేదు. పార్టీ అధినేతగానే ఉంటూ పార్టీని నడిపించాడు. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడానికి కూడా వెనుకంజ వేయలేదు.

86 ఏళ్ళ వయస్సులో నవంబర్ 17, 2012న ముంబాయిలోని తన నివాసం మాతోశ్రీలో మరణించాడు.

థాకరే స్థాపించిన ఆంగ్ల పత్రిక సామ్నా, హిందీ పత్రిక దోపహార్ సామ్నాలు సంతాపం ప్రకటించాయి. జాకెట్ పేజీలు, కవర్ పేజీలు కూడా పూర్తి నలుపులో ప్రచురించి ఆ పత్రికలు తమ విచారాన్ని వ్యక్తం చేశాయి. రెండు కవర్ పేజీలు పూర్తి నలుపు రంగులో ప్రచురించడం పత్రిక చరిత్రలో ఇదే తొలిసారి.

శివసేన అధినేత బాల్ థాకరే మృతదేహానికి సాయంత్రం ఆరు గంటలకు (నవంబర్ 17) దహన సంస్కారాలు జరిగినవి. సందర్శన కోసం శివాజీ పార్కులో థాకరే మృతదేహాన్ని ఉంచారు. అభిమానుల తాకిడితో శివాజీ పార్కు కిక్కిరిసి పోయింది. ముంబయి రోడ్లు కూడా జనసంద్రమయ్యాయి. 1966లో శివసేన ఆవిర్భావం సందర్భంగా సరిగ్గా బాల్ ఠాక్రే ప్రసంగించిన చోటే ఆయన చితిని ఏర్పాటు చేశారు. దసరా ఉత్సవాల్లో కూడా ఠాక్రే ఇక్కడి నుంచే ప్రసంగించేవారు. ముంబై పోలీసులు 21 తుపాకులు పేల్చి గౌరవ వందనం సమర్పించారు. ఠాక్రే భౌతికకాయం వద్ద మహారాష్ట్ర గవర్నర్ కె.శంకరనారాయణన్, ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్ పుష్పగుచ్ఛాలుంచి నివాళి అర్పించారు. ఎలాంటి అధికార పదవీ చేపట్టని ఠాక్రేకు పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడం విశేషం. మహారాష్ట్ర ప్రజలను కొన్ని దశాబ్దాల పాటు ప్రభావితం చేసినందుకు గౌరవంగా ప్రభుత్వం అధికార లాంఛనాలతో ఠాక్రేకు వీడ్కోలు పలికింది. గతంలో ఎన్నడూ బహిరంగ అంత్యక్రియలు జరగని శివాజీ పార్కులో ఠాక్రే అంత్యక్రియలకు అనుమతిచ్చింది. ముంబైలో 1920లో లోకమాన్య బాలగంగాధర్ తిలక్ అంత్యక్రియల తర్వాత బహిరంగ అంత్యక్రియలు జరగడం ఇదే తొలిసారి! శివాజీ పార్కుకు భారతీయ జనతా పార్టీ జాతీయ నేతలు లాల్ కృష్ణ అద్వానీ, అధ్యక్షుడు నితిన్ గడ్కరీ, అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్, మేనకా గాంధీ తదితరులు చేరుకున్నారు. 20 లక్షల మందికి పైగా పాల్గొన్న ఠాక్రే అంతిమయాత్ర, అంత్యక్రియలు జనసంద్రాన్ని తలపించింది. గత ఐదు దశాబ్దాల కాలంలో దేశంలో ఒక నేత అంత్యక్రియల్లో ఇంతమంది పాల్గొనడం ఇదే తొలిసారి అని భావిస్తున్నారు.

# యాదాద్రిలో గిరిప్రదక్షిణ..పాల్గోన్న ఎమ్మెల్సీ కవిత





యాదాద్రి భువనగిరి యాదగిరిగుట్ట శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గారు నిర్వహించిన యాదాద్రి గిరి ప్రదక్షణ మహోత్సవంలో పాల్గొన్నారు. , సహచర మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలసి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు.

## ఎన్ కౌంటర్ లో 27 మంది మావోయిస్టులు హతం

## మృతుల్లో అలిపిరి దాడి సూత్రధారి



బీజాపూర్‌ఛత్తీస్గఢ్ ఒడిశా సరిహద్దులో జరిగిన ఎన్కౌంటర్లో మృతుల సంఖ్య 27కు చేరింది. ఈ ఎన్కౌంటర్ లో ఒడిశా రాష్ట్ర కమిటీ చీఫ్ చలపతి(60) కూడా మరణించారు. ఆయన తలపై రూ.కోటి రివార్డు ఉంది. చలపతి ఏపీ సీఎం చంద్రబాబుపై జరిగిన అలిపిరి దాడిలో కీలక సూత్రధారి. ఈయనది చిత్తూరు జిల్లా తవణంపల్లె (ఓ) మత్యంపైపల్లె. ఈ ఎదురుకాల్పుల్లో ఒక కోబ్రా జవాన్ గాయపడ్డారు. చికిత్స నిమిత్తం హెలికాప్టర్లో ఆయనను రాయ్పుర్కు తరలించారు.

## స్వచ్ఛ గుడివాడ రూపకల్పనలో ప్రజలు పాల్గోనాలి

## గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము




గుడివాడ స్వచ్ఛ గుడివాడ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం నాడు అయన గుడివాడలో ఇంటింటి చెత్త సేకరణకు .రూ.24 లక్షలతో ఏర్పాటుచేసిన మున్సిపల్ పుష్ కార్ట్స్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎంత కృషిచేసినా, ప్రజల సహకారం లేనిదే ఫలితాలు రావు. మైక్రో ప్లాన్ సిస్టం ద్వారా....ప్రతిరోజు 100% ఇంటింటి చెత్త సేకరణ జరుగుతుంది. . కొత్త గుడివాడ రూపకల్పనకు రానున్న రోజుల్లో అనేక వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన తెలియచేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ ప్రతి పుష్ కార్ట్ లో 6వందల లీటర్ల సామర్థ్యం గల నాలుగు డస్ట్ బిన్లు ఏర్పాటు చేశామని.... నూతన పుష్ కార్ట్స్ ద్వారా నేటి నుంచి 36 వార్డుల పరిధిలో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తామని తెలియచేశారు. ప్రతి 350 ఇళ్లకు మైక్రో ప్యాకెట్ రూట్ మ్యాప్ సిస్టం ఏర్పాటు చేశామని.... ఈ ప్రక్రియ ద్వారా ప్రతిరోజు ఇంటింటికి చెత్త సేకరణ 100% జరుగుతుందన్నారు.

# సినిమా





## సైఫ్ అలీఖాన్‌కు మరో షాక్..



ఇటీవలే దుండగుడి దాడిలో ప్రముఖ నటుడు సైఫ్ అలీఖాన్ తీవ్ర గాయాలపాలయ్యారు. వాటి నుంచి పూర్తిగా కోలుకోక ముందే, ఆయనకు మరో షాక్ తగలబోతోంది. సైఫ్ అలీఖాన్‌కు చెందిన పటౌడీ కుటుంబానికి రూ.15వేల కోట్లు విలువైన ఆస్తుల వ్యవహారంలో చుక్కెదురయ్యే అవకాశం ఉంది. సైఫ్ అలీఖాన్.. నటుడు మాత్రమే కాదు. ఆయన పటౌడీ రాజ కుటుంబ వారసుడు కూడా. సైఫ్ తండ్రి పేరు మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ. మన్సూర్ అలీ 2011లో చనిపోయారు. దీంతో మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నవాబుగా సైఫ్‌ను ప్రకటించారు. అందుకే ప్రస్తుతం పటౌడీ కుటుంబానికి సైఫ్ వారసుడిగా వ్యవహరిస్తున్నారు. అయితే భోపాల్‌లోని సైఫ్ కుటుంబానికి చెందిన ఆస్తుల వ్యవహారంలో ఎప్పటి నుంచో న్యాయ వివాదాలు నడుస్తున్నాయి. సైఫ్ అలీ ఖాన్ కుటుంబానికి చెందిన దాదాపు 100 ఎకరాల భూమిలో దాదాపు లక్షన్నర మంది స్థానికులు ప్రస్తుతం నివసిస్తున్నారు. ఈ భూమిపై గత పదేళ్లుగా 'ఎనిమీ ప్రాపర్టీ కేసు' నడిచింది. ఎనిమీ ప్రాపర్టీ యాక్ట్-1968 ప్రకారం.. భారతదేశ విభజన తర్వాత పాకిస్తాన్‌కు వెళ్లిపోయిన వారు భారత్‌లో వదిలిపెట్టిన ఆస్తులపై భారత ప్రభుత్వానికే హక్కు ఉంటుంది. ఈ చట్టం ప్రకారం భోపాల్ చివరి నవాబు ఆస్తులను భారత ప్రభుత్వమే నియంత్రించాలి. పటౌడీ చివరి నవాబు పెద్ద కుమార్తె యువరాణి ఆబిదా సుల్తానా పాకిస్తాన్‌కు వెళ్లిపోయారు. అందువల్ల నవాబు ఆస్తిని శత్రువు ఆస్తిగా(ఎనిమీ ప్రాపర్టీ) ప్రకటించారు. అయితే నవాబ్ మరణం తరువాత, అతని రెండో కుమార్తె మెహర్ తాజ్ సాజిదా సుల్తానా బేగంను భోపాల్ వారసత్వ చట్టం 1947 ప్రకారం ఎస్టేట్‌కు వారసురాలిగా ప్రకటించారు. సైఫ్ అలీ ఖాన్, షర్మిలా ఠాకూర్ వంటివారు సాజిదా సుల్తానా బేగం వారసులు. అందుకే ఆ 100 ఎకరాల ఆస్తిపై తమకూ హక్కు ఉందంటూ 2015లో వారు మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ వేశారు.

## సంయుక్త అదిరిపోయే లైనప్..!


మలయాళ భామ సంయుక్త మీనన్ సౌత్ లో తన మార్క్ చూపిస్తుంది. మొన్నటిదాకా మలయాళంలోనే ఉన్న అమ్మడు భీమ్లా నాయక్ తో తెలుగు ఎంట్రీ ఇవ్వగా ఆ తర్వాత ఇక్కడ సోలో హీరోయిన్ గా కూడా ఛాన్స్ అందుకుంది. అంతేకాదు విరూపాక్షతో తనలో డిఫరెంట్ యాంగిల్ కూడా చూపించింది. ఐతే కెరీర్ మంచి ఫాం లో ఉన్నప్పుడే వరుస సినిమాలు చేయాలన్న ఆలోచనతో కాకుండా సెలెక్టెడ్ సినిమాలు చేస్తుంది అమ్మడు.ప్రస్తుతం మలయాళంలో ఒక క్రేజీ సినిమాను చేస్తున్న సంయుక్త. నిఖిల్ చేస్తున్న స్వయంభు సినిమాలో నటిస్తున్న అమ్మడు శర్వానంద్ తో నారీ నారీ నడుమ మురారి సినిమాలో కూడా నటిస్తుంది. దీనితో పాటు బెల్లంకొండ శ్రీనివాస్ సినిమాలో కూడా ఛాన్స్ అందుకుంది. బాలీవుడ్ లో మహారాగ్ని సినిమాలో కూడా నటిస్తుంది సంయుక్త. మలయాళ భామలకు సౌత్ లో మంచి డిమాండ్ ఉంటుంది. అందంతో పాటు అభినయంతో కూడా మెప్పిస్తారు అందుకే వారంటే ఆడియన్స్ లో ఒక సెపరేట్ క్రేజ్ ఏర్పడుతుంది. సంయుక్త కూడా తెలుగు ఆడియన్స్ కు దగ్గరవుతుంది. కెరీర్ పర్ఫెక్ట్ గా ప్లాన్ చేస్తే చాలు కానీ అమ్మడు టాప్ రేంజ్ కి వెళ్లే ఛాన్స్ కూడా ఉందని చెప్పొచ్చు.చేస్తున్న సినిమాలతో పాటు రకరకాల ఫోటో షూట్స్ తో కూడా సంయుక్త అదరగొడుతుంది. తప్పకుండా ఈ అమ్మడు రాబోతున్న సినిమాలతో మరింత ఊపు ఊపేసేలా ఉందని చెప్పొచ్చు.

## 26న 'మాస్ జాతర' టీజర్



రవితేజ నటిస్తున్న 75వ సినిమా 'మాస్ జాతర'. శ్రీలీల కథానాయిక. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ధమాకా' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. రవితేజ 2023లో రావణాసుర, టైగర్ నాగేశ్వరరావు, 2024లో ఈగల్, మిస్టర్ బచ్చన్ సినిమాలు వచ్చినా నిరాశపర్చాయి. ఈ ఏడాది మరో రెండు సినిమాల్లో ఆయన నటిస్తున్నారు. భాను భోగవరపు దర్శకుడిగా పరిచయం అవుతూ 'మాస్ జాతర' సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు విశేషమైన స్పందన లభించిందనీ, అభిమానుల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని భాను తెలిపారు. రవితేజ పుట్టినరోజును పురస్కరించుకుని టీజర్‌ను ఈనెల 26న విడుదల చేయబోతున్నామని సూర్యదేవర నాగవంశీ తెలిపారు. మే 9న ఈ సినిమా విడుదల కానుంది.

## విజువల్ వండర్‌గా 'అవతార్ 3'




'గత రెండు చిత్రాలతో పోలిస్తే మూడోభాగం నిడివి కూడా రెట్టింపు ఉంటుంది. ప్రేక్షకుల అంచనాలకు మించి ఈ చిత్రం ఉంటుంది. తెరపై ఈ విజువల్ వండర్‌ను చూసిన తర్వాత ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోతారు. గత రెండు చిత్రాల్లో చూపిన వాటిని ఎక్కడా పునరావృతం కాకుండా చూసుకుంటున్నాం. ధైర్యం చేసి కొన్నింటిని సృష్టించకపోతే ప్రతిఒక్కరి సమయాన్ని, డబ్బును వృథా చేసిన వాడిని అవుతాను.' అని హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ అన్నారు. ప్రపంచ చిత్ర పరిశ్రలో 'అవతార్' ఓ సంచలనాత్మక చిత్రం. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ ఈ చిత్రంలో సరికొత్తగా ఓ అద్భుత ప్రపంచాన్ని సృష్టించారు. పండోర అనే కల్పిత గ్రహాన్ని సృష్టించి అందులో ప్రకృతి అందాలను కళ్లు చెదిరే విజువల్ ఎఫెక్ట్స్ మంత్రముగ్దుల్ని చేశారు. ఆ తర్వాత 'అవతార్ : ది వే ఆఫ్ వాటర్'తో మరో ట్రీట్ ఇచ్చారు. ఆ ఫ్రాంచైజీలో రానున్న మూడో భాగాన్ని పంచభూతాల్లో ఒకటైన అగ్నికి సంబంధిన కాన్సెప్ట్‌తో రూపొందించనున్నారు. 'అవతార్-ఫైర్ అండ్ యాష్' పేరుతో రానున్న ఈ సినిమా విశేషాలను జేమ్స్ కామెరూన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. మూడో పార్టు ఈ ఏడాది డిసెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. 2029లో పార్ట్ 4, 2031 డిసెంబర్‌లో పార్ట్ 5 విడుదల కానుందని గతంలోనే చిత్ర యూనిట్ ప్రకటించింది.

## తండేల్ నుంచి 'హైలెస్సో హైలెస్సా..' వచ్చేస్తోంది



యువ సామ్రాట్ నాగ చైతన్య నటిస్తున్న లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మిస్తున్నారు. సాయి పల్లవి కథానాయికగా నటిస్తోంది. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్లు బ్లాక్ బస్టర్ నోట్‌లో ప్రారంభమయ్యాయి. ఫస్ట్ సింగిల్ 'బుజ్జి తల్లి' సెన్సేషనల్ హిట్ అయింది. ఇటీవల రిలీజైన సెకండ్ సింగిల్ 'నమో నమః శివాయ' మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. థర్డ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'తండేల్' థర్డ్ సింగిల్ బ్లాక్‌బస్టర్ లవ్ సాంగ్ హైలెస్సో హైలెస్సా ఈనెల 23న రిలీజ్ కానుంది. సముద్ర తీరంలో రగ్గడ్ లుక్‌లో లవ్లీ స్మైల్‌తో నిలుచున్న నాగచైతన్య, ఎదురుగా బ్యూటీఫుల్ గా డ్యాన్స్ చేస్తూ సాయి పల్లవి కనిపించిన సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తండేల్ సినిమా ఫిబ్రవరి 7న విడుదల కానుంది.

## మూడేళ్ళ తర్వాత హైదరాబాద్‌లో..



ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు సిధ్ శ్రీరామ్ హైదరాబాద్‌లో లైవ్ కాన్సర్ట్ నిర్వహించబోతోన్నారు. ఫిబ్రవరి 15న ఈ లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌ను మూవ్78 లైవ్ సంస్థ ప్లాన్ చేసింది.ఈ సందర్భంగా సిధ్ శ్రీరామ్ మాట్లాడుతూ, 'గత పదేళ్ళ నుంచి తెలుగు ప్రేక్షకులు ఎంతో ప్రేమను కురిపిస్తూనే ఉన్నారు. నాకు తెలుగులోనే ఎక్కువ మంది అభిమానులున్నారు. మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లో లైవ్ కాన్సర్ట్ చేశాను. మళ్లీ ఇప్పుడు చేయబోతున్నాం. ఈ కాన్సర్ట్‌లో నా పాటలతో పాటుగా 80, 90వ దశకంలో వచ్చిన మెలోడీ పాటల్ని కూడా పాడతాను. నేను ప్రస్తుతం తెలుగు నేర్చుకుంటున్నాను. నాకు ఓ ఏడాది టైం ఇవ్వండి, తెలుగులో ఫ్లూయెంట్‌గా మాట్లాడేందుకు ప్రయత్నిస్తాను' అని అన్నారు. 'సిధ్ శ్రీరామ్‌తో మూడేళ్ల తరువాత మళ్లీ హైదరాబాద్‌లో లైవ్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నాం. ఈ కాన్సర్ట్ ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియెన్స్ కోసం, యూత్ కోసం ఏర్పాటు చేస్తున్నాం.నాకు పర్సనల్‌గా నాకు, ఈ జనరేషన్‌కు సిధ్ అంటే చాలా ఇష్టం. ఈ ఈవెంట్, లైవ్ కాన్సర్ట్ అద్భుతంగా ఉండబోతోంది. గ్రూపుగా టికెట్లు బుక్ చేసుకుంటే డిస్కౌంట్ కూడా ఉంటుంది' అని నితిన్ కనకరాజ్ అన్నారు.

## థమన్‌ని మార్చేస్తున్న బాలయ్య



ఈమధ్య నందమూరి బాలకృష్ణ సినిమాలు బాక్సాఫీస్ దగ్గర మంచి ఫలితాలు రాబడుతున్నాయి. ముఖ్యంగా పండగకి బాలయ్య సినిమా వస్తుంది అంటే పక్కా హిట్ అనిపించేలా ఉంది. ఐతే బాలయ్య చేస్తున్న సినిమాలకు వరుసగా థమన్ మ్యూజిక్ అందిస్తున్నాడు. వీరి కాంబినేషన్ లో వచ్చిన సినిమాల సాంగ్స్ మాత్రమే కాదు ఆర్.ఆర్ కూడా సూపర్ క్రేజ్ తెచ్చుకుంటుంది. నందమూరి ఫ్యాన్స్ అంతా కూడా థమన్ ని తమ ఫ్యామిలీలో కలిపేసుకునేలా ఓన్ చేసుకున్నారు. బాలకృష్ణ సినిమా అంటే చాలు థమన్ పూనకాలు వచ్చిన వాడిగా మ్యూజిక్ అందిస్తున్నాడు. అందుకే ఆయన్ను ప్రతి సినిమాకు రిపీట్ చేస్తున్నారు. ప్రస్తుతం బోయపాటి శ్రీను డైరెక్షన్ లో బాలకృష్ణ చేస్తున్న అఖండ 2 కి కూడా థమన్ మ్యూజిక్ అందిస్తున్నాడు. అఖండ 2 మ్యూజిక్ విషయంలో మరోసారి స్పీకర్లు బ్లాస్ట్ అయ్యేలా చేయబోతున్నారని తెలుస్తుంది. ఐతే ఆ తర్వాత బాలకృష్ణ చేయబోతున్న సినిమాకు థమన్ బదులుగా కోలీవుడ్ సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుద్ ని దించుతున్నారని తెలుస్తుంది. తమిళ్ లో అనిరుద్ మ్యూజిక్ సంచలనాల గురించి తెలిసిందే. ముఖ్యంగా స్టార్ సినిమాలకు అనిరుద్ ఇచ్చే మ్యూజిక్ నెక్స్ట్ లెవెల్ అనిపిస్తుంది. బాలకృష్ణ అనిరుద్ కాంబో పడితే ఎలా ఉంటుందో ఫ్యాన్స్ కూడా చూడాలని అనుకుంటున్నారు. అందుకే బాలయ్య నెక్స్ట్ గోపీచంద్ మలినేనితో ఒక సినిమా ప్లానింగ్ లో ఉన్నాడు. ఆ సినిమాకు అనిరుద్ తోనే మ్యూజిక్ అందించేలా ప్లాన్ చేస్తున్నారు. మరి బాలకృష్ణ కు అనిరుద్ మ్యూజిక్ ఏ రేంజ్ లో ఉంటుంది అన్నది చూడాలి.



# క్రీడలు



## సెమీస్‌కు జ్వెరేవ్, జకోవిచ్



ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి 24గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత నొవాక్ జకోవిచ్‌తోపాటు 2వ సీడ్, జ్వెరేవ్ ప్రవేశించాడు. మంగళవారం జరిగిన తొలి క్వార్టర్‌ఫైనల్లో జ్వెరేవ్ 7-6(7-1), 7-6(7-0), 2-6, 6-1తో 12వ సీడ్, అమెరికాకు చెందిన టామీ పాల్‌ను చిత్తుచేశాడు. తొలి రెండు సెట్‌లను టైబ్రేక్‌లో చేజిక్కించుకున్న జ్వెరేవ్, మూడో సెట్‌ను కోల్పోయినా.. నాల్గో సెట్‌ను చేజిక్కించుకొని మ్యాచ్‌ను ముగించాడు. ఇక సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ ఉత్కంఠ పోరులో 3వ సీడ్, స్పెయిన్ యువ ఆటగాడు కార్లోస్ అల్కరాజ్‌ను చిత్తుచేశాడు. హెూరాహెూరీగా సాగిన ఈ గేమ్‌లో జకోవిచ్ 4-6తో తొలి సెట్‌ను కోల్పోయినా.. ఆ తర్వాత 6-4, 6-3, 6-4తో మిగిలిన మూడు సెట్లను చేజిక్కించుకొని సెమీస్‌కు చేరాడు. ఈ క్రమంలో 12వ సారి ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీస్‌కు చేరాడు. శుక్రవారం జరిగిన సెమీస్‌లో జకోవిచ్.. 2వ సీడ్ జ్వెర్వ్‌తో తలపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంక, 11వ సీడ్, స్పెయిన్‌కు చెందిన బడోసా సెమీస్‌కు చేరారు. క్వార్టర్‌ఫైనల్లో సబలెంక 6-2, 2-6, 6-3తో 27వ సీడ్, రష్యాకు చెందిన పావెంచికోవాను చిత్తుచేయగా.. బడోసా 7-5, 6-4తో 3వ సీడ్, అమెరికా యువ సంచలనం కోకా గాఫ్ జోరుకు బ్రేక్ వేసి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో భారత సంచలనం రోహన్ బొప్పన్న జోడీకి బ్రేక్ పడింది. చైనాకు చెందిన జంగ్‌తో బరిలోకి దిగిన బొప్పన్న.. క్వార్టర్స్‌లో 6-2, 4-6, 9-11తో ఆస్ట్రేలియా జోడీ పీర్స్-గడెక్కి చేతిలో పోరాడి ఓడారు

## 17 బంతుల్లోనే లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా!



19 ఏళ్ల స్పిన్ బౌలర్ వైష్ణవి శర్మ నాలుగు ఓవర్ల స్పెల్‌లో కేవలం 5 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీసి విధ్వంసం సృష్టించింది. అండర్-19 టీ-20 ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు 10 వికెట్ల తేడాతో మలేషియాపై విజయం సాధించింది. బౌలింగ్‌లో వైష్ణవి శర్మ కేవలం 5 పరుగులకే ఐదు వికెట్లు పడగొట్టి విధ్వంసం సృష్టించింది. అండర్-19 ప్రపంచకప్‌లో భారత్ తరఫున హ్యాట్రిక్ సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా వైష్ణవి రికార్డు సృష్టించింది. వైష్ణవి బౌలింగ్‌కు మలేషియా బ్యాట్స్‌మెన్ సులువుగా ఔట్ కావడంతో జట్టు మొత్తం 31 పరుగులకే కుప్పకూలింది. 32 పరుగుల లక్ష్యాన్ని కేవలం 17 బంతుల్లో వికెట్ నష్టపోకుండా టీమిండియా ఛేదించింది. వైష్ణవి శర్మ ధాటికి టీమిండియా 31 పరుగులకే మలేషియాను ఆలౌట్ చేసింది. అనంతరం 32 పరుగుల లక్ష్యాన్ని ఓపెనింగ్ జోడీ గొంగడి త్రిష, జి కమలిని 17 బంతుల్లోనే ఛేదించారు. త్రిష మరింత దూకుడును ప్రదర్శించింది. కేవలం 12 బంతుల్లో 27 పరుగులతో వేగంగా ఇన్నింగ్స్ ఆడింది. ఈ ఇన్నింగ్స్‌లో త్రిష 5 ఫోర్లు కొట్టింది. కాగా కమలిని 4 పరుగులు చేసి మరో ఎండ్‌లో నాటౌట్‌గా నిలిచి జట్టుకు విజయాన్ని అందించి వెనుదిరిగింది. టీ-20 క్రికెట్‌లో భారత జట్టు చేసిన రెండో ఫాస్టెస్ట్ ఛేజింగ్ ఇది. టీమిండియా వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయాన్ని చవిచూసింది. తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై భారత జట్టు 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 19 ఏళ్ల స్పిన్ బౌలర్ వైష్ణవి శర్మ నాలుగు ఓవర్ల స్పెల్‌లో కేవలం 5 పరుగులిచ్చి ఐదు వికెట్లు తీసి విధ్వంసం సృష్టించింది. మలేషియా బ్యాట్స్‌మెన్‌లు వైష్ణవి ముందు పూర్తిగా నిస్సహాయంగా కనిపించారు. వైష్ణవి బౌలింగ్‌లో ఒక్కొక్కరుగా పెవిలియన్‌కు చేరుకోవడం ప్రారంభించారు. వైష్ణవి తన స్పెల్ చివరి ఓవర్లో వరుసగా మూడు బంతుల్లో 3 వికెట్లు పడగొట్టి హ్యాట్రిక్ పూర్తి చేసింది. అండర్-19 ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ సాధించిన తొలి భారతీయ మహిళా క్రికెటర్‌గా వైష్ణవి రికార్డు సృష్టించింది. టోర్నీలో తొలి మ్యాచ్ ఆడుతున్న వైష్ణవి అద్భుతమైన బౌలింగ్ కారణంగా భారత జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ భారీ విజయాన్ని చవిచూసింది.

## టీమిండియాలో చోటు దక్కించుకోవడం కోసం తనకు ఇష్టమైన ఫుడ్‌ని వదిలేసిన ఫాస్ట్ బౌలర్!



ఫాస్ట్ బౌలింగ్ కోచ్ షమీ తనకు ఇష్టమైన 'బిర్యానీ'ని వదులుకున్నాడని, గత రెండు నెలలుగా తినలేదని చెప్పాడు. గాయం కారణంగా 14 నెలల పాటు మైదానానికి దూరంగా ఉన్న మహమ్మద్ షమీ ఎట్టకేలకు ఇంగ్లండ్‌తో జరిగే టీ20 సిరీస్ ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో పునరాగమనం చేయబోతున్నాడు. అనుభవజ్ఞుడైన బౌలర్ గాయాల నుండి కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. ఇందులో అతని చీలమండ, ఎడమ మోకాలికి గాయాలు ఉన్నాయి. షమీ గత ఏడాది రంజీ ట్రోఫీలో బెంగాల్‌కు ప్రాతినిధ్యం వహించడం ద్వారా పోటీ క్రికెట్‌కు తిరిగి వచ్చాడు. ఇప్పుడు బెంగాల్ క్రికెట్ జట్టు ఫాస్ట్ బౌలింగ్ కోచ్ శిబ్ శంకర్ పాల్ అతని గురించి పెద్ద వార్త రివీల్ చేశాడు. 'స్పోర్ట్స్‌బూమ్.కామ్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ఫాస్ట్ బౌలర్లు గాయం నుంచి కోలుకోవడానికి సమయం తీసుకుంటారు. అతను తిరిగి రావాలని చాలా కసితో ఉన్నాడు. అతను మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా బౌలింగ్ చేయాలనుకున్నాడు. ఇది ఒక ఆటగాడి నుండి గొప్ప అంకితభావం అని అతను చెప్పాడు. 'కొంతమంది ఆటగాళ్ళు మ్యాచ్ తర్వాత 30 నుండి 45 నిమిషాల పాటు బౌలింగ్ చేయాలనుకుంటున్నారు. దేశవాళీ టి20 మ్యాచ్‌ల సమయంలో జట్టు రాకముందే మ్యాచ్ రోజులలో ఉదయం 6 గంటలకు మైదానానికి చేరుకున్న మొదటి ఆటగాడు కూడా అతనే అని పేర్కొన్నాడు. ఫాస్ట్ బౌలింగ్ కోచ్ షమీ తనకు ఇష్టమైన 'బిర్యానీ'ని వదులుకున్నాడని, గత రెండు నెలలుగా తినలేదని చెప్పాడు. అతను రోజుకు ఒక్కసారే ఆహారం తీసుకున్నాడని, తిరిగి ఆకృతిని పొందడానికి కఠినమైన ఆహారాన్ని అనుసరించాడని తెలిపారు. ఈ సీనియర్ పేసర్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, విజయ్ హజారే ట్రోఫీలలో బెంగాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.

## రిషబ్ పంత్‌కు కీలక బాధ్యతలు అప్పగించిన లక్నో!




లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతున్నప్పుడు తన 200 శాతం సత్తా చాటేందుకు ప్రయత్నిస్తానని రిషబ్ పంత్ చెప్పాడు. ఐపీఎల్ 2025కి ముందు లక్నో సూపర్ జెయింట్స్‌కి కొత్త కెప్టెన్‌గా భారత వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్‌ఎంపికయ్యాడు. పంత్‌ను కెప్టెన్‌గా నియమిస్తున్నట్లు ఎల్‌ఎస్‌జీ యజమాని సంజీవ్ గోయెంకా సోమవారం ప్రకటించారు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు రిషబ్ పంత్‌ను రూ. 27 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. అతను ఇప్పటికే ఐపీఎల్‌లో కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన విషయం మనకు తెలిసిందే. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రిషబ్ పంత్‌ను విడుదల చేసింది. ఆ తర్వాత మెగా వేలంలో ఐపీఎల్ జట్టు పంత్‌పై విశ్వాసం వ్యక్తం చేసి 27 కోట్ల రూపాయలకు వేలంలో దక్కించుకుంది. గోయెంకా పంత్‌పై విశ్వాసం వ్యక్తం చేయడానికి కారణాన్ని కూడా చెప్పాడు. పంత్ గొప్ప నాయకుడని అన్నారు. అతను ఐపీఎల్ చరిత్రలో అత్యుత్తమ కెప్టెన్‌గా ఎదగగలడని లక్నో సూపర్ జెయింట్స్ యజమాని సంజీవ్ గోయెంకా అన్నారు. రాబోయే 10-12 సంవత్సరాలలో ధోని, రోహిత్‌ల జాబితాలో పంత్ చేరతాడు. గత సీజన్‌లో ఎల్‌ఎస్‌జీకి కేఎల్ రాహుల్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. లక్నో వేలానికి ముందు రాహుల్‌ను విడుదల చేసింది. అదే వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు అతడిని కొనుగోలు చేసింది. లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతున్నప్పుడు తన 200 శాతం సత్తా చాటేందుకు ప్రయత్నిస్తానని రిషబ్ పంత్ చెప్పాడు. ఐపీఎల్ మెగా వేలంలో అత్యంత ఖరీదైన ఆటగాడు పంత్. పంత్‌కు ఢిల్లీ క్యాపిటల్స్‌తో చాలా కాలం అనుబంధం ఉంది. అయితే ఈసారి ఢిల్లీ అతడిని రిటైన్ చేసుకోకపోవడంతో మెగా వేలంలో అతడి ఎంట్రీ జరిగింది. రిషబ్ సారథ్యంలో ఢిల్లీ గత సీజన్‌లో ప్లేఆఫ్ టిక్కెట్‌ను పొందలేకపోయింది. పంత్‌ను జట్టులోకి తీసుకోవడానికి చాలా ఫ్రాంచైజీల మధ్య హెూరాహెూరీ పోరు జరిగినా చివరికి లక్నో జట్టు విజయం సాధించింది.

## ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత ఆటగాళ్లు తప్పు చేస్తున్నారా?



ఛాంపియన్స్ ట్రోఫీ, ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆటగాళ్లకు శిక్షణా శిబిరాన్ని నిర్వహించి ఉండాల్సింది. ఫిబ్రవరి 19.. ఈ తేదీని ప్రపంచ క్రికెట్ అభిమానులందరూ గుర్తుంచుకుంటారు. ఎందుకంటే పాకిస్థాన్, దుబాయ్ వేదికగా ఛాంపియన్స్ ట్రోఫీ ఆ రోజు నుంచే ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచి ట్రోఫీని కైవసం చేసుకోవడంపై భారత జట్టు దృష్టి సారించింది. ఈ టోర్నీ చివరిసారిగా 2017లో ఇంగ్లండ్‌లో జరిగింది. ఆ తర్వాత పాకిస్థాన్‌పై భారత్ ఓటమి చవిచూడాల్సి వచ్చింది. 7 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత జట్టులోని స్టార్ ఆటగాళ్లందరూ పెద్ద తప్పు చేస్తున్నారు. బహుశా ఈ తప్పిదం వల్ల టోర్నీలో టీమ్ ఇండియా భారీగా నష్టపోయే అవకాశం ఉందని తెలుస్తోంది.నిజానికి ఈ మెగా ఈవెంట్ ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పుడు టోర్నమెంట్ ప్రారంభం కావడానికి 1 నెల కంటే తక్కువ సమయం ఉంది. బీసీసీఐ కూడా టీమిండియాను ప్రకటించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ భారీ టోర్నీలో ఎంపికైన భారత ఆటగాళ్లు తెల్ల బంతితో సాధన ప్రారంభించాలి. కానీ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, శ్రేయాస్ అయ్యర్, రవీంద్ర జడేజా వంటి భారత స్టార్ ఆటగాళ్లు రంజీ ట్రోఫీ ఆడబోతున్నారు. భారత ఆటగాళ్లు తెల్ల బంతితో కాకుండా ఎర్ర బంతితో ప్రాక్టీస్ చేస్తున్నారు. బహుశా ఈ పొరపాటు భారత ఆటగాళ్లకు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. రంజీ తొలి రౌండ్ జనవరి 23 నుంచి, రెండో రౌండ్ జనవరి 30 నుంచి జరగనుంది. కాగా ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్ ఫిబ్రవరి 6 నుంచి జరగనుంది. ఇలాంటి పరిస్థితుల్లో రంజీల్లో పాల్గొనే భారత స్టార్ ఆటగాళ్లు తెల్ల బంతితో సన్నద్ధమయ్యేందుకు చాలా తక్కువ సమయం ఉంటుంది. భారత స్టార్ ఆటగాళ్లకు తెల్ల బంతితో ప్రాక్టీస్ చేయడానికి మంచి అవకాశం లభించింది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గొప్ప పునరాగమనం చేయడం ద్వారా ఆటగాళ్లందరూ రాబోయే మెగా ఈవెంట్ కోసం తమ సన్నాహాలను బలోపేతం చేసుకోవచ్చు. ఛాంపియన్స్ ట్రోఫీ, ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆటగాళ్లకు శిక్షణా శిబిరాన్ని నిర్వహించి ఉండాల్సింది. ఇందులో తెల్ల బంతితో ప్రాక్టీస్ చేయడమే కాకుండా ఆటగాళ్లందరూ ప్రాక్టీస్ మ్యాచ్‌లు కూడా ఆడే అవకాశం ఉండేది. దీని వల్ల భారత ఆటగాళ్లు లాభపడేవారు. కానీ ఛాంపియన్స్ ట్రోఫీ హెూరిజోన్‌లో ఉన్నప్పటికీ భారత ఆటగాళ్లు రెడ్ బాల్ క్రికెట్ ఆడుతున్నారు. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీలో ఎలాంటి ప్రభావం కనిపిస్తోందో చూడాలి!

# ఆటో ప్రయాణికుల సురక్షిత,భద్రత కోసం అభయ యాప్



**రాజన్న సిరిసిల్ల జిల్లా , జనవరి -22 (ప్రజాబలం)**ఆటో ప్రయాణికుల సురక్షిత,భద్రత కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ , ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న ప్యాసింజర్ ఆటో వాహనాలకు మొదటి దశలో 4000 వాహనాలకు అనుసంధానం చేయడం జరిగిందని, రెండవ దశలో కొత్తగా 800 వాహనాలకు అభయ యాప్ %ు=% కోడ్ ని అనుసంధానం చేయడంతో పాటు అభయ యాప్ తో ఆటో డ్రైవర్లకు 50 రూపాయలతో యాక్సిడెంట్ డెత్ కు లక్ష రూపాయల ఇన్సూరెన్స్ వచ్చేలా ఒక సంస్థతో అనుసంధానం చేసి ప్రమాద భీమా పత్రాలు అందించడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..వివిధ ప్రాంతాల నుండి జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణంతో పాటు వివిధ ప్రాంతాలకు అనునిత్యం వేలాది మంది ప్రయాణికులు వస్తారని వారి రక్షణ దృష్ట్యా జిల్లాలో మొదట దశలో 4000 ప్యాసింజర్ వాహనాలకు అభయ యాప్ “%వీఎాబ్శీ అం ఖుటవ% అనే %ు=% కోడ్ అనుసంధానం చేయడంతో పాటు, ప్రమాద భీమా అందించడం జరిగిందని, రెండవ దశలో జిల్లాలో కొత్తగా 800 వాహనాలకు %ు=% కోడ్ అనుసంధానం చేయడంతో పాటుగా అభయ యాప్ తో వాహనాల డ్రైవర్లకు 50 రూపాయలతో యాక్సిడెంట్ డెత్ కు లక్ష రూపాయల ఇన్సూరెన్స్ వచ్చేలా ఒక సంస్థతో అనుసంధానం చేసి ప్రమాద భీమా పత్రాలు అందించడం జరిగిందని దీనిని ప్రతి సంవత్సరం 50 రూపాయలతో రిన్యువల్ చేసుకోవాలన్నారు.ప్రయాణికులు ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ఆసురక్షితంగా భావించే ఏదైనా పరిస్థితిని సంఘటనలను ఎదుర్కొన్నపుడు ఆటోకి ముద్రించిన “క్యూ అర్ కోడ్”ను స్కాన్ చేయాలని స్కాన్ చేయగానే వెంటనే డ్రైవర్ ఫోటో,వివరాలతో పాటుగా వాహనంకి సంబంధించిన వివరాలు వస్తాయి స్కాన్ చేసిన వ్యక్తి ఫోన్ నెంబర్ యాప్ లో ఎంట్రీ చేసి ట్రేస్ ద లొకేషన్ అని ఎంట్రీ చేయగానే వాటితో పాటుగా ఎమర్జెన్సీ కాల్, ఎమర్జెన్సీ కంప్లైంట్ ఆప్షన్స్ రావడం జరుగుతుందన్నారు.ఎమర్జెన్సీ కాల్ లేదా టెక్స్ట్ రూపంలో స్పందించినప్పుడు ప్రయాణికులు ప్రయాణిస్తున్న ప్యాసింజర్ వాహనం యొక్క లైవ్ లొకేషన్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కి వెళ్తుంది ఆటోలో ఎక్కినప్పటి నుండి దిగేంతవరకు కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా మానిటర్ చేయడం జరుగుతుంది. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా సమీపంలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకొని తగు రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుంది.ఆటోలో ఎక్కిన మహిళలు ప్యాసింజర్లు ఆటో ఎక్కే ముందు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకోవాలి ఆటో డ్రైవర్ వివరాలు నెంబర్ తో యుక్తంగా వస్తాయి ఆటోలో ఏదైనా విలువైన వస్తువులు మరిచిపోతే వెంటనే ఆటోను ట్రేస్ అవుట్ చేసి అప్పగించడానికి వీలుంటుంది.గతంలో ఆటో డ్రైవర్ ఏదైనా పోలీస్ కేసులో ఇన్వాల్వ్మెంట్ అయి ఉంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే థిస్ ఆటో నాట్ సేఫ్ అనే రెడ్ సిగ్నల్ వస్తుంది ఇది ప్రయాణికులకు సేఫ్ జర్నీ చేయడానికి చాలా ఉపయోగపడుతుంది.ఆటో డ్రైవర్లు ఏదైనా నేరాలకు పాల్పడిన చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన సిసి కెమెరాల ద్వారా కూడా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు డ్రైవర్ ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తించిన,ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్,హిట్ అండ్ రన్ చేసిన ఈ అప్ ద్వారా కంప్లైంట్ చేయవచ్చు.అదేవిదంగా ప్రయాణికులు వారు ప్రయాణిస్తున్న వాహనం కి రేటింగ్ కూడా ఇవ్వవచ్చు అన్నారు.ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం కావాలని, ఆటో లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి,సి.ఐ కృష్ణ, ట్రాఫిక్ ఎస్.ఐ లు రాజు, రమేష్, అభయ యాప్ సృష్టి కర్త అభిచరన్ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

### ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు సిబ్బందికి ప్రశంసాపత్రాల జారీకి ప్రతిపాదనలను అందించాలి

### గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం ప్రతినిధి జనవరి 22 (ప్రజాబలం) ఖమ్మంగణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు ఈ నెల 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా చేయవలసిన ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి అధికారులతో సమీక్షించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ ఫ్లాగ్ హెూస్టింగ్ చేస్తారని అన్నారు. ఉదయం 9.00 గంటలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా జరిగే జిల్లా స్థాయి వేడుకలో జాతీయ సమైక్యతను తెలియజేస్తూ 3 కల్చరల్ ప్రోగ్రాం లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారికి తెలిపారు గణతంత్ర వేడుకల డయాస్, సీటింగ్ ఏర్పాట్లు పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పకడ్బందీగా చేయాలని ఖమ్మం అర్బన్ తహసిల్దార్ కు ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, దీనిని అప్రమత్తంగా నిర్వహించాలని అన్నారు జనవరి 26 నుంచి నూతనంగా ప్రారంభమయ్యే పథకాలకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. మోడల్ ఇందిరమ్మ ఇండ్ల నమూనాను స్టాల్ లో ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, మహిళా శక్తికి సంబంధించిన స్టాల్ ను గ్రామీణ అభివృద్ధి అధికారి సిద్దం చేయాలని అన్నారు విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బంది ప్రశంసా పత్రాలు అందజేసేందుకు ప్రతిపాదనలు పంపాలని, ఈ జాబితాలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది పేర్లు కూడా పంపాలని, వరదల సమయంలో బాగా పని చేసిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందేలా చూడాలని, స్వాతంత్ర్య సమరయోధులకు వాహనాలు ఏర్పాటు చేసి వేడుకలలో పాల్గొనేలా చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు సమీక్ష లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ గణతంత్ర వేడుకలకు అవసరమైన మేర త్రాగునీటి క్యాన్లు ఆర్.డబ్ల్యూ.ఎస్. అధికారులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో ఏర్పాటు చేయాలని తెలిపారు గణతంత్ర దినోత్సవ వేడుకలలో సాంస్కృతిక కార్యక్రమాల కోసం పాఠశాల విద్యార్థులను తరలించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని వారికి అవసరమైన ఏర్పాట్లను చేయాలని అదనపు కలెక్టర్ విద్యాశాఖ అధికారికి సూచించారు ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డి.ఆర్.ఓ. రాజేశ్వరి, ఆర్డీఓ నరసింహారావు, కలెక్టరేట్ ఏ.ఓ. అరుణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

## జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్రెడ్డి



ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనవరి 22:రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందించే రైతు భరోసా, ఇందరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అయిన సంక్షేమ పథకాల అమలు ప్రక్రియలో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి మండలంలో కోల్తూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు కంగారు పడవద్దని, ఇప్పుడు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అంతే కాకుండా గ్రామ, వార్డు సభలలో నోటీసు బోర్డులలో ఉంచిన జాబితాలను ఒకసారి చూసుకొని ఏవైన అభ్యంతరాలు ఉంటే గ్రామస్తులు, గ్రామ పెద్దలు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి తహసీల్దార్ నర్సింహారెడ్డి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జిల్లాలోని పి హెచ్ సి లను తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి





**ప్రజాబలం ప్రతినిధి ఉప్పల్ నియోజకవర్గ జనవరి 22:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి. రఘునాథస్వామి పలు ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేశారు .

ఈ సందర్శనలో భాగంగా, భగత్‌సింగ్ నగర్ (చెంగిచెర్ల)లోని బస్తీ దవాఖాన, మెడిపల్లిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, మరియు నారాపల్లిలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లను పరిశీలించారు.ఈ సందర్శనలో, గర్భిణీ స్త్రీల పరీక్షలు, ప్రసవాలు, ల్యాబ్ సేవలు, రోగ నిర్ధారణ, ఫార్మసీ స్టాక్‌లు, టీకాలు మరియు మందుల నిల్వలను సమీక్షించారు. అదనంగా, ఆపరేషన్ థియేటర్లు మరియు లేబర్ రూమ్‌ల పనితనం మరియు అవసరాలను పరిశీలించారు. డాక్టర్ రఘునాథస్వామి అన్ని వైద్య అధికారులకు సమయపాలన కచ్చితంగా పాటించాల్సిందిగా ఆదేశించారు. అలాగే, మందుల నిల్వలను పర్యవేక్షించి, జిల్లా డ్రగ్స్ స్టోర్ నుండి అవసరమైన మందులను సేకరించాల్సిందిగా ఆదేశించారు. తెలంగాణ రాష్ట ప్రభుత్వ తరఫున ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా అందించే అన్ని ప్రయోజనాలు ప్రజలకు చేరేలా చూడాలని, ఏదైనా నిర్లక్ష్యం కనబడితే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# జిల్లా పోలీస్ అధికారుల సంఘం వార్షిక క్యాలెండర్

## ను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి జనవరి 22 (ప్రజాబలం)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2025 సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఈ రోజు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అధికారులు మరియు సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు.వారి సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యానారాయణ, కార్యాలయ ఏవో మంజ్య నాయక్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, హెూమ్గార్డ్స్ ఆర్ఐ నరసింహారావు,పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు ఉపధ్యాక్షుడు ఏశోబు,రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.వెంకటేశ్వర్లు, జానీమియా తదితరులు పాల్గొన్నారు.

# మహిళను అవమానించిన కేసులో నిందితునికి జైలు శిక్ష.

**కరీంనగర్ ప్రజాబలం ప్రతినిధి:** మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించి ఆమెపై దాడి చేసిన కీసర సురేష్ (27)నిందితునికి ఏడాది జైలు శిక్ష తో పాటు రూ. 2500 జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి ప్రతిమ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథను ప్రకారం తిమ్మాపూర్ మండల్ పర్లపెల్లి గ్రామానికి చెందిన కీసర సురేష్ (27) అదే గ్రామంలో ఆశ వర్కర్ గా పనిచేస్తున్న మహిళ గ్రామపంచాయతీలో పని ముగించుకుని ఆమె ఇంటి వైపు ఒంటరిగా వెళ్తుండగా దారి మధ్యలో ఉన్న పొదల్లోకి ఆమెను లాక్కెళ్ళి నోరు మూసి ఆమెను కొడుతూ ఆమెపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నం చేశాడని తెలుపుతూ బాధితురాలు 2023 జూన్ 18న తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ప్రాసిక్యూష తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలరి శ్రీరాములు సాక్షులను విచారించగా సి ఎం ఎస్ ఎస్సై తిరుపతి కోర్టులో సాక్షులను ప్రవేశ పెట్టగా, నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి ప్రతిమ నిందితునడైన కీసర సురేష్ కు ఏడాది జైలు శిక్ష తోపాటు రూపాయలు 2500. జరిమాన విధిస్తూ తీర్పు చెప్పారు.

# అర్హులైన చివరి లబ్ధిదారుడు వరకు సంక్షేమ పథకాలు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

రాష్ట్రంలోనే చివరి లబ్ధిదారుడి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడం జ ం ౕ ు గ ౕ ు త ౕ ు ం ద ౕ ని రాష్ట్రనీటిపారుదల,పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.బుధవారం రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా లతో కలిసి రుద్రంగి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ,మహిళలకు, రైతులకు,రైతు కూలీలకు,నిరుద్యోగులకు,పేదలకు ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం స్వతంత్ర భారతదేశంలో మేలు చేయలేదని అన్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి సుమారు 90 లక్షల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని,గత 10 సంవత్సరాల కాలంలోఎప్పుడు ఈ స్థాయిలో రేషన్ కార్డులు ఇవ్వలేదని,కేవలం 40 వేల కార్డులు మాత్రం అందించారని అన్నారు.జనవరి 26 నాడు ప్రారంభించి రాష్ట్రంలో అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు రేషన్ కార్డు వచ్చే వరకు ప్రక్రియ కొనసాగుతుందని,రాజకీయాలకు అతీతంగా రేషన్ కార్డులు జారీ చేస్తున్నామనిప్రజా పాలన కేంద్రాలలో దరఖాస్తు చేసిన, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసినా, గ్రామ సభలలో దరఖాస్తు ఇచ్చిన విచారించి అర్హత మేరకు కార్డులు మంజూరు చేస్తామని అన్నారు.గ్రామ సభలో ప్రకటించే ప్రాథమిక జాబితాలో పేరు లేని పక్షంలో దరఖాస్తు సమర్పిస్తే అర్హతను పరిశీలించి రేషన్ కార్డు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలు మండల కేంద్రాలు మున్సిపాలిటీలలో ఉన్న ప్రజాపాలన కేంద్రాలలో కూడా దరఖాస్తులు సమర్పించవచ్చని మంత్రి పేర్కొన్నారు.రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రస్తుతం దొడ్డు బియ్యం సరఫరా అవుతున్నాయని, వీటిని చాలా మంది తినడం లేదని, నూతన రేషన్ కార్డుల జారీ తరువాత ప్రతి ఒక్కరికి 6 కీలోల నాణ్యమైన సన్న బియ్యం రేషన్ కార్డుల ద్వారా సరఫరా చేస్తామని అన్నారు.ఉమ్మడి రాష్ట్రం ఉన్న సమయంలో సాచురేషన్ పద్దతిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మించామని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత మరోసారి ఇందిరమ్మ ఇండ్లు పథకం ప్రారంభిస్తున్నామని, స్థానిక ఎమ్మెల్యే సొంత ఊరు కాబట్టి ఇక్కడ 100 శాతం అర్హులకు మొదటి దఫా లోనే ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు.

ప్రస్తుతం సొంత జాగా ఉండి ఇండ్లు లేని వారికి 5 లక్షల రూపాయలు అందిస్తున్నామని, ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి 6 లక్షల సహాయం అందజేయ బోతున్నామని అన్నారు. రైతు భరోసా కింద రైతులకు అందే సహాయం 20 శాతం పెంచి ఎకరానికి 12 వేల రూపాయలు అందజేస్తామని, వ్యవసాయ యోగ్యమైన భూమికి



పంట వేసిన వేయకుండా రైతు భరోసా అందుతుందని అన్నారు.భూమిలేని కూలీలకు స్వతంత్ర భారతదేశంలో ఎక్కడ లేని విధంగా రైతు కూలీల కుటుంబాలకు 12 వేల రూపాయలు ఇస్తున్నామని తెలిపారు. ఈ నాలుగు పథకాలను గ్రామసభలు నిర్వహించే ప్రజల సమక్షంలోనే లబ్ధిదారులను ఎంపిక చేసి జనవరి 26 నుంచి అమలు చేస్తామని, అర్హులైన చివరి వ్యక్తి వరకు లబ్ధి జరుగుతుందని అన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ,గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందని, గ్రామ సభలలో ప్రతిపక్ష పార్టీ నాయకులు అవసరమైన సలహాలు సూచనలు అందించాలని కోరారు. జనవరి 26 నుంచి ప్రారంభించి అర్హత ప్రకారం రేషన్ కార్డులను అందరికీ జారీ చేస్తామని అన్నారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రుద్రంగి గ్రామ ప్రజలు తమ బిడ్డను ఎమ్మెల్యేగా గెలిపించాలని చేసిన కృషి ఫలితంగా తాను నేడు ఎమ్మెల్యే అయ్యానని అన్నారు. 43 వేల100 ఎకరాలకు సాగు నీరు అందించే సూరమ్మ ప్రాజెక్టును మొదటి ప్రాధాన్యత లో పెట్టామని,ఈ పనులను త్వరలో ప్రారంభం అయ్యేలా చూడాలని ఆయన మంత్రిని విజ్ఞప్తి చేశారు. రుద్రంగి మండలం మానాల లో పాత చెరువు కొత్త చెరువుకు లిఫ్ట్ అందించే త్రాగు, సాగు నీటికి ఇబ్బందులు ఉండవని , మంజూరు చేయాలని మంత్రికి వినతిపత్రం అందించారు. ప్యాకేజీ 9 లో మలక్ పేట్ రిజర్వాయర్ లో టీఎంసి నీళ్లు నింపామని, 25 కోట్లు విడుదల చేస్తే అప్పర్ మానేరు కు నీళ్లు తీసుకుని వెళ్ళవచ్చని , ఈ నిధులను ప్రాధాన్యత క్రమంలో విడుదల చేయాలని ప్రభుత్వ విప్ కోరారు. వేములవాడ, తిప్పా పూర్, కథలాపూర్ బస్టాండ్ ఆధునికరణ కు నిధులు మంజూరు చేయాలని రవాణా శాఖ మంత్రిని కోరారు.

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రుద్రంగి మండల కేంద్రంలో ప్రాథమికంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద 103 , రైతు భరోసా క్రింద 1927 , నూతన రేషన్ కార్డుల కోసం 802, ఇందిరమ్మ ఇండ్ల కోసం 1375 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. గతంలో సాంకేతిక కారణాల వల్ల వివరాలు, దరఖాస్తుల సమర్పించని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హత మేరకు పథకాలు అమలుకు చర్యలు చేపట్టామని అన్నారు.అనంతరం మంత్రులు కలికోట - సూరమ్మ ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేసి, ప్రాజెక్ట్ పరిధిలోని భూములకు సాగునీటిని ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన ఇతర పనులకు అన్ని నిధులను త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఏడీ మైన్స్ క్రాంతి కుమార్, కో ఆపరేటివ్ చైర్మన్ మోహన్ రెడ్డి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట 19వ వార్డులో విజయవంతంగా వార్డు సభ



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జనవరి 22** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 19వ వార్డులో ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి యనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డు గత ప్రభుత్వ హయాంలో ఇవ్వనటువంటి ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు, గత ప్రభుత్వ హయాంలో మీ సేవ కేంద్రాలలో పెట్టుకున్నటువంటి రేషన్ కార్డులో పేర్ల తొలగింపు, పేర్ల జమచేయుట వంటి దరఖాస్తులు స్వీకరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి యనుముల రేవంత్ రెడ్డి చేపట్టినటువంటి ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు పేర్ల మార్పు చేర్పులు ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుంది. సోషల్ మీడియాలో ప్రభుత్వం మీద బురదజల్లే విధంగా వస్తున్నటువంటి వార్తలు ఎవరు పట్టించుకోవద్దు అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు మరియు రేషన్ కార్డులు తప్పకుండా ఈ ప్రభుత్వం అందిస్తుంది అర్హులందరికీ అన్ని పథకాలు అందేలా చూస్తామని దేషిని స్వప్న కొటి తెలిపారు.కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ శేఖర్,శ్రీకాంత్ ఆర్పీ జేరిపోతుల సృజన సిబ్బంది ఉద్యోగులు కోడెం రాజు, దూడపాక స్వామి అంగన్వాడి టీచర్ స్వప్న కాంగ్రెస్ నాయకులు దేశిని శ్రీనివాస్, ఎండి సజ్జు, ఉడత వెంకటేష్, ఆడెపు దేవరాజ్, ఎండి ఖలీల్,మంద సునీల్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ లక్ష్యం

### యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి** జనవరి 22జమ్మికుంట మండల పట్టణ కేంద్రాలలో జరిగే గ్రామ సభలలో పాల్గొన్న జమ్మికుంట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్ గ్రామ సభలలో లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందని అన్నారు. రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో నిజమైన లబ్ధిదారుల ఎంపిక పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, గ్రామసభల ద్వారా లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందనీ ప్రజలకు తెలియజేశారు. బిఆర్ఎస్ పది సంవత్సరాలలో జరగని అభివృద్ధి తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇందిరమ్మ సంక్షేమ ప్రజా పాలనలో వచ్చిన సంవత్సరంలోనే అనేకమైన ప్రజారంజక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, అర్హులైన కుటుంబాలకు ప్రతి పేద ఇంటికి సంక్షేమ ఫలాలు అందే విధంగా ప్రజా ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పది సంవత్సరాల పాలనలో ఏ ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వకుండా నాటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం కాలం వెల్లదీసిందని అనేక రకాల ఇబ్బందులకు గురిచేసిందని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అందరికి రేషన్ కార్డులతో పాటు లబ్ధిదారులకు ప్రతి పథకాన్ని అందజేయడానికి, పారదర్శకంగా అమలు చేయడానికి సిద్ధంగా ఉందని తెలియజేశారు. ప్రతిపక్ష పార్టీ నాయకుల మాయ మాటలు నమ్మి అధైర్యపడవద్దని బుడిగె శ్రీకాంత్ ప్రజలకు భరోసా కల్పించారు. వారి వెంట యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బిజీగిరి శ్రీకాంత్,కార్యదర్శి అజయ్,భాను, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు అండగా సబ్బాని వెంకట్





**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజా బలం ప్రతినిధి జనవరి 22** హుజురాబాద్ మండల పరిధిలోని బోర్నపల్లి గ్రామం 14 వ వార్డుకు చెందిన సమ్మెట సాయిరాం ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని, త్వరగా గుండెకి సర్జరీ చేయాల్సిన పరిస్థితిలో ఉన్నాడని తెలిసి, చిన్నప్పుడే తండ్రిని కోల్పోయి ఆర్థిక పరిస్థితి బాగాలేదని లేదని వెంకట్ అనుచరుడు బోర్నపల్లి కి అర్జున్ మేడుదుల ద్వారా తెలిసిన వెంటనే ప్రముఖ సామాజికవేత్త సబ్బని వెంకట్ స్పందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి గంటల వ్యవధిలోనే వైద్యఖర్చుల కోసం కావాల్సిన 1,25,000/- రూపాయల ఎల్ వో సి మంజూరు చేయించారు. ఎల్ఓసి తో పాటు సర్జరీ కి కావాల్సిన రక్తం కూడా ఏర్పాటు చేసారు. ఆపదలో నేనున్నా అంటూ సబ్బని వెంకట్ స్పందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఈటెలకు కష్టాలు.. దాడిపై కేసు నమోదు



హైదరాబాద్, జనవరి 22 మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాల్టీ పరిధిలో ఏక శిలానగర్‌లో కొందరు వ్యక్తులపై దాడి చేసిన ఘటనలో ఎంపీ ఈటెల రాజేందర్ కేసు నమోదయ్యింది. డ్యూటీలో ఉండగా ఈటెలతో పాటు 30 మంది తమపై దాడి చేశారంటూ సెక్యూరిటీ గార్డు ఉపేందర్ ఫిర్యాదు చేశాడు. వివరాలు పరిశీలించిన తర్వాత ఆరు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు పోచారం పోలీసులు.భూముల వ్యవహారంపై రియాక్ట్ అయ్యారు శ్రీ హర్ష నిర్మాణ సంస్థ ఎండీ వెంకటేష్. భూముల వివరాలు తెలీకుండా ఎంపీ ఈటెల ఎలా వచ్చారు? తమపై ఎలా దాడి చేస్తారని ప్రశ్నించారు. ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. రాజకీయ పార్టీలు, నాయకులతో మాకు ఎలాంటి సంబంధం లేదని తేల్చేశారు. ఈ వ్యవహారంలో ఈటెలపై లీగల్‌గా ముందుకు వెళ్తామన్నారు.ఆయా భూములపై శ్రీ హర్ష నిర్మాణ సంస్థ ఎండీ వెంకటేష్ వెర్షన్ ఒక్కసారి విందాం. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ కొర్రెముల గ్రామ పరిధిలోని ఏక శిలానగర్‌లో 149 ఎకరాల భూమి ఉంది. సర్వే నంబర్ 739 నుండి 749 వరకున్న భూమి ఉంది. అందులో 739 నుండి 742 వరకున్న భూముల్లో 47 ఎకరాలు తాము ల్యాండ్ ఓనర్స్ వద్ద కొనుగోలు చేశామన్నారు. దీనికి సంబంధించి సేల్ డీడ్, డాక్యుమెంట్స్ ఉన్నాయన్నారు.సర్వే నంబర్ 743 నుండి 748 వరకు వెంచర్ వేసిన ముగ్గురు వ్యక్తులు (హనుమంతరావు, ప్రభాకర్‌రెడ్డి, సుందరంమూర్తి) ఇతర సర్వే నంబర్లో అక్రమంగా ప్లాట్స్ చేసి అమ్మకాలు చేశారని గుర్తు చేశారు వెంకటేష్. ఈ క్రమంలో ఈ వివాదం మొదలైందన్నారు. ఆయా భూములను కొనుగోలు చేసిన బాధితులను తాము మోసం చేయలేదని, అంతా త్రిమూర్తులు చేశారన్నారు.చివరకు తమను బ్లేమ్ చేస్తున్నారని మండిపడ్డారు వెంకటేష్. గతంలో ఈ వ్యవహారం న్యాయస్థానం వరకు వెళ్లిందన్నారు. వారి లే అవుట్లు రద్దు చేశారని, దీనికి సంబంధించి కోర్టు ఆదేశాలు తమ దగ్గరున్నాయని వెల్లడించారు.ఆయా భూములపై ఎలాంటి అవగాహన లేకుండా ఎంపీ ఈటెల రాజేందర్ మా పై అసత్య ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ఈటెలను వెంచర్ నిర్వాహకులు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈటెలపై తాము పోలీసులకు ఫిర్యాదు చేశామని, లీగల్‌గా కూడా ముందుకు వెళ్తామన్నారు శ్రీ హర్ష నిర్మాణ సంస్థ ఎండీ వెంకటేష్.

# సివిల్ సప్లై అధికారిని పుష్పలతను కలిసిన బద్దం సతీష్ గౌడ్



**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** బుధవారంనాడు సివిల్ సప్లై అధికారిని పుష్పలత కలిసి పలు సందేహాలను నివృత్తి చేసుకోవడం జరిగింది. అందులో ముఖ్యమైనవి గతంలో ఫుడ్ సెక్యూరిటీ కార్డ్ కలిగివుండి కొన్ని కారణాలవలన రద్దు ఐన వాటిని తిరిగి పునరుద్దరన జరుగుతుందా అని అడిగితే నూతన రేషన్ కార్డ్ కు అప్లై చేసుకోవాలని తెలిపినారు. నూతన రేషన్ కార్డ్ పొందాలంటే మార్గదర్శకాలను తెలియ చేయాలనీ కోరుతూ మీ సేవ మరియు ఆన్లైన్ ద్వారా ఆఫ్ లైన్ ద్వారా కూడా దరఖాస్తులను స్వీకరించాలని కోరడం జరిగినది. కొంతమంది దళారులు దరఖాస్తులను 200,100, రూపాయలకు విక్రాయించాడాన్ని అరికట్టాలనీ కోరడమైనది అని తెలిపిన బద్దం సతీష్ గౌడ్ మేఘ గ్రేటర్ హైదరాబాద్ డెవలప్మెంట్ ఫోరమ్ కన్వీనర్, నాఘభూషణ చారీ కో కన్వీనర్ తెలిపారు

# ఇసుక రీచ్ల ఏర్పాట్లుకు అనుమతుల కొరకు ప్రతిపాదనలు సిద్ధం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి 22 :** జిల్లాలో గుర్తించిన ఇసుక రీచ్లకు అదనంగా 5 రీచ్ల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల కొరకు ప్రతిపాదనలు సమర్పించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్తో కలిసి భూగర్భ గనుల శాఖ, భూగర్భ జల,పంచాయతీ, నీటిపారుదల,గ్రామీణ నీటి సరఫరా,కాలుష్య నియంత్రణ శాఖ- నిజామాబాద్ పర్యావరణ ఇంజనీరింగ్ విభాగం,టి.జి.ఎం.డి.సి., రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా 5 ఇసుక రీచ్ల ఏర్పాటుకు పర్యావరణ అనుమతుల కొరకు ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు.జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్ల,వేంపల్లి బ్లాక్-1, 2, నస్పూర్ మండలం తాళ్ళపల్లి, జైపూర్ మండలం ఇందారం ప్రాంతాలలో రీచ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని,పర్యావరణ అనుమతుల కొరకు సమర్పించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి,జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి కాదు...అభివృద్ధి చేస్తున్నాం

## బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదారి తిరుపతి

## పట్టణ అధ్యక్షుడు తుమ్మల నరేష్



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 22 :** మంచిర్యాల నంబర్ వన్గా నిలపాలన్నది మా ధ్యేయం ప్రేమ్ సాగర్ రావు ప్రజల కోసం,అభివృద్ధి కోసం తపిస్తున్నాడు,గోదావరిని బొందల గడ్డలా మార్చిన చరిత్ర దివాకర్ రావుది.ఆయన తన రెండు కండ్లు తెరుచుకుని చూడాలి,దక్షిణ భారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా మహాప్రస్థానం ప్రజలు ఛీ కొట్టినా మాజీ ఎమ్మెల్యేకు బుద్ధి రాలేదు శ్మశాన వాటిక పేరుతో ఆయన డబ్బులు వసూలు చేశారు.విలేకరుల సమావేశంలో మంచిర్యాల కాంగ్రెస్ నేతలు మంచిర్యాల ను తెలంగాణ రాష్ట్రంలోనే నంబర్ వన్గా నిలిపేందుకు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు కృషి చేస్తున్నారని దానిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు పిచ్చి పిచ్చి ఆరోపణలు చేస్తున్నాడని మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపించారు.బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి మాట్లాడుతూ...గతంలో ఎంతో మంది నాయకులు చేయలేని అభివృద్ధి పనులు ఇప్పుడు చేస్తున్నారని అన్నారు.ఇన్నేండ్లుగా మంచిర్యాలకు కనీసం శ్మశాన వాటిక లేకపోవడం సిగ్గుచేటన్నారు. దీంతో చాలా మంది ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ బాధలు అర్థం చేసుకున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు దక్షిణ భారతదేశంలోనే ఎక్కడా లేని విధంగా నాలుగు ఎకరాల్లో 11 కోట్లతో రూపాయల శ్మశాన వాటిక నిర్మిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా, పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారని అన్నారు.ఈ అభివృద్ధి చూసి ఓర్చుకోలేక ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేయడం ఏ మేరకు సమంజసమని దుయ్యబట్టారు.గోదావరిలో మట్టి దోచుకుపోతున్నారని ఆరోపణలు చేయడం విడ్డూరమన్నారు. గోదావరిలో తీసుకువచ్చిన మట్టి శ్మశాన వాటిక పనులకు ఉపయోగిస్తున్నారని తెలిపారు.ఆ మట్టికి ఎంబీ రికార్డు చేయమని ఎమ్మెల్యే చెప్పిన విషయాన్ని వారు గుర్తు చేశారు.ఎమ్మెల్యేకు పేరు వస్తుందని ఓర్చుకోలేక పోతున్నారని దుయ్యబట్టారు.ఇసుక ఎక్కడకు వెళ్తోందని ప్రశ్నిస్తున్నారని దానికి రాయల్టీ కూడా కట్టామని స్పష్టం చేశారు.ఎమ్మెల్యేకు డబ్బుల గురించి కొదవ ఏం లేదన్నారు. ఆయన వ్యాపారాల్లో కోట్లు సంపాదించుకున్నారని అన్నారు.ప్రజలు ఛీ కొట్టినా ఆయనకు బుద్ది రాలేదన్నారు. గత ఎన్నికల్లో మూడో స్థానానికి పరిమితం అయ్యారన్నారు.నువ్వు తలబద్దలు కొట్టుకున్నా ప్రజలు నీ మాట నమ్మరని దివాకర్ రావుకు స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్ మాట్లాడుతూ...ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ప్రేమ్ సాగర్ రావు అభివృద్ధి కోసం ముందుకు సాగుతున్నాడన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్నారని గుర్తు చేశారు.మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు కాళ్లలో కట్టె అడ్డం పెట్టినట్టు ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఒక్క ఆసుపత్రి కట్టించావా...? ఒక్క మంచి స్కూల్ కట్టించావా..? కనీసం మంచిర్యాల శ్మశానవాటిక కూడా కట్టించలేని దౌర్భగ్యపాలన నిదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రేంసాగర్ రావు ఇంట్లో నిత్యం భోజనాలు పెడుతున్నారని, మీరు ఆరోపించిన డబ్బులు ఆ భోజనాలకు సంబంధించి విస్తరాల విలువ కాదన్నారు. ముల్కల్లలో ఇండస్ట్రియల్ పార్క్ అవుతుంటే అక్కడ కొందరు తొత్తులను రెచ్చగొట్టి ఆపాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు.చిల్లర రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదు.అభివృద్ధి పనులకు అడ్డుపడితే ప్రజలంతా కలిసి నీ ఇంటి మీదకు దాడి చేసే రోజు వస్తుందని అన్నారు.అభివృద్ధి పనులకు సంబంధించి సూచనలు ఇస్తే స్వీకరిస్తామని అన్నారు. మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్కాల హేమలత మాట్లాడుతూ...నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా చనిపోయిన మనిషికి దహనసంస్కారాలు చేసేందుకు కూడా శ్మశాన వాటిక నిర్మించలేదని దుయ్యబట్టారు. సిగ్గుపడాల్సి పోయి ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదని దుయ్యబట్టారు.మీకు కొబ్బరికాయల దివాకర్ రావు అని పేరుందని కొబ్బరి కాయలు కొట్టడం తప్ప ఎక్కడా సరైన పనులు చేయించలేదని ఎద్దేవా చేశారు. మంచిర్యాల నంబర్ వన్గా నిలపాలని ప్రేంసాగర్ రావు తపన పడుతున్నారని గుర్తు చేశారు.నీ హయాంలోనే పూర్తిగా గోదావరి బొందల గడ్డగా మారిందని దివాకర్ రావుపై దుయ్యబట్టారు. నిమిషానికి మూడు నుంచి నాలుగు ట్రాక్టర్ల ఇసుక వెళ్లేదని జనం ఇబ్బందులు పడ్డా కనీసం పట్టించుకోలేదన్నారు. శ్మశాన వాటిక పేరుతో డబ్బులు వసూలు చేసుకుని దగ్గర పెట్టుకున్నారని ప్రేంసాగర్ రావు హెచ్చరించిన తర్వాత డబ్బులు వాపస్ ఇచ్చిన విషయం వాస్తవమా..?కాదా..? అన్నారు. నిన్ను మంచిర్యాల నుంచి వెళ్లగొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు.

# మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీమ్ లతో అప్రమత్తంగా ఉండాలి

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తతే ఆయుధం పోలీస్ కమిషనర్ ఐపిఎస్ ఐజీ ఎం.శ్రీనివాస్




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 22 :** మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీమ్ ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఐపిఎస్ ఐజీ ఎం.శ్రీనివాస్ ప్రకటనలో సూచించారు.ప్రజల సొమ్ము దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకునేందుకు కొత్త పద్ధతులను ప్రయోగిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీమ్ లతోపాటు క్రిప్టో కరెన్సీ, ఆగ్రో గార్మెంట్స్,హెర్బల్ అండ్ హెల్త్, గృహ పరికరాలు వంటి వాటిపైన పెట్టుబడులు పెట్టి అధిక మొత్తంలో లాభాలు గడించవచ్చు అని నమ్మించి ప్రజల నుంచి డబ్బులను దోచేస్తున్నారన్నారు. ఈ స్కీమ్ ల ప్రధాన లక్ష్యం విలాసవంతమైన వస్తువులు అందజేస్తామని,సొంత ఇంటి కలను నెరవేరుస్తామని,విదేశీ యాత్రలకు పంపిస్తామని మోసపూరితమైన వాగ్దానాలతో ఈ స్కీమ్లను నిర్వహిస్తున్న సైబర్ నేరగాళ్లు మొదటగా కొంత డబ్బుతో ప్రాథమిక సభ్యత్వాన్ని కల్పిస్తారన్నారు. సభ్యత్వం పొందిన వారితో మరికొంతమందిని చేర్పిస్తే పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని ప్రజలను ప్రలోభపెడుతూ కోట్లలో డబ్బులు కొల్లగొట్టడం ఈ స్కీమ్ ల ప్రధాన లక్ష్యమన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రకటనలను నమ్మి మోసపోవద్దని, ఇలాంటి స్కీమ్ ల పట్ల నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఇలాంటి వాటిని నియంత్రించాలంటే వాట్సప్ యాప్, టెలిగ్రామ్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాలో వచ్చే అనుమానిత లింకులను, %ఖజూని టఅశ్రీవం%, అప్లికేషన్స్ ను ఎవరు కూడా ఓపెన్ చేయడం కానీ, ఇన్స్టాల్ చేయడం కానీ చేయవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లుగా భావిస్తే తక్షణమే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలన్నారు. సమీప పోలీస్టేషన్ లలో కానీ పిర్యాదు చేయాలన్నారు. లేదా కమీషనరేట్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న సైబర్ క్రైమ్ పోలీస్టేషన్లోనైనా బాధితులు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

# హరీష్‌రావు మళ్లీ సవాల్.. తాను సిద్ధమే



హైదరాబాద్, జనవరి 22 పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహిస్తోంది తెలంగాణ ప్రభుత్వం. అయితే అక్కడక్కడ చిన్నపాటి సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేస్తోంది విపక్ష బీఆర్ఎస్. ఈ క్రమంలో లైమ్ లైట్‌లోకి వచ్చేశారు ఆ పార్టీ ఎమ్మెల్యే హరీష్‌రావు.క్షేత్ర స్థాయిలో పరిస్థితి తెలుసుకునేందుకు గ్రామ సభలకు వెళ్దామా అంటూ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. తాను గ్రామ సభకు వస్తానని, ముఖ్యమంత్రి కూడా రావాలని మెలిక పెట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధిపేటకు రావాలని, లేదంటే కొండారెడ్డి పల్లికి ఇద్దరు కలిసి వెళ్దామన్నారు.ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజలు దరఖాస్తులు పెట్టుకున్నారని, ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. దరఖాస్తు పెట్టినప్పుడల్లా 40 రూపాయల వరకు ఖర్చవుతోందన్నారు. దరఖాస్తుల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. పోలీసులను అడ్డు పెట్టుకుని గ్రామ సభలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు.రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత ఒక్క ఇల్లు కట్టలేదన్నారు. అసలైన అర్హులకు పథకాలు కచ్చితంగా అందజేయాలన్నారు. పనిలోపనిగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోటోకాల్ పాటించ లేదని మనసులోని మాట బయటపెట్టారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్నచోట ఫ్లెక్సీలో ఫోటోలు పెడుతున్నారని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలున్న చోట అదీ లేదన్నారు. ప్రోటోకాల్‌ని తుంగలో తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.హరీష్‌రావు మాటలపై కాంగ్రెస్ నేతలు కౌంటరిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్‌కి వెళ్లారని, ఈ విషయం తెలిసి గ్రామానికి రావాలంటూ హరీష్‌రావు సవాల్ విసరడంపై ఎద్దేవా చేస్తున్నారు. గడిచిన పదేళ్లు బీఆర్ఎస్ పాలన వల్లే ఇవాళ ప్రజలు అనేక కష్టాలు అనుభవిస్తున్నారని గుర్తు చేస్తున్నారు.గ్రామ సభ పెట్టి ఒక్కరోజు మాత్రమే అయ్యిందని గుర్తు చేస్తున్నారు నేతలు. తలెత్తుతున్న సమస్యలకు ఫుల్ స్టాప్ పెట్టే ప్రయత్నం మంత్రి ఉత్తమ్ చేస్తున్నారని అంటున్నారు. అధికారం పోయిన తర్వాత ప్రజల్లోకి వెళ్లలేక ఈ విధంగానైనా వెళ్లాలని బీఆర్ఎస్ నేతలు సవాళ్లు విసురుతున్నారని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాలాసార్లు ఛాలెంజ్ చేసినా, కారు పార్టీ నేతలు స్పందించకపోవడాన్ని గుర్తు చేస్తున్నారు.

# గ్రామ సభల సమస్యలు.. పరిష్కారం కోసం రాత్రికి

హైదరాబాద్, జనవరి 22 గ్రామ సభల్లో తలెత్తుతున్న సమస్యలకు ఫుల్ స్టాప్ పెట్టేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. రేషన్ కార్డుల వ్యవహారం చాలామందికి జఠిలమైంది. దరఖాస్తు చేసుకున్న వారికి తిరస్కరణ గురైన సందర్భాలు కనిపిస్తున్నాయి. గ్రామ సభల్లో ప్రాక్టీకల్‌గా ఎదురవుతున్న సమస్యలను తెలుసుకునేందుకు రంగంలోకి దిగారు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి.పదేళ్ల తర్వాత రేషన్ కార్డులు ఇస్తుండడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్నారు. జనవరి 26 నుంచి నాలుగు స్కీములను ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది రేవంత్ సర్కార్. ఈ నేపథ్యంలో జనవరి 21 నుంచి 24 వరకు గ్రామాలు, వార్డుల్లో సభలు నిర్వహిస్తున్నారు.రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట గ్రామాల్లో సభలు పెట్టి లబ్దిదారులను ఎంపిక చేయనున్నారు అధికారులు. ఎంపీడీఓ, ఎమ్మార్వో ఆధ్వర్యంలో జరుగుతున్న సభలకు కలెక్టర్ స్థాయి అధికారులు సైతం హాజరవుతున్నారు.తెలంగాణ వ్యాప్తంగా 12, 789 గ్రామాలకు గాను తొలిరోజు 3,400 గ్రామ సభలు నిర్వహించారు. అయితే సభల్లో తమ పేర్లు లేవంటూ అక్కడక్కన నిరసనలు మొదలయ్యాయి. జాబితాలో పేర్లు లేనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నప్పటికీ, లబ్దిదారుల్లో మాత్రం ఆందోళన నెలకొంది.కొంతమందికి కొత్త రేషన్ కార్డులకు సంబంధించి తమ పేర్లు లేవని అంటున్నారు. ఇంకొందరికి ఇందిరమ్మ ఇళ్లలో తమ పేర్లు కనిపించలేదని వాపోతున్నారు. ఈ క్రమంలో తలెత్తిన సమస్యలపై గతరాత్రి ప్రభుత్వానికి నివేదిక వచ్చినట్టు సమాచారం. ఈ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రంగంలోకి దిగేశారు.ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలకు ఫుల్ స్టాప్ పెట్టేందుకు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆన్ లైన్‌లో సమావేశం రాత్రి 8 గంటలకు నిర్వహించనున్నారు. ఆయా సమస్యలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని భావిస్తున్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com